అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 08-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి: 11 | సంచిక: 16 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 14 పేజీలు | వెల: 6.50





10న గ్రూప్-1 ప్రొవిజినల్ మార్కుల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ ప్రొవిజినల్ మార్కుల వివరాలను ఈనెల పదో తేదీన ప్రకటిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) తెలిపింది. శుక్రవారం టీజీపీఎస్సీ పాలకమండలి సమావేశాన్ని నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అనేక నోటిఫికేషన్ల స్థితిగతుల గురించి సమీక్షించారు. అనంతరం టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం వివిధ నోటిఫికేషన్లకు సంబంధించిన జీఆర్ఎల్, ఫలితాల విడుదల కోసం షెడ్యూల్‌ను ఆమోదించి ఒక ప్రకటన విడుదల చేశారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి గతేడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిందని తెలిపారు. ఈనెల 11న గ్రూప్-2 రాతపరీక్షల జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈనెల 14న గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను ప్రకటిస్తామని వివరించారు. ఈనెల 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హెచ్‌డబ్ల్యూవో) రాతపరీక్షల తుది ఫలితాలను విడుదల చేస్తామని తెలిపారు. ఈనెల 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ (ఈవో) పరీక్షలకు సంబంధించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్)ను విడుదల చేస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగాలిప్పిస్తామంటే ఫిర్యాదు చేయండి

గ్రూప్-1 నియామకాలకు సంబంధించి ఎలాంటి తప్పుడు, తప్పుదారి పట్టించే సమాచారాన్ని నమ్మొద్దని బుర్రా వెంకటేశం అభ్యర్థులను కోరారు. టీజీపీఎస్సీ రాజ్యాంగబద్ధమైన సంస్థ అనీ, ప్రతిభావంతులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయడానికి సూచించిన అన్ని నియమాలు, విధానాలను పాటిస్తుందని వివరించారు. గతంలో పేర్కొన్న విధంగా ఎవరైనా మధ్యవర్తులు కమిషన్ సిబ్బందితో కానీ మరే అధికారులతో కానీ పరిచయాలు ఉన్నాయనీ, ఉద్యోగాలు కల్పిస్తామనీ, సమాచారాన్ని పొందడంలో సహాయం చేస్తామంటూ ఎవరైనా అభ్యర్థులను సంప్రదిస్తే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయాలని కోరారు. ఆ సమాచారాన్ని పోలీసు ఫిర్యాదుతో కలిపి కమిషన్‌కు తెలియజేయడానికి 9966700339 మొబైల్ నెంబర్ లేదా జఱఅస్త్రఱశ్రీఉఅషవవీంజూం.స్త్రశీఙ.ఱఅ మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఉద్యోగాలను కల్పిస్తామనే తప్పుడు వాగ్దానాలు ఇచ్చిన మధ్యవర్తులు లేదా వ్యక్తుల గురించి ఇప్పటి వరకు కమిషన్‌కు ఒక్క ఫిర్యాదు/సమాచారం కూడా అందలేదని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. కమిషన్‌ను అప్రతిష్టపాలు చేయడం, నిరుద్యోగ యువతలో గందరగోళం/అశాంతి సృష్టించడం అనే ఉద్దేశంతో మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. అటువంటి వ్యక్తులపై దృఢమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి కమిషన్ వెనుకాడబోదని ఆయన హెచ్చరించారు. కమిషన్ పారదర్శకమైన పూర్తిస్థాయి నియామక విధానాలను అనుసరిస్తుందనేది అభ్యర్థులు గమనించాలని సూచించారు. తప్పుదారి పట్టించే వృత్తి/వ్యక్తుల గురించి నేరుగా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. అటువంటి వారిపై కఠినంగా వ్యవహరించడానికి వీలుగా పోలీసు ఫిర్యాదును ఆధారాలతోపాటు కమిషన్‌కు పంపాలని సూచించారు.

టీజీపీఎస్సీ షెడ్యూల్

నోటిఫికేషన్ పేరు	ఫలితాల ప్రకటన/జీఆర్ఎల్
1. గ్రూప్-1	మార్చి 10న అభ్యర్థికి వచ్చిన ప్రొవిజినల్ మార్కుల వివరాల ప్రకటన
2. గ్రూప్-2	మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల
3. గ్రూప్-3	మార్చి 14న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల
4. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్	మార్చి 17న తుది ఫలితాల ప్రకటన
5. ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్	మార్చి 19న జనరల్ ర్యాంకింగ్ జాబితా (జీఆర్ఎల్) విడుదల

గొర్రెల మంద పై కుక్కల దాడి

11 గొర్రెలు మృతి, గాయపడ్డ 20 గొర్రెలు

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలో ఘటన



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గొర్రెల మందపై కుక్కలు దాడి చేసిన ఘటనలో 11 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడిన ఘటన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలం నాగపూర్ గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగపూర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బసకొండ బాలమల్లేష్ తన గొర్రెల మందను రోజులాగే గురువారం రాత్రి కొట్టంలో ఉంచాడు. శుక్రవారం తెల్లవారుజామున గొర్రెల కొట్టం వద్దకు వచ్చి చూడగా కుక్కలు మంద పై దాడి చేయడం చూసి వాటిని తరిమేశాడు. అనంతరం కొట్టంలోకి వెళ్లి చూడగా పలు గొర్రెలు మృతి చెందగా, మరి కొన్ని తీవ్రంగా గాయపడి ఉన్నాయి. గొర్రెల కొట్టంలోకి కుక్కలు చొరబడి దాడి చేయగా 11 గొర్రెలు మృత్యువాత పడగా, మరో 20గొర్రెలు గాయపడ్డట్టు బాధితుడు బాల మల్లేష్ ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడ్ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన విషయాన్ని ఉదయమే పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా ఎవరూ వచ్చి చూడలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాల మల్లేష్ వేడుకున్నారు.

గర్ల్స్ హాస్టల్‌లో స్పై కెమెరా

గుర్తించిన విద్యార్థినులు

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఘటన



నవతెలంగాణ-అమీన్‌పూర్

గర్ల్స్ హాస్టల్‌లో రహస్యంగా పెట్టిన స్పై కెమెరాను విద్యార్థినులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే.. అమీన్‌పూర్ మున్సిపాల్టీ కిష్టారెడ్డి పేట పరిధిలోని మైత్రి విల్లాస్‌లో బండారు మహేశ్వర్ 2021 నుంచి లక్ష్మీ గర్ల్స్ హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. అయితే ఈ హాస్టల్‌లో తాజాగా ఓ స్పై కెమెరాను విద్యార్థినులు గుర్తించారు. దాంతో అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. స్పై కెమెరాలోని పలు చిప్స్‌ను పరిశీలిస్తున్నారు. మరోవైపు హాస్టల్‌లో 35 విద్యార్థినులు ఉంటున్నట్టు తెలుస్తోంది.

సమగ్రసర్వేపై స్వతంత్ర కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. కమిటీ సభ్యులుగా డాక్టర్ సుఖదేవ్, రిటైర్డ్ ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, ప్రొఫెసర్ శాంత సిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, ప్రొఫెసర్ భూక్యా భంగ్యా, ప్రత్యేక ఆహ్వానితులుగా జీన్ డ్రీజ్ ఉంటారని తెలిపారు. ఈ నిపుణుల కమిటీ సర్వేపై అధ్యయనం చేసి నివేదికను నెల రోజుల్లో ప్రణాళిక శాఖకు అందజేయాలని సూచించారు. సామాజిక న్యాయానికి పునాది వేయాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సర్వే నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాక్ గా ఏర్పాటు చేసుకొని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా పారదర్శకంగా సర్వే జరిపించినట్టు తెలిపారు. దానిపై వస్తున్న విమర్శల్లో నిజమెంతో సామాజిక వేత్తల అధ్యయనంతో తేలిపోనుందని అన్నారు. సమావేశంలో ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

ముస్లిం మహిళలే టార్గెట్

ఏఐతో అశ్లీల చిత్రాలు | సోషల్ మీడియాలో హిందూత్వశక్తుల పైశాచికానందం

- అసభ్య కంటెంట్‌తో ప్రజల మధ్య వైషమ్యాలు
- మోడీ సర్కారు ఉదాసీన వైఖరి
- కఠిన చర్యలు తీసుకోవాలి : సామాజిక కార్యకర్తలు, మేధావుల డిమాండ్





కృత్రిమ మేధ(ఏఐ) ప్రస్తుతం ప్రపంచంపై తన ప్రభావాన్ని చూపెడుతున్నది. ప్రతీ రంగాన్ని శాసించే శక్తి ఏఐకు ఉన్నదన్నది సాంకేతిక నిపుణుల మాట. దీంతో ఇప్పటికే కొన్ని కంపెనీలు ఏఐ వైపు మళ్లటంలో శ్రద్ధ వహిస్తున్నాయి. ఈ సాంకేతిక పరిజ్ఞానం విషయంలో రోజురోజుకూ కొత్త మార్పులు వస్తున్నాయి. అమెరికా,చైనా దేశాలు కృత్రిమ మేధ విషయంలో పోటీ పడుతున్నాయి. పొరుగుదేశం చైనా 'డీప్ సీక్'తో ముందుకొచ్చి ప్రపంచంలో సంచలనం సృష్టించింది. అమెరికా 'చాట్‌జీపీటీ'కి సవాలు విసిరింది.

న్యూఢిల్లీ : భారత్‌లో మాత్రం పరిస్థితులు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ప్రతి విషయంలోనూ చైనా, అమెరికాలతో పోటీ పడి ముందుకెళ్తున్నామని చెప్పుకునే మోడీ ప్రభుత్వం.. అటు వైపు ప్రభావవంతంగా పని చేయటం లేదన్నది నిపుణుల మాట. ముఖ్యంగా, భారత్‌లో ఈ ఏఐని మంచి విషయాల కంటే చెడు, పనికిరాని విషయాల కోసం ఎక్కువగా వాడుతున్నట్టు వారు వివరిస్తున్నారు.



గత 11ఏండ్ల మోడీ పాలనలో దేశంలో హిందూత్వ శక్తులు చెలరేగిపోతున్నాయి. మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలే లక్ష్యంగా దాడులకు తెగబడుతున్నాయి. వారిపై మానసికంగా, భౌతికంగా ఎన్నో దాడులు చేస్తున్నాయి. హిందూత్వశక్తుల ఈ పైత్యపు చేష్టలు సామాజిక మాధ్యమాలకూ ఎక్కాయి. ముస్లిం మహిళలే టార్గెట్‌గా అసభ్యపు కంటెంట్‌ను సృష్టిస్తున్నాయి. ఇందుకు కృత్రిమ మేధను ఉపయోగిస్తున్నాయి. ఏఐ సహాయంతో సదరు ముస్లిం మహిళలు లేదా ముస్లిం మహిళల రూపంలో ఉన్నటువంటి అశ్లీల చిత్రాలను సృష్టిస్తున్నాయి.

హిందూత్వ శక్తుల ఆగడాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. ఈ విధమైన అభ్యంరతకరమైన రాతలు, పోస్టులు పెడుతూ సమాజంలో వైషమ్యాలు తీసుకొస్తున్నాయని సామాజిక కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "నా ఫాలోవర్ల సంఖ్య పెరుగుతున్నప్పటి నుంచి నా ట్విట్టర్ డీఎంలో హిజాబీ మహిళల పోర్నోగ్రఫిక్ చిత్రాలు వస్తున్నాయి. నా చిత్రాలను కూడా మార్ఫ్ చేస్తామని సదరు మెసేజీలు చేస్తున్న వ్యక్తులు నన్ను బెదిరిస్తున్నారు. ప్రస్తుతం ఏఐ టూల్స్ చాలా అడ్వాన్స్‌డ్‌గా మారాయి. కాబట్టి అలాంటి చిత్రాలను కలిగి ఉన్న మెసేజ్‌లూ పెరిగాయి" అని ఢిల్లీకి చెందిన కవి, సామాజిక కార్యకర్త నబియా ఖాన్ తన ఆందోళనను వ్యక్తం చేశారు. 2021లో సంచలనం రేపిన 'సల్లీ డీల్స్' యాప్‌లో హిందూత్వ శక్తులు టార్గెట్ చేసిన కొందరు ప్రముఖ సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులలో నబియా ఖాన్ కూడా ఒకరు. ఏఐ-పవర్డ్ జనరేషన్ టూల్స్ సహాయంతో హిందూత్వ శక్తులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి కొన్ని ప్రముఖ సోషల్ మీడియాలో రెచ్చిపోతున్నాయి. కొన్ని మాత్రం.. తమ ఖాతాలు, పేజీలను ఈ పనుల కోసమే వాడుతూ ఇంటర్నెట్‌లో ముస్లిం మహిళల సెమీ-పోర్నోగ్రఫిక్ చిత్రాలను పోస్ట్ చేస్తున్నాయి. ఇవి చాలా అభ్యంతరకరంగా ఉంటున్నాయి. వేరొక మతానికి చెందిన వ్యక్తితో ముస్లిం మహిళ అత్యంత సన్నిహితంగా ఉన్నటువంటి ఫోటోలను ఏఐ ద్వారా హిందూత్వ శక్తులు తయారు చేస్తున్నాయి. ఇందులో ఆ వ్యక్తి సదరు మతానికే చెందినవాడని చూస్తే చెప్పే విధంగా ఫోటోలు ఉంటాయి. ముస్లిం మహిళలు ధరించే బుర్ఖా, హిజాబ్‌ల గురించి చులకన చేసే విధంగా, వారి సాంప్రదాయాలను అపహాస్యం చేసేలా ఈ పోస్టులు ఉన్నాయి. హిజాబ్, బుర్ఖాల విషయంలో బీజేపీ రాజకీయాలు సర్వసాధారణమే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటక వంటి రాష్ట్రంలో ఈ అంశంపై పెద్ద చర్చే జరిగింది. బీజేపీ, హిందూత్వ శక్తులు ఆ సమయంలో ఈ ఘర్షణల వెనక ఉన్నాయన్నది విశ్లేషకులు చెప్తున్నారు. కాబటి.. ప్రస్తుత విషయంలోనూ వాటి హస్తం ఉన్నదనే విషయాన్ని కచ్చితంగా చెప్పొచ్చని అంటున్నారు. సల్లీ డీల్స్ యాప్ ద్వారా గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఈ సందర్భంగా నబియా ఖాన్ గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు ఏఐ ఇమేజ్‌లలో ముస్లిం మహిళలను చూపిస్తున్న విధంగానే నబియా అనే ముస్లిం స్త్రీపై దాడి జరిగిందని వివరించారు. భారత ముస్లింలను అవమానించటమే వారి(హిందూత్వ శక్తులు) లక్ష్యమని ఆమె అన్నారు. ముస్లిం సమాజాన్నే అవమానించేలా కొన్ని సామాజిక మాధ్యమ ఖాతాల పేర్లు ఉంటున్నాయి. వారి ఆచారాలను అవహేళన చేసే విధంగా ఇవి ప్రతిబింబిస్తున్నాయి. ముస్లిం మహిళలను ఒక లైంగిక వస్తువుగా, వేశ్యగా చిత్రీకరిస్తూ వారిని అవమాన పరుస్తున్నాయి. ముస్లిం యువతులను ట్రాప్ చేసి వారిని మతం మార్చేలంటూ మరికొన్ని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ పేజీలు, ఖాతాలు విచ్చలవిడిగా పని చేస్తున్నాయి. అశ్లీల వీడియోలు, చిత్రాలను వాడుకొని ముస్లిం మహిళలు, ఆ సమాజానికి వ్యతిరేకంగా మీమ్స్‌ను తయారు చేస్తున్నాయి హిందూత్వ శక్తులు.

ఇక కొన్ని ఇన్‌స్టా పేజీలలోనైతే.. హిందు మతంలోని కులాల పేర్లు ఉన్నాయి. 'జాలిమ్ పండిట్', 'జాలిమ్ బ్రాహ్మన్', 'జాలిమ్ ఠాకూర్' వంటివి ఇందులో కొన్ని. ఈ పేర్లు పెత్తందారీ కులాలకి చెందినవి. ఈ పేజీలో కొన్ని మాత్రం ముస్లిం మహిళలను అసభ్యకరంగా, అభ్యంతరకరంగా చూపించటానికే పని చేస్తున్నాయి. అయితే, ఓబీసీ, దళిత కులాల పేర్లను జోడిస్తూ పేర్లను కలిగి ఉన్న పేజీలు మాత్రం తమ విశ్లేషణలో ఎక్కడా కనబడలేదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు.

ఈ మొత్తం తతంగం వెనక పెత్తందారీ కులాలకు చెందినవారి హస్తం కూడా ఉన్నదని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముస్లిం మహిళలను టార్గెట్ చేసుకోవటం ఇది కొత్తేమీ కాదని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు. 2002 గుజరాత్ అల్లర్లలోనూ ముస్లింలను, ముఖ్యంగా ఆ మతానికి చెందిన మహిళలపై జరిగిన దాడులను గుర్తు చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ పరివారమంతా ఆదర్శమూర్తిగా, జాతీయవాదిగా ప్రేమించే వి.డి సావర్కర్ గతంలో చేసిన మాటలనూ వారు ఉటంకిస్తున్నారు. 'హిందూ రాజులు ప్రతీకారచర్యలో భాగంగా ముస్లిం మహిళలపై లైంగికదాడి, వేధింపులకు పాల్పడటం చేసి ఉండాల్సింది' అని సావర్కర్ సిక్స్ గ్లోరియస్ ఎపోక్స్'లో చెప్పారని వివరిస్తున్నారు.

వాస్తవానికి భారత్ అనేది ఒక లౌకిక దేశం. అయితే, బీజేపీ కేంద్రంలో, ఇతర రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది. హిందూత్వ శక్తులకు మద్దతు పలుకుతున్నది. వారు చేసే ఇలాంటి దారుణ పనులకు అభ్యంతరం చెప్పటం లేదు. ఐటీ చట్టం, రాజద్రోహం వంటి వాటిని మీడియా, సామాజిక కార్యకర్తలపై ప్రయోగించి భావ ప్రకటనా, పత్రికా స్వేచ్ఛను హరించే మోడీ సర్కారుకు.. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ విషపు ప్రచారం కనిపించటం లేదా? అని సామాజిక కార్యకర్తలు, మేధావులు ప్రశ్నిస్తున్నారు.

పంట రక్షణే ప్రమాదమై..

విద్యుద్ఘాతంతో అన్నదమ్ములు మృతి

నవతెలంగాణ-జహీరాబాద్





అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు చేపట్టిన ప్రయత్నం విఫలమై అన్నదమ్ములు విద్యుద్ఘాతంతో మృతి చెందారు. బైండింగ్ వైరును పంట చుట్టూ ఏర్పాటు చేసి.. 11 కేవీ విద్యుత్ వైర్ల ద్వారా నేరుగా కరెంట్ షాక్ ఇద్దామని ప్రయత్నిస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇద్దరూ మరణించారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం గోవింద్‌పూర్‌లో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరుకల జగన్(48), ఎరుకల మల్లేశం అనే అన్నదమ్ములు వారి చెరకు పంటను అడవి పందుల నుంచి కాపాడుకోవడానికి పంట చుట్టూ బైండింగ్ వైరుతో రక్షణ ఏర్పాటు చేశారు. ఆ బైండింగ్ తీగలకు పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ ద్వారా కరెంట్ ఇవ్వాలనుకున్నారు. గురువారం సాయంత్రం ఏడు గంటల సమయంలో కొండీల ద్వారా కరెంటు ఇవ్వడానికి జగన్ ప్రయత్నిస్తుండగా విద్యుద్ఘాతంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి అక్కడికక్కడే మృతి చెందాడు. అది గమనించిన మల్లేష్ ఆ వైరును పక్కకు లాగేద్దామని పట్టుకోగానే.. అతడికి కూడా కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

చాకచాక్యంగా వ్యవహరించిన బాలుడు..

14 ఏండ్ల వయస్సున్న బన్నీ.. మృతులైన తన మామలతో పొలం దగ్గరికి వెళ్లాడు. ప్రమాదం జరిగిన వెంటనే మామల చేతిలో ఉన్న వైరును పట్టుకోకుండా.. తన వద్ద ఉన్న కర్రతో కొట్టాడు. వారి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అక్కడే ఉన్న గొడ్డలితో కొట్టి రక్షించడానికి ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో వెంటనే ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, 8 నెలల క్రితం అదే పొలం వద్ద మృతుల తండ్రి నాగన్న పాముకాటుతో మృతిచెందారు. మళ్లీ అక్కడే అన్నదమ్ములిద్దరూ మరణించడంతో వారి కుటుంబంతో పాటు.. గ్రామంలోనూ విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు జగన్ మొదటి భార్యకు ఇద్దరు పిల్లలున్నారు. ఆమె మృతిచెందడంతో మరో వివాహం చేసుకోగా.. ఆమెకు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. మల్లేష్‌కు ముగ్గురు పిల్లలు. తండ్రుల మృతితో ఆ పిల్లలందరూ అనాథలయ్యారు.

శాఖాపరంగా ఆదుకునేందుకు కృషి : విద్యుత్ శాఖ

పొలం పై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్లే ప్రమాదానికి కారణమని, మృతుల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని బంధువులు ఆందోళన చేశారు. దాంతో సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ గిరిధర్ రెడ్డి విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరిపి విద్యుత్‌శాఖ పరంగా వారి కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దాంతో బంధువులు ఆందోళన విరమించారు.

మహిళలను ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత గుత్తా జ్వాల

నా తల్లి నాకు మొదటి గురువు : జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్

వికారాబాద్ కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

నవతెలంగాణ-వికారాబాద్ కలెక్టరేట్

మహిళలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ప్రముఖ బ్యాట్మెంటన్ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత గుత్తా జ్వాల అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వికారాబాద్ కలెక్టరేట్‌లో టీజీఓ జిల్లా కమిటీ, మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి గుత్తా జ్వాల హాజరై మాట్లాడారు.. మహిళలు సమాజంతో పాటు తమ హక్కులపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు విద్యను అభ్యసించడంతోపాటు ఆత్మవిశ్వాసంతో సమాజంలో ముందుకు వెళ్లాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వల్ల మంచి చెడులను గ్రహిస్తూ సమాజంలో తోటి వారిని, కుటుంబాల్లో మంచి మార్పులు తీసుకొచ్చే విధంగా ఆలోచన చేయాలని తెలిపారు. అమ్మాయి, అబ్బాయి అనే తేడా లేకుండా చిన్ననాటి నుంచి అమ్మాయిలను ప్రోత్సహించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. తన జీవితంలో మొదటి గురువు తన తల్లి అని తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో రూపొందించిన విధంగా సమాజంలో అసమానతలకు గురికాకుండా, మహిళలను సమాన దృష్టితో చూడాలన్నారు. మగవారి విజయం వెనక మహిళల సహకారం తప్పక ఉంటుందన్నారు. జిల్లా యంత్రాంగంలో మహిళా ఉద్యోగులు తమకు అప్పజెప్పిన పనులను సక్రమంగా నిర్వహిస్తున్నారని, వారి విధిపట్ల ఉన్న అంకితభావానికి గర్విస్తున్నానని తెలిపారు.

మహిళా దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ సాయి చౌదరి, వైస్ చైర్మెన్ డాక్టర్ సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన వారిలో కలెక్టర్ సీసీ నరేందర్, డీపీఆర్ఓ సిబ్బంది సతీష్‌కుమార్‌తో పాటు వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది ఉన్నారు. బొంరాస్‌పేట్ ఆశ్రమ పాఠశాల మహిళా ఉపాధ్యాయులు చేసిన బంజార నృత్యం, భరత నాట్యం చూపరులను ఆకట్టుకుంది. అనంతరం క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా క్రీడాకారులకు, కలెక్టరేట్, మున్సిపల్, రెవెన్యూ, విద్య, వైద్య, పోలీస్ మహిళా సిబ్బంది, అంగన్‌వాడీ, మహిళా సంఘాల సభ్యులకు బహుమతులను అందజేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన రంగోలి, మ్యూజికల్ చైర్, చెస్ పోటీలో పాల్గొన్న విజేతలకు బహుమతులు, రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఎస్ సీడీఓ ఎస్.మల్లేశం, డీటీడబ్ల్యూఓ కమలాకర్‌రెడ్డి, సీడబ్ల్యూసీ చైర్మెన్ వెంకటేష్, డీపీఓ జయసుధ, డీపార్ఓ చెన్నమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆపరేషన్ డి

ఎస్ఎల్‌బీసీలో కార్మికుల కోసం అన్వేషణ

- సిస్మాలజీ బృందం పరీక్షలు
- టన్నెల్‌లోకి బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్ క్యాడవర్ శునకాలు
- మట్టి పడి టీబీఎం యంత్రం ధ్వంసం
- అందులోనే 8 మంది చిక్కుకున్నట్టు అనుమానాలు

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎల్‌బీసీ టన్నెల్‌లో చిక్కుకున్న ఎనిమిది మంది కార్మికుల కోసం రెస్క్యూ ఆపరేషన్14వ రోజుకు చేరింది. రెస్క్యూ బృందాలు ఆపరేషన్ 'డి'ని అమలు చేస్తున్నాయి. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కార్మికుల అన్వేషణకు శుక్రవారం ఉదయం 7.15 నిమిషా లకు క్యాడ్‌వార్ డాగ్స్ బృందం వెళ్లింది. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం 110 మందిని తీసుకొని లోకో ట్రైన్ టన్నెల్‌లోకి వెళ్లింది. పర్యవేక్షణకు డోగ్రా రెజిమెంట్ ఆర్మీ కమాండెంట్ పరీక్షిత్ మెహ్రా, ఎన్‌డీఆర్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డా.హర్షిత్ వెళ్లారు. బెల్జియన్ మాలినోయిస్ బ్రీడ్‌కు చెందిన క్యాడవర్ శునకాలను టన్నెల్ లోపలికి తీసుకెళ్లారు. 15 ఫీట్ల లోపల ఉన్నా.. మృతదేహాలను గుర్తించడం వీటి ప్రత్యేకత అని అధికారులు చెబుతున్నారు. ఇవి కేరళ వాయనాడ్ వరద సమయంలో చిక్కుకున్న వారిని, బురదలో కూరుకున్న మృతదేహాలను పసిగట్టడంలో కీలక పాత్ర పోషించాయి. అక్కడి పరిస్థితులను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ సంతోష్ బాదావత్ ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారు. ఉబికి వస్తున్న నీరు, పేరుకుపోతున్న బురదతో కార్మికుల ఆనవాళ్ల గుర్తింపు సవాలుగా మారింది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రెటరీ కల్నల్ కీర్తి ప్రతాప్ సింగ్ శుక్రవారం టన్నెల్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆయనకు రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ టన్నెల్‌కు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులను వివరించారు. సిస్మాలజీ బృందం పరీక్షల ద్వారా టన్నెల్ లోపల 13.6 కిలోమీటర్ల ప్రాంతంలో టీబీఎంపై రాళ్లు, మట్టి పడి యంత్రం ధ్వంసమైందని అధికారులు తెలిపారు. అందులోనే 8 మంది చిక్కుకుపోయుంటారని వివరించారు. సిస్మాలజీ అధికారుల బృందం దోమలపెంట రేంజ్‌లోని తాటిగుండాల సెక్షన్ పరిధిలోని కుడ్లిపెంట ప్రాంతంలో భూ అంతర్గత పరిస్థితిని అంచనా వేసి పరీక్షలు నిర్వహించింది. దీని ఆధారంగా తదుపరి సహాయక చర్యలు కొనసాగించనున్నారు. నలుగురు సభ్యులతో కూడిన అన్వీ రోబోటిక్ నిపుణుల బృందం టన్నెల్‌లోకి వెళ్లింది. రోబోటిక్ నిపుణులతోపాటు ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కూడా లోపలకు వెళ్లారు. సొరంగంలో కనిపించకుండా పోయిన వారిని క్యాడవర్ శునకాలు గుర్తించే పనిలో ఉన్నాయి. ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్, రోబోటిక్ నిపుణులు టన్నెల్‌లో పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. శుక్రవారం రోబోటిక్ సహాయంతో మరింత ముందుకు కదిలారు. టన్నెల్ లోపల బ్యాటరీ సమస్య ఉందని, రోజ్‌కట్టర్ అవసరం అని సమాచారం అందించిన వెంటనే లోకో మోటార్‌లో అధికారులు లోపలికి పంపారు.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 08-03-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 | సంచిక : 16 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల: 6.50

గ్రేటర్ హైదరాబాద్‌లో మరోసారి ఓటీఎస్

ఆస్తి పన్ను చెల్లింపులో డిస్కౌంట్

- జీహెచ్‌ఎంసీలో 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యం




నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ ట్యాక్స్ పాత బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ సర్కారు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 90 శాతం వడ్డీని మాఫీ చేస్తూ వన్ టైమ్ సెటిల్‌మెంట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దాంతో 2024-25 సంవత్సరానికి కేవలం 10 శాతం వడ్డీతో బకాయిదారులంతా తమ ఆస్తిపన్ను చెల్లించే వసూలుబాటు కలుగుతుంది. ఇప్పటి వరకు రూ.6680 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ పేరుకుపోగా దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వ ప్రాపర్టీ ట్యాక్స్ బకాయిలు కూడా రూ.5 వేల కోట్లకు పెరుకుపోయాయి. ఈ మొత్తం రూ.11వేల 680కోట్ల బకాయిలకు వడ్డీ మాఫీ చేస్తే కొంతైనా మొండి బకాయిలు వసూలవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జీహెచ్‌ఎంసీకి ఈ వడ్డీ మాఫీతో నెలాఖరు వరకు సుమారు రూ.500 కోట్లవరకైనా ట్యాక్స్ వసూలై, ఆర్థికంగా ఉపశమనం కల్గిస్తుందన్న ఆలోచనలతోనే ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ స్కీంను అమల్లోకి తెచ్చినట్టు తెలిసింది. ఈ ఉత్తర్వులు ఈ నెలాఖరు వరకు అమల్లో ఉంటాయని సర్కారు స్పష్టం చేసింది. మొండి బకాయిలు వసూలు చేసుకునేందుకు జీహెచ్‌ఎంసీ ఇప్పటికే సుమారు 6లక్షల 30వేలకుపైగా నోటీసులు జారీ చేసింది. వీటిలో కొన్నింటికి వారెంట్లను జారీ చేయగా, ఇప్పటి వరకు 469 ఆస్తులను సీజ్ చేసింది. వాటి బకాయిలు ఇప్పటి వరకు రూ.19 కోట్లను వసూలు చేయగా, గురువారం ఒక్క రోజే సీజింగ్ ప్రాపర్టీల నుంచి సుమారు రూ.6.6 కోట్లు వసూలైనట్టు అధికారులు తెలిపారు. మరో రూ.443 కోట్ల ట్యాక్స్‌ను ఈ నెలాఖరులోపు వసూలు చేయాలన్న లక్ష్యం ఉంది.

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు

చేతులు కలపాలని కోరుతూ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల సీఎంలకు స్టాలిన్ లేఖ



చెన్నై : లోక్‌సభా నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను వ్యతిరేకిస్తూ సమైక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేసేందుకు కలిసి రావాల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ దక్షిణాది, తూర్పు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. వచ్చే జనాభా లెక్కల ప్రకారం ఆ ప్రక్రియను అమలు చేసినట్టైతే జనాభా పెరుగుదలను విజయవంతంగా నియంత్రించిన రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా ...10లో

10న గ్రూప్-1 ప్రొవిజినల్ మార్కుల ప్రకటన

11న గ్రూప్-2, 14న గ్రూప్-3 జీఆర్‌ఎల్ విడుదల

- 17న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాలు
- 19న ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జీఆర్‌ఎల్ జారీ : టీజీపీఎస్సీ చైర్మెన్ బుర్రా వెంకటేశం

వివరాలు 2లో..

దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

నియోజకవర్గాల పునర్విభజనను అందుకు ఆయుధంగా వాడుతోంది

- ఏం చేసినా దక్షిణాదిలో బీజేపీ జీరోనే
- గుజరాత్ మోడల్‌కు కాలం చెల్లింది
- తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శం : ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం ఎ.రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ లేదని, అందుకే ఆ రాష్ట్రాలపై ప్రతీకారం తీర్చుకుంటున్నదని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విమర్శించారు. గుజరాత్ నమూనాకు కాలం చెల్లిందని, తెలంగాణ నమూనానే దేశానికి ఆదర్శమని స్పష్టం చేశారు. శుక్రవారం నాడిక్కడ ఇండియా టుడే కాంక్లేవ్‌లో సీఎం ఎ.రేవంత్ రెడ్డి మాట్లా డారు. "గుజరాత్ నమూనాలో ఏ విధమైన సంక్షేమం లేదు. ఏమైనా అభివృద్ధి ఉందనుకుంటే అదీ లేదు. మోడీ ప్రధాని అయిన తర్వాత గుజరాత్ మార్కెటింగ్‌కు ఎవరైనా అంబాసిడర్ ఉన్నారా? లేరా? మోడీనే సొంతంగా గుజరాత్ కోసం ఉన్నారు. మోడీ ఈ దేశానికి ప్రధాని. ప్రధానమంత్రి హోదాలో.. దేశంలో ఏమూలకైనా పెట్టుబడులు వస్తే వాటికి ఆయన మద్దతు ఇవ్వడం లేదు. ఎవరైనా దేశానికి పెట్టుబడులు పెట్టడానికి వస్తే గుజరాత్ కు వెళ్లి పెట్టుబడులు పెట్టమని చెబుతున్నారు. ఇదేం పద్ధతి..?" అని ప్రశ్నించారు. "మాది అభివ ృద్ధి, సంక్షేమం, సుపరిపాలన నమూనా. ఈ మూడు మా ప్రాధాన్యాంశాలు. మేం అహ్మదాబాద్, ముంబయి, బెంగళూర్, ఢిల్లీతో పోటీ పడడం లేదు. మేం న్యూయార్క్, సియోల్, టోక్యోతో పోటీ పడాలనుకుంటున్నాం. మా తెలంగాణ నమూనాతో ఎవరూ పోటీ పడలేరు" అని అన్నారు. "అందుకే మేం ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన నగరం నిర్మించే పని ప్రారంభించాం. ఐదేండ్ల తర్వాత వచ్చి చూడండి. ప్రపంచంలో అత్యుత్తమ నగరం నిర్మించబోతున్నాం. గుజరాత్, అహ్మదా బాద్‌లో అటువంటి నగరం ఎక్కడైనా ఉందా..? కోవిడ్ సమయంలో ఔషధాలు ఎక్కడ తయారయ్యాయి. మూడో వంతు ఔషధాలు మేం సరఫరా చేశాం. దేశంలోని 35 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నాయి. ఐటీ గురించి మేం ...10లో



దిశానిర్దేశం

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగ సభ

- ఫామ్‌హౌస్‌లో ముఖ్యనేతలతో కేసీఆర్ సమాలోచనలు

నవతెలంగాణ-మర్కుక్

బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలపై పార్టీ అధినేత కేసీఆర్ శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపికపై కేసీఆర్ చర్చించినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ఏప్రిల్ 27న బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ బహిరంగసభను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలాగే ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం ఉంటుందని సమాచారం. సిల్వర్ జూబ్లీ పేరుతో హైదరాబాద్ లేదా వరంగల్‌లో బహిరంగ సభకు ప్లాన్ చేస్తున్నారు. కాగా, ఈ నెల 9 నుంచి ...11లో

కేంద్రంపై పోరు

11లో..

పెండింగ్ సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా

రిజర్వేషన్ల చట్టబద్ధతపై చర్చించనున్న సర్కార్

నేడు ప్రజాభవన్‌లో అన్ని పార్టీల ఎంపీలతో భేటీ

12 నుంచి అసెంబ్లీ

వివరాలు 11లో..

కొత్త ఐటీ చట్టం గోప్యతకు ముప్పు

ప్రజలు, విపక్షాలు బిల్లును వ్యతిరేకించాలని కేటీఆర్ విజ్ఞప్తి 11లో..



సమగ్రసర్వేపై

స్వతంత్ర కమిటీ

చైర్మెన్‌గా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమగ్ర కుటుంబ సర్వేపై అధ్యయనానికి సామాజికవేత్తలతో స్వతంత్ర హోదాతో కూడిన కమిటీని ఏర్పాటు చేసినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఆ సర్వేలోని సమాచారాన్ని విశ్లేషణ చేసి పొరపాట్లకు అవకాశం లేకుండా మేధావులు, సామాజిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సలహా కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి చైర్మెన్‌గా, రిటైర్డ్ ప్రొఫెసర్ కంచ ఐలయ్య వైస్ చైర్మన్‌గా, ప్రవీణ్ చక్రవర్తి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని భట్టి ...2లో

కార్మికుల కడుపుకొట్టి

యాజమాన్యాలకు దోచిపెడతారా?

కనీస వేతనాలను సవరించాల్సిందే... 1.20 కోట్ల మంది కష్టాలను పట్టించుకోండి

- అక్కడ మోడీ.. ఇక్కడ రేవంత్ శ్రమజీవులను దోచుకోవటంలో దొందు దొందే : ధర్నాలో చుక్కారాములు, పాలడుగు భాస్కర్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పెరిగిన ధరలకనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాల్సిందేనంటూ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనరేట్ వద్ద సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో కనీస వేతనాలు సవరించి ఫైనల్ జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. 'కార్మికుల కష్టాలు పట్టించుకోని ప్రభుత్వం డౌన్ డౌన్, 2024 జనవరి నెలలో ఇచ్చిన డ్రాఫ్ట్ జీవోలను సవరించి కనీస వేతనం పెంచాలి, 2021లో ఐదు రంగాల షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ ఫైనల్ నోటిఫికేషన్లను గెజిట్ చేయాలి, కనీస వేతనాల సలహామండలిలో అన్ని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి, వూయ్ వాంట్ జస్టిస్' అంటూ నినదించారు. సర్కార్ స్పందించకపోతే పోరాటం తప్పదంటూ హెచ్చరించారు.

ధర్నానుద్దేశించి చుక్కా రాములు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 1.20 కోట్ల మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారికి వర్తించే 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలను వారి 2006-12 మధ్య సవరించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడి 11 ఏండ్లయినా నేటికీ వారి వేతనాలు ఎందుకు పెంచలేదో చెప్పాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. 2014 నుంచి 2023 వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సమావేశాలకు, ప్రతిపాదనలకే పరిమితమైందని విమర్శించారు. అడ్వైజరీ బోర్డు నుంచి ప్రతిపాదనలు తీసుకుని ఫైనల్ జీఓలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పాలకుల నిర్లక్ష్యం మూలంగా లక్షలాది మంది కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకు విపరీతంగా పెరిగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ద్రవోల్బణం సగటున 6శాతంగా ఉందని తెలిపారు. కార్మికుల అవసరాలు కూడా పెరిగాయన్నారు. ఇతర వినియోగ వస్తువుల అవసరాలు, ఖర్చులు అదనంగా ఉంటున్నాయని చెప్పారు. వీటిని పరిగణలోకి తీసుకు ని 15వ ఐఎల్‌సీ తీర్మానం, అక్రాయిడ్ ఫార్ములా, 1992 సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా లెక్కించి వేతనాలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో 2021 జూన్‌లో 5 రంగాల షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాలు సవరిస్తూ ఫైనల్ నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ.. యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గెజిట్ చేయకుండా కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు.దీన్ని బట్టే పాలకులు ఎవరి పక్షమో అర్థమవుతుందని విమర్శించారు. కనీస వేతనాల జీవోలను సవరించటం ద్వారా ప్రభుత్వ ఖజానాకు ఎలాంటి లోటు లేదనీ, అయినా ప్రభుత్వం కార్మికుల వేతనాల పట్ల ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కనీస ...11లో

21 మంది ఐపీఎస్‌ల బదిలీలు

ఎస్పీలు, కమిషనర్లకు స్థాన చలనం

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో 21 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో కొన్ని జిల్లాల ఎస్పీలు, నగర కమిషనర్లకు స్థానచలనం కలిగింది. రాష్ట్ర ఎస్పీఎఫ్ డీజీ అనిల్ కుమార్‌ను రాష్ట్ర పోలీస్ పర్సనల్ అదనపు డీజీగా బదిలీ చేశారు. రామగుండం కమిషనర్ ఎం.శ్రీనివాసులును సీఐడీ ఐజీగా, వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను రామగుండం కమిషనర్‌గా, సూర్యాపేట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌కు డీఐజీగా పదోన్నతి ఇచ్చి వరంగల్ సీపీగా నియమించారు.పెద్దపల్లి డీసీపీ చేతనను రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఎస్పీగా, కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ ఇంటెలిజెన్స్ విభాగానికి, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్రను కామారెడ్డి ఎస్పీగా, నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయిచైతన్యను నిజామాబాద్ సీపీగా, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలంను కరీంనగర్ ...11లో

ఇంజినీరింగ్ కోర్సుపై అనాసక్తి

- ఆసక్తి చూపని విద్యార్థులు - తక్కువ ప్లేస్‌మెంట్ రేటే కారణం
- ఖాళీగా మిగిలిపోతున్న లక్షలాది సీట్లు : ఏఐసీటీఈ డేటా
- ప్రత్యామ్నాయ కోర్సుల వైపు స్టూడెంట్స్ చూపు



దేశంలోని సాంకేతిక రంగంలో ఇంజినీరింగ్ విద్య అనేది చాలా కీలకం. ప్రపంచంతో పోటీ పడే విధంగా దేశ భవిష్యత్తును ఈ కోర్సులు తీర్చి దిద్దుతాయనటంలో ఎలాంటి సందేహమూ లేదు. అంతేకాదు.. కోర్సు పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎక్కువ జీతాలతో ఉద్యోగాలను పొందేందుకు దారిని కూడా చూపిస్తాయి. అందుకే.. గత కొన్నేండ్ల క్రితం వరకు ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ ఎక్కువ. ఈ కోర్సుల్లో చేరటానికే విద్యార్థులు ఆసక్తి చూపేవారు.

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. విద్యార్థుల ఆలోచన తీరు మారింది. ఒకప్పుడు ఇంజినీరింగ్ కోర్సుల్లో ఎన్‌రోల్‌మెంట్ ఎక్కువగా ఉండేది. ప్లేస్‌మెంట్ రేట్లు కూడా చక్కగానే ఉండేవి. అయితే, భారత్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలలో మాత్రం ఎన్‌రోల్‌మెంట్, ప్లేస్‌మెంట్ రేట్లు తగ్గాయి. ఒకప్పుడు వెలుగువెలిగిన ఇంజినీరింగ్ కోర్సులు.. ఇప్పుడు వెలవెలబోతున్నాయని విద్యావేత్తలు, నిపుణులు, విశ్లేషకులు చెప్తున్నారు. భారత్‌లో టెక్నికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేటర్ అయిన ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) సమాచారమూ ఇదే విషయాన్ని వివరిస్తుండటం గమనార్హం. దేశంలో ఇంజినీరింగ్ కోర్సులకు డిమాండ్ తగ్గిందనీ, గత కొన్నేండ్లుగా ఇదే పరిస్థితి ఉన్నదని ఏఐసీటీఈ డేటా వివరిస్తున్నది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన వృత్తి విద్యగా ఇంజినీరింగ్ కోర్సుకు మంచి గౌరవం, డిమాండ్ ఉండేది. అయితే, గత కొన్నేండ్లుగా మాత్రం ఈ కోర్సులో చేరేవారి సంఖ్య మాత్రం తగ్గిపోయింది. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2023-24 మధ్య మూడువేలకు పైగా ప్రభుత్వ అనుబంధ, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలలో 64 లక్షల సీట్లకు గానూ 45.50 లక్షల సీట్లు భర్తీ అయ్యాయి. దాదాపు రెండు లక్షల బీటెక్ సీట్లు అంటే 30 శాతం భర్తీ కాకుండా . ...11లో

తగ్గిన ప్లేస్‌మెంట్లు

ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్లు సవాల్‌గా మారాయి. దేశవ్యాప్తంగా 2019-20 నుంచి 2022-23 మధ్య దాదాపు 34.30 లక్షల మంది విద్యార్థులు అండర్ గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరారు. అయితే, 16.4 లక్షల మందికి, అంటే 47.7 శాతం మంది విద్యార్థులు మాత్రమే ప్లేస్‌మెంట్‌లో విజయం సాధించటం గమనించాల్సిన అంశం.

సంపాదకీయం

వ్యంగ్యానికి సంకెళ్లు

'వికటన్' వెబ్‌సైట్‌ను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ అన్‌బ్లాక్ చేయాలని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వు వ్యంగ్యానికి కేంద్ర ప్రభుత్వం వేసిన సంకెళ్లను సడలించడమే! ఇది స్వాగతించదగినది. అయితే, వివాదానికి మూలమైన కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగించాలని చెప్పడం ద్వారా కేంద్ర నిరంకుశాధికారాల్ని న్యాయస్థానం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చకపోవడం ప్రజాస్వామ్య ప్రియులకు, భావ ప్రకటనా స్వేచ్ఛను బలపరిచే వారికీ బాధ కలిగిస్తుంది. అమెరికాలో నివసించడానికి తగు చట్టబద్ధ పత్రాలు లేవన్న కారణంతో వేలాదిమంది భారతీయ సంతతి పౌరులను అక్రమ వలసదారులని ముద్రవేసి, వారిని ఆ దేశం నుండి వెళ్లగొడుతున్న సంగతి లోకానికి ఎరుకే. అయితే, వారిని

జాతీయోద్యమ కాలం నుండి వందేళ్ల చరిత్రగల 'వికటన్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ కనీసం ఆ సమాచారాన్ని పదిహేను రోజులకు కూడా తెలియజేయకపోవడంతో మద్రాస్ హైకోర్టు గడప తొక్కవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో ధర్మాసనం 'వికటన్' వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఉత్తర్వులీయడం సానుకూలమైనదే! అయితే, ఆ కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగిస్తేనే అన్‌బ్లాక్ చేయాలనడాన్ని ఎవరూ సమర్ధించలేని పరిస్థితి. ఏది ఏమైనా మోడీ సర్కారు నిరంకుశ పోకడలపై ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పేరున్న మీడియా ఇలా ప్రచురించడం, నిర్బంధం విధిస్తే దాన్ని ప్రశ్నించడం అభినందనీయం.

కరుడుగట్టిన నేరస్తులు లేదా ఉగ్రవాదుల మాదిరి కాళ్లను గొలుసులతో బంధించి, చేతులకు సంకెళ్లు వేసి మాతృదేశానికి పంపడంతో యావత్ భారతీయులు తల్లడిల్లిపోయారు. అయినా పాలక బీజేపీకి, ప్రధాని మోడీకి ఇది పట్టలేదు. పైపెచ్చు తగిన పత్రాలు లేకుండా మరో దేశంలో నివసించడం నేరమేనంటూ భారతీయ మూలాలున్న పౌరులను కించపరుస్తున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి ఖట్టర్ దారుణమైన వ్యాఖ్యలు మరింత బాధాకరం.



అక్రమ వలసదారుల పేరిట మన పౌరులను గొలుసులు, బేడీలతో అమృతసర్ విమానాశ్రయానికి తరలించిన సమయంలోనే ప్రధాని మోడీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ల భేటీ జరిగింది కానీ భారత సంతతి పౌరులకు జరిగిన అవమానాన్ని గురించి ప్రశ్నించడం కాదు సరికదా కనీస ప్రస్తావన కూడా చేయలేదు. ఇటువంటి దుర్మార్గాన్ని ఎండగడుతూ 'వికటన్' వెబ్‌సైట్ ఒక కార్టూన్‌ను ప్రచురించింది. ఇరు దేశాధినేతల భేటీలో ప్రధాని నరేంద్ర మోడీ సంకెళ్లతో పాల్గొన్నట్లు దాంట్లో చిత్రించడం వాస్తవ పరిస్థితిని కళ్లకు కట్టింది. ఒక్క కార్టూన్‌లో ట్రంప్ దుర్మార్గాన్ని, నరేంద్ర మోడీ అచేతనత్వాన్ని, భారతీయుల ఆవేదననూ వ్యక్తం చేసిందనడంలో ఎలాంటి సందేహం లేదు. భారతీయ ఆత్మను, భారతీయుల ఆవేదననూ ప్రతిబింబించిన ఆ కార్టూన్‌పై ఆగ్రహించిన తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం, సమాచార ప్రసారశాఖ 'వికటన్' వెబ్‌సైట్ మొత్తాన్ని బ్లాక్ చేయడమూ ఆగ మేఘాలపై జరిగిపోయాయి. ఎన్నో ఆశలతో అమెరికాకు వెళ్లి అరదండాలతో వెనుదిరిగిన వేలాది మంది భారత యువతీయువకుల గురించి ఏమాత్రం చింతించని కమలం పార్టీ నేతలు ఈ కార్టూన్‌కు అంతలా కలత చెంది, ఆ వెబ్‌సైట్‌ను బ్లాక్ చేయించడం వారి నిరంకుశ పోకడలకు నిలువెత్తు నిదర్శనం. 1975-77 మధ్య దేశంలో సాగిన మీడియా సెన్సార్‌కు దీనికి ఏమీ తేడా లేదు కదా! అందుకే నరేంద్ర మోడీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలులో ఉందన్న కొందరి వ్యాఖ్యలు ఎంతమాత్రం సత్యదూరం కాదు.

జాతీయోద్యమ కాలం నుండి వందేళ్ల చరిత్రగల 'వికటన్' వెబ్‌సైట్‌ను బ్లాక్ చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ కనీసం ఆ సమాచారాన్ని పదిహేను రోజులకు కూడా తెలియజేయకపోవడంతో మద్రాస్ హైకోర్టు గడప తొక్కవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో జరిగిన విచారణలో ధర్మాసనం 'వికటన్' వెబ్‌సైట్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఉత్తర్వులీయడం సానుకూలమైనదే! అయితే, ఆ కార్టూన్‌ను తాత్కాలికంగా తొలగిస్తేనే అన్‌బ్లాక్ చేయాలనడాన్ని ఎవరూ సమర్ధించలేని పరిస్థితి. ఏది ఏమైనా మోడీ సర్కారు నిరంకుశ పోకడలపై ప్రజాస్వామ్యానికి నాలుగవ స్తంభంగా పేరున్న మీడియా ఇలా ప్రచురించడం, నిర్బంధం విధిస్తే దాన్ని ప్రశ్నించడం అభినందనీయం. న్యాయస్థానం పరిమితంగానైనా ఊరట నివ్వడం మంచిదే! అయితే విపత్కర పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న 'వికటన్' వెబ్‌సైట్‌కు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాతో సహా తమిళనాట అనేక మీడియా సంస్థలు సంఘీభావం తెలపడం శుభసూచికం. నిరంకుశ పోకడలను ఆదిలోనే ప్రశ్నించాలి, ఎదుర్కోవాలి, తిప్పికొట్టాలి. లేకపోతే అది తొండ ముదిరి ఊసరవెల్లి అయిన చందంగా ఒకనాటి హిట్లర్, ముస్సోలినీల పాలనను తిరిగి తేవాలనుకుంటున్న శక్తుల ప్రమాదం పెరుగుతుంది. ప్రజాస్వామ్య ప్రియులు, భారత రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛ పరిఢవిల్లాలని కోరుకునే వారందరూ అప్రమత్తంగా ఉండాలి. ముప్పును నివారించుకోవాలి!

"మార్చి 8" ఉత్సవం కాదు, మహోజ్వల పోరాట ఘట్టం



సతీష్ బైరెడ్డి
9949219213

ఏదైనా ప్రజాఉద్యమ చరిత్రను మరుగునపర్చాలన్నా, దాని స్ఫూర్తిని చంపేయాలన్నా దాన్ని ఉత్సవంగా మారిస్తే సరిపోతుందని పాలకులు అన్ని దేశాల్లో ప్రయత్నిస్తూనే ఉన్నారు. దానికి ఉదాహరణ అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినమైన మార్చి ఎనిమిదికంటే మరొకటుండదు. సరిగ్గా మనం గమనిస్తే దీన్ని వక్రీకరించినంతగా మరొక రోజు మనకు కనిపించదు.

పద్దెనిమిదో శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామిక విప్లవం విస్తరించిన నేపథ్యంలో ప్రధానంగా యూరప్, అమెరికా దేశాల్లో కార్మికులపైన శ్రమదోపిడీ కూడా అంతగానే విస్తరించింది. మహిళా కార్మికులైతే పనిచేస్తున్న చోట, ఇంట్లోనూ దోపిడీ, హింసనూ ఎదుర్కోవాల్సి వచ్చింది.బట్టల మిల్లుల్లో పనిచేసే స్త్రీలు అయితే రోజుకు పదహారు గంటల పాటు బలవంతంగా పనిచేయాల్సి వచ్చింది. గాలి, వెలుతురుతో పాటు ఇతర సదుపాయాల లేమి వల్ల వారు తీవ్రమైన అనారోగ్యానికి గురై ప్రధానంగా కంటిచూపును కోల్పోయారు. తమ చంటి పిల్లలకు పాలివ్వకుండా నిరంతరాయంగా పనిచేయాల్సి రావడం వల్ల మరుగుదొడ్లల్లో పిల్లలకు చాటుగా పాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలీ చాలని వేతనాలు, లైంగిక వేధింపులు అనేక రూపాల్లో అవమానాలు, అణచివేత నిత్యకృత్యమై తరుణంలో మహిళా కార్మిక లోకాన్ని ఉద్యమించక తప్పని స్థితికి నెట్టివేశాయి. ఈ నేపథ్యంలోనే 1908 మార్చిలో న్యూయార్క్‌లో 15వేల మంది మహిళా కార్మికులు పని గంటలు తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనమందించాలని, వేతనంతో కూడిన ప్రసూతి సెలవుకై, పిల్లల బాగోగులు, వారికి ఉచిత విద్యను అందించడం, ఓటింగు హక్కులు కల్పించాలని, పనిచేసే చోట మెరుగైన పరిస్థితులను ఏర్పర్చాలని మహా ప్రదర్శనను నిర్వహించారు. చారిత్రాత్మకమైన ఈ కార్యక్రమం ప్రపంచవ్యాప్తంగా మహిళలను మరింత సంఘటితపరిచేలా, నిర్మాణాత్మకమైన పోరాటాలకు పురికొల్పేలా చేసింది. నిజానికి ఈ గొప్ప పరిణామం వెనుక అర్ధ శతాబ్దానికి పైగా సాగిన అనేక అసంఘటిత పోరాటాలు, చరిత్రకు చేరని ఎన్నో ఘటనలు ఉన్నాయి. అమెరికన్ సోషలిస్టు పార్టీ, జర్మనీకి చెందిన సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకురాలు క్లారా జెట్కిన్‌తో పాటు రోజా లగ్జెంబర్గ్ లాంటి వాళ్లు భూస్వాములకు, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా మహిళా శక్తిని సమీకరించి క్రియాశీలకంగా వ్యవహించారు.

అమెరికన్ సోషలిస్టు పార్టీ మొదటగా మహిళా ఉద్యమ స్ఫూర్తిని చాటేలా ఫిబ్రవరి 28ని మొదటి మహిళా దినంగా ప్రకటించింది. నేడు జరుపుకుంటున్న మార్చ్ 8ని 1910లో కోపెన్ హెగెన్‌లో క్లారా జెట్కిన్ ప్రతిపాదించగా వంద దేశాల ప్రతినిధులు అమోదించారు. 1911 మార్చ్ 25న న్యూయార్క్ నగరంలో ట్రయాంగిల్ అగ్ని ప్రమాదంగా ప్రసిద్ధమైన అక్కడి బట్టల మిల్లులో జరిగిన భారీ అగ్ని ప్రమా దంలో 146 మంది ప్రధానంగా 123 మంది మహిళా కార్మికులు తమ ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈ మొత్తంలో కూడా 14 నుండి 23 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళా కార్మికులే ఎక్కువగా ఉన్నారు. అదే కాలంలో ముంచుకొచ్చిన మొదటి ప్రపంచ యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ, ప్రపంచవ్యాప్త శాంతిని కాంక్షిస్తూ రష్యన్ మహిళలు నినదించారు. మొత్తంగా మార్చ్ 8 అనేది ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళా పోరాట దినంగా ప్రాచుర్యం పొంది, ముందు తరాలను మరింతగా ప్రేరేపించి పోరాట జెండాను విడవకుండా సమాన హక్కులు, స్వేచ్ఛకై మహిళా విముక్తికై ఎలుగెత్తేలా నిలిచిపోయింది. 1975 నుండి ఐక్యరాజ్య సమితి కూడా ఈరోజు ప్రాధాన్యతను గుర్తించి ప్రతిఏడాది ఏదో ఒక కొత్త నినాదంతో ఈ పోరాట దినాన్ని జరుపుకోవడం ప్రారంభించింది.

ఇంతటి సుదీర్ఘమైన, చైతన్యవంతమైన, ఉద్వేగభరితమైన చరిత్ర కలిగి సగం ప్రపంచానికి సంబంధించిన రోజును 'ఉత్సవం'గా మార్చే పనికి ప్రయత్నాలు ప్రపంచీకరణకు అడుగులు పడడంతోనే మొదలైనా అయా దేశాల్లోని భూస్వామ్య వర్గాలు, మతచాందస శక్తులు, పెట్టుబడి దారులు కొత్త చరిత్రను నిర్మించిన మహిళా ఉద్యమ చైతన్యాన్ని నీరుగార్చేలా, దారితప్పించేలా నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో ముడిసరుకులకై సహజ వనరుల వేటలో, మార్కెట్ విస్తరణలో భాగంగా మహిళా శ్రమను చౌకగా పొందే దోపిడీ యత్నాల్లోనూ మహిళా దినం మరింత పలచబడింది. స్త్రీని విలాస వస్తువుగా చూసిన భూస్వామ్యం, సరుకుగా మార్చిన పెట్టుబడి వీటన్నింటికి తార్కిక లెజిటిమసీని ఇచ్చిన మత గ్రంథాలు, మహిళా ఉద్యమాన్ని కొత్త రూపాల్లో అణిచివేస్తున్నాయి. ఎన్ని రూపాల్లో అణిచివేయవచ్చో, ఎన్ని రంగాల్లో అణిగిమణిగి ఉండేలా చేయవచ్చో వాటన్నిటికి కట్టుబాట్లు, సిద్ధాంత రూపాలను అన్ని మత గ్రంథాలు బోధించాయి.



సంఘంలో ఆమె స్థానమంటూ ప్రత్యేకంగా ఏమీలేదని, పురుషుడి వల్లే ఆమె స్థానం నిర్ణయించబడుతుందని, తనంతట తానుగా తన ఉనికిని వ్యక్తిగా చాటుకునే అవకాశమే లేకుండా సామాజిక అణిచివేత కొనసాగుతున్న నేపథ్యంలోనే పెట్టుబడుల ప్రవాహం, మార్కెట్ విస్తరణతో కొత్త రూపంలో అదే స్థితిని కొనసాగించేలా 'ఉత్సవ' నినాదాలు ఊపందుకున్నాయి. భారతదేశ సందర్భంలో అయితే స్త్రీని దేవతీకరించి, ఆదర్శీకరించి ఉత్తమ గుణాలు కలిగిన వ్యక్తి అని కీర్తించే బ్రాహ్మణీయ సంస్కృతి వారిని మరింతగా ఒంటింటి కుందేళ్ళుగా మార్చి వేసింది. ప్రశ్నించడాన్ని, స్వేచ్ఛకై ఎలుగెత్తడాన్ని బరితెగింపుగా ప్రచారం చేస్తూ మరింత అణిచివేతను అమలు చేస్తున్నది. మరోవైపు నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత వినియోగదారీ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయి మహిళలపై మరింతగా ఇంటాబయటా హింస పెరిగి పోయింది. ప్రభావంతమైన సినిమా మాధ్యమంలో, మీడియా వ్యాపార ప్రకటనల్లో స్త్రీల చిత్రీకరణ వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా, కేవలం పురుషున్ని సంతోషపెట్టే శారీరక నిర్మాణంగానే చూపించడం పెరిగిపోయింది. ఐటమ్ సాంగ్స్ సంస్కృతి వికృతి రూపం తీసుకుని స్త్రీని కేవలం వినోద వస్తువుగా స్థిరపరిచే వ్యాపార ధోరణి ప్రమాదకర స్థితికి చేరుకున్నది. యాసిడ్ దాడులు, పెట్రోల్ పోయడాలు, నడి బజారులో నరికి వేయడాలు, లైంగికదాడుల ఘటనలు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి.

మైదాన ప్రాంతాల్లో స్త్రీలపై జరిగే అనేక ఘోర వృత్తాంతాలు కొన్నైనా వెలుగు చూసే అవకాశమున్నా అడవుల్లో ఆదివాసీ పల్లెల్లో ఆదివాసీ మహిళలపై మిలటరీ బలగాలు ఒక అణిచివేత సాధనంగా రేప్‌ను ప్రవేశపెట్టిన దుర్మార్గం బయటి ప్రపంచానికి పూర్తిగా తెలియడం లేదు. 'నిర్భయ' చట్టం వచ్చిన తర్వాత మహిళలపై ఇరవైఏడు శాతం లైంగికదాడులు అధికంగా నమోదయ్యాయి. ఇన్ని దుర్మార్గాలు ఇంటా బయటా మహిళలపై జరుగుతుంటే పాలకులు నినాదాలకు పరిమితమయ్యారు.' బేటీ బచావో..బేటీ పడావో' నినాదమిచ్చిన మోడీ అనుచరగణం అంతా స్త్రీలు కురుచ దుస్తులు ధరిస్తున్నారనో, దేశ సంస్కృతిని మంటగలుపుతున్నారనో వీధుల్లో వీరంగం సృష్టిస్తూ సాంస్కృతిక పోలీసింగ్‌కు పాల్పడుతున్నారు. సనాతన వాదులంతా పితృస్వామ్య బ్రాహ్మణీయ విలువలు మరింత బలపడేలా తమ ఎజెండాకు పదును పెడుతున్నారు. 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అని చెప్పిన శాస్త్రాల సంఘపరివార్ పెద్దలు స్త్రీలు వంటింటికే పరిమితం కావాలని బాహటంగానే ఘోషిస్తున్నారు.

ఏదైన చారిత్రక సన్నివేశాన్ని, పోరాట స్ఫూర్తిని, చైతన్యాన్ని, విముక్తి పథాన్ని చూపించే శక్తి ఉన్న ఏ సందర్భాన్నైనా వక్రీకరించి, బలహీనపరిచి తమ ప్రయోజనాలకు, తాము రక్షణగా నిలబడ్డ వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూసుకుంటారు పాలకులు. సరిగ్గా మార్చ్ 8ని కూడా అలాగే మార్చి వేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని ఆర్భాటం చేస్తున్నారు. కార్పొరేట్స్, ఆస్తిపర వర్గాల మహిళలు, ఉన్నతోద్యోగ స్థానంలో ఉన్నవాళ్లు, అధికార పీఠాల్లో వారందరికి ఇది ఏనాడో ఉత్సవమైంది. న్యూ ఇయర్ లాగానో, వాలైంటైన్స్ డేలాగానో మార్చివేసి కేక్ కట్ చేయడానికి, అభినందనలు చెప్పుకోవడానికి పార్టీలు చేసుకునే స్థాయికి దిగజార్చారు. ఫ్యాషన్ పరేడ్లు, వంటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి స్త్రీని 'దేవత' అని, భూదేవంత 'సహనశీలి' అని కుటుంబ బరువును, బయటి భారాన్ని నెత్తిన వేస్తున్నారు.

వ్యక్తులుగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవించే హక్కులను నిరాకరించి 'శాస్త్రాల'నుసారం, మతం విధించిన పరిమితులకు లోబడి నడుచుకోవాలని ఈ శక్తులు నిర్దేశిస్తున్నాయి. శిశు మందిరాలల్లో చదువులు స్త్రీలకు శిలాశాసనాలను విధిస్తున్నాయి. జాతీయ వాదం పేరుతో హిందూ బ్రాహ్మణీయ ఫాసిజంను అమలు పరుస్తూ మహిళల సాంస్కృతిక హక్కుల్ని అణిచివేస్తున్నాయి. ప్రతి ప్రభాతాన టీవీ ఛానళ్ల నుండి ప్రవహించే ప్రవచనాలన్నీ స్త్రీల చుట్టూ సనాతన ఇనుప కంచెలను వేస్తున్నాయి. భక్తి పేరుతో సృజనాత్మకత లేకుండా పారాయణాలను చేయిస్తూ మహిళ మనోవికాసానికి అడ్డుగోడల్ని నిర్మిస్తున్నారు. శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధ వైఖరిని అలవర్చుకొని ఆధునిక జీవన శైలిని ప్రదర్శించే మహిళలను ప్రాశ్చాత్య సంస్కృతికి బానిసలయ్యారంటూ ప్రచారం చేస్తున్నారు. స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఉన్నతమైన అభిప్రాయాలను కలిగి ఉండి తమ జీవితాన్ని తామే నిర్దేశించుకుంటామంటే సహించని 'సంఘ్' జీవులు వీరు. ఫ్లవర్ వాజ్‌లో పువ్వుల్లా, షోకేసుల్లో బొమ్మల్లా ఉండాలని అనుకువ, వినయం, విధేయతల చాటున స్త్రీలను తోలుబొమ్మలుగా ఆడించే ఈ శక్తులకు స్త్రీలు స్వేచ్ఛగా ఆలోచించడం, స్వేచ్ఛాయుత జీవితం గడపడం కంటగింపుగా మారింది.

ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి స్థితి నెలకొని ఉంటే పాలకులకు, వాళ్ల ఊడిగం చేస్తున్న కార్పొరేట్స్‌కి ప్రతి సందర్భంలోంచి పైసలు పిండుకోవడం కావాలి. 'ఉత్సవ విగ్రహం' అనే మాట ప్రజా బాహుళ్యంలో బహుళ ప్రచారం పొందినది. ఉత్సవ విగ్రహమనేది ప్రయోజనకరమైనది కాదని, అది ఉత్త విగ్రహమేనని దాని సారాంశం. ఏదైన చారిత్రక సన్నివేశాన్ని, పోరాట స్ఫూర్తిని, చైతన్యాన్ని, విముక్తి పథాన్ని చూపించే శక్తి ఉన్న ఏ సందర్భాన్నైనా వక్రీకరించి, బలహీనపరిచి తమ ప్రయోజనాలకు, తాము రక్షణగా నిలబడ్డ వారి ప్రయోజనాలకు విఘాతం కలుగకుండా చూసుకుంటారు పాలకులు. సరిగ్గా మార్చ్ 8ని కూడా అలాగే మార్చి వేశారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినాన్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవం అని ఆర్భాటం చేస్తున్నారు. కార్పొరేట్స్, ఆస్తిపర వర్గాల మహిళలు, ఉన్నతోద్యోగ స్థానంలో ఉన్నవాళ్లు, అధికార పీఠాల్లో వారందరికి ఇది ఏనాడో ఉత్సవమైంది. న్యూ ఇయర్ లాగానో, వాలైంటైన్స్ డేలాగానో మార్చివేసి కేక్ కట్ చేయడానికి, అభినందనలు చెప్పుకోవడానికి పార్టీలు చేసుకునే స్థాయికి దిగజార్చారు. ఫ్యాషన్ పరేడ్లు, వంటల పోటీలు, ముగ్గుల పోటీలను నిర్వహించి స్త్రీని 'దేవత' అని, భూదేవంత 'సహనశీలి' అని కుటుంబ బరువును, బయటి భారాన్ని నెత్తిన వేస్తున్నారు. పావలా వడ్డీలు, కుట్టు మిషన్లు, బ్యూటీ పార్లర్లు, ఫ్యాషన్ డిజైనింగ్లను నేర్పి వాటినే 'మహిళా సాధికారత'గా ప్రచారం చేసుకుంటున్నారు. వీటికి తోడు 'ఉత్సవం' అయితే కాస్మోటిక్స్, ఫ్యాషన్ దుస్తులను ఉత్పత్తి చేసే కార్పొరేట్స్‌కి అది కాసులపంటగా మారుతుంది. పండుగలా జరుపుకునే రోజులు పోరాటాలను, త్యాగాలను, విముక్తి పథాలను గుర్తుకు తెస్తాయంటారా?

రెక్కలు ముక్కలు చేసుకొని కంపెనీల్లో కాలిపోతున్న మహిళా కార్మికులు, అసంఘటిత రంగంలో కునారిల్లుతున్న అసంఖ్యాక మహిళలు, కుదేలైన వ్యవసాయంలో రుణగ్రస్తులై బతుకులెల్లదీస్తున్నవారు ఇంటికే పరిమితం చేయబడి బయటి ప్రపంచాన్ని కనే అవకాశం లేనివాళ్లంతా తమ చుట్టూ అల్లుకున్న దోపిడీ కంచెల్ని బద్దలుకొట్టి విముక్తి గీతం పాడుకోవడం కోసం ఉద్దేశించబడినది ఈ శ్రామిక మహిళా పోరాట దినం. మహిళల్ని పరాయీకరించి బానిసలుగా చేసిన, వారి శ్రమ శక్తిపై పురుషులకు అధికారమిచ్చిన కుల, మత, పితృస్వామిక చట్రా లను కూల్చివేయకుండా ఉండడం కోసం, వస్తు వ్యామోహపు ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేయడం కోసమే పోరాట దినం ఉత్సవమైంది. శ్రమ విముక్తి పోరాటంతోనే మహిళా విముక్తి దాగి ఉందన్న సత్యాన్ని మరుగున పరిచేందుకు పోరాటాన్ని నీరుగార్చి 'వేడుక'ను చేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే గనుక అన్ని దినోత్సవాల్లాగే మార్చి8 కూడా మారిపోతుంది. దీన్ని ప్రతిఘటించడమే మహిళల కర్తవ్యం కావాలి. ■

మహిళా సాధికారత - సమానత్వం



జి. నాగమణి

శతాబ్దాల కాలంగా సమానత్వ సాధనకై జరిగిన ఉద్యమాలను, పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించుకొనే రోజు మార్చి8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం. లింగ సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, వివిధ సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో మహిళలు సాధించిన విజయాలకిది ప్రతీక. ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని వారోత్సవాలుగా, పక్షోత్స వాలుగా జరుపుకుం టున్నాము. ఈ సందర్భంగా ఇంటా బయట మహిళలెదు ర్కొంటున్న సమస్యలు, వారిపై జరుగుతున్న శారీరక మానసిక దాడులు, వాటిని అధిగమించే చర్యల గురించిన అనేక విషయాలపై చర్చలుంటాయి. ప్రతి సంవత్సరం ఒక థీమ్‌ను ఈ సందర్భంగా ప్రకటిస్తారు. 2025 సంవత్సర థీమ్ " మహిళలు, బాలికలందరికీ హక్కులు, సమానత్వం, సాధికారత" మహిళల సమాన హక్కులు, అధికారం, అవకాశాలను వాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవా లని కోరుతుంది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు, బాలికల పురోగతిని అడ్డుకునే వ్యవస్థాగత అవరోధాలను తొలగించడానికి తక్షణ చర్యలను హైలైట్ చేస్తుంది.



మనదేశంలో మహిళలు నాటినుండి నేటిదాక పనికి గుర్తింపు విలువ కట్టని ఈ అసమసమాజంలో అన్నీ తానై, అన్నింటా తానై అవిశ్రాంతంగా శారీరక, మేధో శ్రమచేస్తూనే సమాజాభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు. భారత రాజ్యాంగం అందించిన హక్కులు, బాధ్యతలు వాటికి సంబంధించిన చట్టాల పట్ల అవగాహన కలిగి పురుషులతో సమానంగా ముందుకుపోతున్నారు నేటి మహిళలు. పురుషులతో సమానంగా తమను గుర్తించాలని, తమ వాటా తమకు ఇవ్వాలనే స్పృహతో ఉద్యమిస్తున్నారు. నింగీనేల మాదేనంటు ఆటంకాలను, ఆంక్షలను ఎదిరిస్తూ దూసుకుపోతున్నా కంటికి కనిపించని అద్దాలగోడలు వారి అభివృద్ధిని నిరోధిస్తూనే ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో, నిర్ణాయక పదవుల్లో వారి శాతం 10-20గానే ఉంటున్నది. విద్య, వైద్యం, సేవ, తదితర రంగాల్లో సంఖ్యాపరంగా అధికమైనా నేతృత్వ స్థాయికి చేరడంలో వివక్షతకు గురవుతూనే ఉన్నారు. మహిళా సాధికారతలో 15 - 18 సం.రాల వయసు అమ్మాయిలు 40శాతం వరకు చదువును మధ్యలోనే ఆపేస్తున్నారు. 1997 నేషనల్ సర్వే ప్రకారం కేవలం కేరళ, మిజోరాం రాష్ట్రాలు మాత్రమే అక్షరాస్యత శాతాన్ని చేరుకున్నాయి జాతీయ కుటు ంబ సర్వే ప్రకారం ప్రపంచ అక్షరాస్యత రేటు భారత దేశంలో స్త్రీలు 70.3శాతం ఉంది. అంగన్ వాడీలు, ఆశావర్కర్లు, ఐకెపి, ఐటి, ప్రయివేటు, కాంట్రాక్టు, కెజిబివి టీచర్లు, ఔట్ సోర్సింగ్ పేరుతో చాలామంది శ్రమదోపిడీకి గురవుతున్నారు.

'ఆకాశంలో సగం.. అవనిలో సగం.. సమాజంలో సగం" అన్నట్టు నేడు మహిళలున్నా రెండవ శ్రేణి పౌరులుగానే పరిగణింపబడుతున్న తరుణంలో హక్కులకై ఉద్యమిస్తున్న ఘట్టాలు ఒక భాగమైతే, జీవించే హక్కును సైతం కాలరాస్తూ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగాన్ని పరిహసంచేసే విధంగా లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, పశ్నిస్తే పనిష్మెంట్లు నానాటికీ పెరుగుతున్న దుస్థితి. బిల్కిస్ బానో రేప్ కేసులో నేరస్తులకు క్షమాభిక్ష పెట్టి సన్మానించడం, దేశానికి ప్రతిష్టాత్మక పథకాలు సాధించిన మహిళా రెజ్లర్ల ఆక్రందనలు, మణిపూర్ మారణహోమం ఇన్ని జరుగుతున్నా పాలకవర్గాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం మనల్ని మళ్లీ మనువాద ప్రమాదపు అంచులకు నెట్టివేస్తున్నట్టు స్పష్టమౌతుంది. ఆయా రంగాల్లో మొదటి స్థానంలో చెప్పుకోదగిన మహిళలెందరో ఉన్నారు. ఈ సందర్భంగా వారిని మనం గుర్తుచేసుకోవాలి. మన మొదటి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ, వైద్యురాలు ఆనందీబాయి జోషి, ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలె, మహిళా దినోత్సవ వ్యవస్థాపకురాలు క్లారా జెట్కిన్, తొలి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు, ఆటోరిక్షా డ్రైవర్ షీలా దావ్రే, ఢిల్లీ నగరంలో బస్సు నడిపిన తెలంగాణ బిడ్డ సరిత మొదలైన వారు. నాటినుండి నేటిదాక ఎందరో మహిళామణులు వివిధ రంగాల్లో కృషిచేసి మనకు ఆదర్శమూర్తులు, మార్గదర్శకులుగా నిలిచారు. ప్రజాసంక్షేమాన్ని, మహిళా సంక్షేమాన్ని, బాలికల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ, రాజ్యాంగ హక్కులను అమలుచేసే దిశగా చట్టాలు చేస్తే ప్రస్తుత పరిస్థితులలోమార్పు సాధ్యమౌతుంది. సొంత ఎజెండా అమలుకై చాపకింద నీరులా ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని రూపొందించేందుకు పాలకులు సిద్ధమౌతున్న పరిస్థితి కనిపిస్తున్నా పౌరసమాజం గుర్తించలేకపోవడం గమనార్హం.

నేడు మతం కళ్లతో మనుషుల్ని చూస్తూ, విడదీస్తూ వివాదాలు సృష్టిస్తున్న పాలకులు మహిళలను మనువాద దృష్టితోనే చూస్తున్నారు. దేశప్రజలంతా సమానులేనన్న భారత రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ మతధర్మాన్ని మనుధర్మాన్ని బోధిస్తున్నారు. సామాన్యులు ఉన్నత చదువులు చదువుతున్న యువతులు సైతం మతాచార వేడుకల్లో ఇబ్బడిముబ్బడిగా పాల్గొంటున్నారు. పని ప్రదేశాల్లా కూడా ఈ ఆచారాలను విస్తరింపచేస్తూ జనామోదాన్ని పొందుతున్నారు. ఇది ప్రమాదకరమైన పరిస్థితి. మహిళల హక్కులు బాధ్యతలకై జరిపే ఉద్యమాల్లో మహిళల వ్యక్తిత్వాన్ని, నాన్ని, వారి క్రియాశీలతను తగ్గించే, ఆంక్షలను విధించే ఆచారాలపై గళమెత్తాలి. శాస్త్రీయ, తార్కిక, హేతువాద దృక్పథాన్ని ప్రచారంచేయాలి. సమాన పనికి సమాన వేతనం, సెలవులే కాదు "మహిళల హక్కులు మానవ హక్కులేనన్న" నినాదాన్ని అందరూ అందుకోవాలి. "దేశ స్వావలంబన అభివృద్ధిలో మేము సైతం ఉన్నాం, మా భాగస్వామ్యాన్ని గుర్తించండి" అని ఎలుగెత్తి చాటాలి. "స్త్రీ పురుష సమానత్వ సాధనను వేగవంతం చేస్తాం. అందుకు అవసరమైన అన్ని చర్యలను చేపడతాం" అని పాలకుల చేత ప్రకటింపచేసే స్థాయిలో మన ఉద్యమ కార్యాచరణ ఉండాలి. ఆ దిశగా మనమంతా సంఘటితంగా పయనిద్దామని ఈ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతినబూనుదాం. ■

'ఆమె'కు అడుగడుగునా అవమానమేనా?



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

స్త్రీ లేనిదే జననం లేదు.స్త్రీ లేనిదే గమనం లేదు.స్త్రీ లేనిదే సృష్టిలో జీవం లేదు.స్త్రీ లేనిదే అసలు సృష్టే లేదు. అలాంటి స్త్రీ నేటికీ సమానత్వాన్ని అందుకోలేకపోతున్నది. ఆమె పట్ల ఆధునికయుగంలోనూ అడుగడుగునా అవమానం, వివక్షే కొనసాగుతున్నది. గృహిణి లేకుండా ఇల్లు నడపడం అసాధ్యం అయినప్పటికీ మహిళ తన ప్రాముఖ్యతను నిరూపించుకోవాల్సి వస్తోంది.ప్రపంచం ఆధునికంగా మారి ఉండవచ్చు కానీ చాలా మంది మహిళలు ఇప్పటికీ పురుషుల నిర్ణయాలపైనే ఆధారపడవలసి ఉంది. 21వ శతాబ్దంలో జీవిస్తున్న నేటి యువత ఆధునిక ఆలోచనలతో ముందుకుసాగాలని భావిస్తోంది. తనకంటూ ఒక ప్రత్యేకత సంపాదించుకోవాలని ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ నేటికీ ప్రపంచ వ్యాప్తంగా చాలామంది మనస్సులో పురుషాధిక్యత గురించి ఆలోచన ఇప్పటికీ ప్రబలంగా ఉంది. ఇప్పటికీ ఒక మహిళ తనను తాను నిరూపించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. భారతదేశంలో ఆడపిల్లలు బాల్య వివాహాలకు మాత్రమే కాదు కట్న కానుకలకు కూడా బలిపశువులవుతూనే ఉన్నారు.కొన్నిచోట్ల చదువుకున్న స్త్రీ కూడా తన విలువను చాటుకోవడానికి కష్టపడాల్సి వస్తోంది. స్త్రీపురుషుల మధ్య సమానత్వం కేవలం చర్చలు,పేపర్లలో ప్రస్తావనకు, డిబేట్స్‌కు మాత్రమే పరిమితమవ్వడం విచారకరం.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం అనేది లింగ సమానత్వం కోసం వాదిస్తూనే మహిళలు సాధించిన సామాజిక,ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విజయాలను గుర్తించే ఒక ప్రపంచ కార్యక్రమం. ఈ ఏడాది 2025 సందర్భంగా మహిళలపై హింసను అంతం చేయడానికి మద్దతు అనే థీమ్‌తో మహిళా దినోత్సవం జరుపుకుంటున్నాము. మంచిదే కానీ, మహిళలపై జరుగుతున్న హత్యల్లో 28 శాతం కుటుంబ సభ్యులే చేస్తున్నారని నేషనల్ క్రైమ్ బ్యూరో లెక్కలు చెప్తున్నాయి. 2022లో ఆత్మహత్య చేసుకున్న 45,028 మందిలో సగానికి పైగా గృహిణులే ఉన్నారు. 2022లో భారత్‌లో ఎన్.సి.ఆర్.బి నివేదిక ప్రకారం బాలికలు, మహిళలపై హింసకు సంబంధించి 4,28,000 కేసులు నమోదయ్యాయి. అందులో 7.9 శాతం లైంగికదాడి కేసులు, 21.8 శాతం భౌతిక దాడులు, 31.8 శాతం గృహ హింస కేసులు నమోదైనట్లు నివేదిక తెలుపుతున్నది. నమోదు కాని కేసులు లెక్కకు మించి ఉన్నాయి. 2030 నాటికి మహిళలకు, బాలికలకు సాధికారిత, లింగ సమానత్వాన్ని సాధించాలని ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో ఐదవదిగా పేర్కొంది.స్త్రీ పురుషుల మధ్య ప్రాకృతిక విభజనను సామాజిక కోణం నుంచి అర్థం చేసుకోవటానికి బదులుగా సామాజిక అసమానతలకు ప్రకృతిని అన్వయించి ఒకరు ఎక్కువ, ఒకరు తక్కువ అనే ధోరణి సహించరాని విషయం.

ఆధునిక ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకోవడంలో సగటుజీవికి పేదరికం అడుగడుగునా అడ్డుపడుతోంది.పేదరికం కోట్ల మందిని కనీస అవసరాలకు దూరం చేసింది. ఫలితంగా మరింత మంది పేదరికంలోకి జారుతున్న పరిస్థితి. ఈ ప్రభావం పురుషులతో పోలిస్తే మహిళలపై అధికంగా ఉందని అనేక అధ్యయనాలు చాటుతున్నాయి.దీనివల్ల రాబోయే రోజుల్లో పరిస్థితులు లింగపరమైన అసమానతలకు దారితీస్తూ, మహిళలు మరింత పేదరికంలోకి జారుకునే ప్రమాదం ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇటీవల ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం, ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) 2021 నాటికి దాదాపు 4.7 కోట్ల మంది మహిళలు,బాలికలు తీవ్ర పేదరికంలోకి జారే అవకాశం ఉందని నివేదించింది.ఫలితంగా మహిళల విషయంలో కొన్ని దశాబ్దాలుగా సాధించిన పురోగతి పూర్తిగా తిరోగమనంలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా దక్షిణాసియా ప్రాంతంలో ఈ పేదరిక వ్యత్యాసం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని యూఎన్‌డిపి అభిప్రాయ పడింది.25 నుంచి 34 ఏళ్ల వయస్సు కలిగిన మహిళలు,బాలికలు దుర్భర పరిస్థితిని ఎదుర్కోవచ్చని తెలపడంతో పాటు రానున్న దశాబ్దకాలంలో పురుషుల కంటే మహిళలు ఆర్థికంగా వెనకంజ వేస్తారని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగాలు కోల్పోయింది మహిళలే.ఇటీవల అమెరికాలో పురుషులతో పోలిస్తే ఉపాధిని కోల్పోయిన వారిలో మహిళలే ఎక్కువ ఉన్నారని అక్కడి జాతీయ మహిళా న్యాయ కేంద్రం (ఎన్‌డబ్ల్యుఎల్‌సి) విశ్లేషణ స్పష్టం చేసింది. ఈ అధ్యయనం ప్రకారం డిసెంబరు నెలలో అమెరికాలో పెద్దసంఖ్యలో ఉద్యోగాలు పోయాయి.అవన్నీ మహిళలకు సంబంధించినవే కావడం గమనార్హం. లింగ సమానత్వంలో మెరుగ్గా ఉన్న అమెరికాలోనే ఈ స్థాయిలో మహిళలు ఉపాధిని కోల్పోతే మధ్యస్త, అల్పాదాయ దేశాల పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అనాదిగా లింగపరమైన అసమానతలు వేళ్లూనుకుని ఉన్న వర్తమాన భారత్‌లో మహిళల పరిస్థితి చెప్పనక్కర్లేదు.



అందుకే ప్రభుత్వాలు ముందుజాగ్రత్తగా మేల్కొని లింగసమానత్వం దిశగా అడుగులేస్తూ ఉద్యోగ, ఉపాధి కల్పనల్లో మహి ళలకు తగిన అవకాశాలు కల్పించాలని యుఎన్‌డిపి సూచించడం ప్రాధాన్యం సంతరించుకుంది.దేశాభివృద్ధిలో పురుషులతో పాటు మహిళల పాత్ర కీలకం.పురుషులతో సమానంగా మహిళలు సామాజిక,ఆర్థిక,రాజకీయ అభివృద్ధి సాధించినప్పుడే పేదరికం అంతమవుతుంది.నేటి సంక్షోభంలో మహిళలకు ఆర్థిక రక్షణ కల్పించి స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి ప్రపంచ దేశాలు విభిన్న రీతుల్లో అవకాశాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.ప్రపంచాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు మొదటగా చేయాల్సిన పని స్త్రీలలోని పేదరికాన్ని నిర్మూలించాలన్న సంగతిని ప్రభుత్వాలు గుర్తించాలి. లింగ సమానత్వం కోసం కృషి చేయాలి. ■



ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి

- మానవత్వం చాటుకున్న సీపీఐ(ఎం) నేతలు
- కాపాడి 108కి సమాచారం అందించిన పోతినేని

నవతెలంగాణ - బోనకల్

ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ఎర్రుపాలెం వెళ్తున్నారు. రోడ్డుపై తీవ్రంగా గాయపడి ప్రమాదకర పరిస్థితులో ఉండటంతో పోతినేని సుదర్శన్‌రావు తన కారుని వెంటనే ఆపి 108కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి 108 వచ్చే వరకు ఉండి 108లో ఆ వ్యక్తిని ఎక్కించి ప్రాణాలను కాపాడిన సంఘటన మండల పరిధిలోని రావినూతల - జానకీపురం గ్రామాల మధ్యలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వైరా పట్టణ బీసీ కాలనీకి చెందిన కాశీమల్ల చార్లెస్ ఇటుక బట్టి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వైరా నుంచి తన మోటార్ సైకిల్‌పై సూర్యాపేట జిల్లా కోదాడలో ఇటికబట్టి వద్దకు వెళుతున్నాడు. అయితే మండల పరిధిలోని జానకీపురం - రావినూతల మధ్య ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్‌కి బ్రేకులు పడకపోవడంతో తనకు తానే రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, పార్టీ పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్, మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు ఖమ్మం నుంచి ఎర్రుపాలెం కారులో వెళ్తున్నారు. రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న చార్లెస్‌ను చూసి వెంటనే 108 కు సమాచారం అందించారు. 108 వచ్చే వరకు సంఘటన స్థలంలోనే వారు ఉండి అవసరమైన ప్రాథమిక చర్యలను చేపట్టారు. 108 రాగానే స్వయంగా అతనిని పోతినేని సుదర్శన్ రావు, బండి రమేష్, మడిపల్లి గోపాల్ రావు 108లో ఎక్కించి ప్రాణాల నుంచి కాపాడారు. చార్లెస్ ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



పొంగులేటి సహకారం మరువలేనిది...

- మంత్రిని కలిసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

రాష్ట్ర రెవిన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఖమ్మంరూరల్ మండలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. గత నాలుగేండ్లుగా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రియల్ ఎస్టేట్ వ్యాపారానికి 25 శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజు రాయితీ చెల్లింపుతో తిరిగి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మంత్రి పొంగులేటి జీవం పోసినట్లు రియల్ ఎస్టేట్ సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్, గౌరవ అధ్యక్షులు గరికపాటి ఆంజనేయ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌లో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి పొంగులేటిని రియల్ వ్యాపారులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రియల్ వ్యాపారులు కారం శ్రీనివాస్, వీరన్న, శాబాదు మాధవరెడ్డి, మామిడి శంకర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మైబల్లి, కిషోర్, లాలూ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ వాసుల అవస్థలు

- నివాసం ఉంటున్న పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలి
- వర్షాకాలం వరదలతో మునగకుండా అధికారులు చర్యలు చేపట్టాలి
- సైడ్ డ్రైనేజ్, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి
- సమస్యల పరిష్కారానికి 12న మున్సిపాల్టీ ఎదుట ధర్నా
- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం
- ఇందిరమ్మ కాలనీలో పర్యటించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ఇందిరమ్మ కాలనీ వాసులు పలు రకాల సమస్యలతో సతమతం అవుతున్నారని, నివాసం ఉంటున్న వారికి ఇండ్ల స్థలాల పట్టాలు ప్రభుత్వం అందించలేదని, ఇంటి నెంబర్లు కేటాయించలేదని, ఇండ్లు ఆన్లైన్‌లో నమోదు కాలేదని, వర్షాకాలం వస్తే వరదలతో కాలనీ మునిగిపోతుందని స్థానికులు సీపీఐ(ఎం) బృందం పర్యటన సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా



వీరభద్రంతో పాటు పట్టణ నాయకులు కొంగర సుధాకర్, షేక్ నాగుల్ పాషా, గుడిమెట్ల మోహనరావు ఇందిరమ్మ కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ప్రతి సంవత్సరం కాలనీ వరద ముంపునకు గురవుతుందని, వరదలు వచ్చినప్పుడు పునరావాస కేంద్రాలకు తరలించడం, రెండు కేజీల బియ్యం, రెండు దుప్పట్లు ఇచ్చి అధికారులు చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. వరద నీరు ప్రవహించే వాగులో విపరీతంగా చెట్లు పెరిగాయని, వాగులో పెరిగిన చెట్లు తొలగించి పూడిక తీయాలని, రేషన్ కార్డులు, వితంతు, వృద్ధాప్య పెన్షన్లు అందక పేదవాళ్లు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో నెలకున్న సమస్యలపై మున్సిపల్ అధికారులు స్పందించి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక ప్రజా సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో మార్చి 12వ తేదీన మున్సిపాలిటీ వద్ద జరుగు మహాధర్నాలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నాగేశ్వరరావు, సతీష్ గౌడ్, సతీష్ చారి, భూక్యా వెంకటేశ్వర్లు, రమేష్, ప్రసాద్, లక్ష్మి, మీరాబీ తదితరులు పాల్గొన్నారు.



అట్టడుగు వర్గాల మహిళల హక్కులు పరిరక్షించాలి

- ప్రముఖ వైద్యురాలు యలమంచిలి నాగమణి

నవతెలంగాణ-ఖమ్మం

అట్టడుగు వర్గాల మహిళల హక్కులు పరిరక్షించబడాలని ప్రముఖ వైద్యురాలు యలమంచిలి నాగమణి అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు వారి వారి రంగాల్లో ఏ స్థాయిలో కూడా తమ హక్కులను కోల్పోవద్దని, పరిస్థితులు అధిగమించేలా ధైర్యంతో ముందుకు సాగాలన్నారు. ఆడపిల్లలు, మహిళలపై జరిగే దురాచారాలు, గృహ హింస, లైంగిక వేధింపులు, అకృత్యాల పట్ల ఐక్యంగా పోరాడాలన్నారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై అణచివేత పెరిగిపోయిందన్నారు. వారి హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలో మనువాదాన్ని చొప్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నయా ఫాసిస్ట్ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, మాచర్ల భారతి, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, జిల్లా పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు బండి పద్మ, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు రమణ, పి.రమ్య, నాయకులు షేక్ బేగం, అమరావతి, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక సలహా మండలి అనుమతులకు కృషి చేయాలి

- సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయటానికి బడ్జెట్లో రూ.10 వేల కోట్లు కేటాయించాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-వైరాటౌన్



ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో 4,15,621 ఎకరాలకు సాగునీటిని మరో 3,89,366 ఎకరాలను స్థిరీకరించడానికి చేపట్టిన సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయటానికి కేంద్ర సాంకేతిక సలహా మండలి అభ్యంతరాలను నివృత్తి చేసి సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మ బ్యారేజి తక్షణమే పూర్తి చేయుటకు అవసరమైన 10 వేల కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్లో కేటాయింపులు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శుక్రవారం వైరా మండలం గొల్లెనపాడ్ గ్రామంలో జరిగిన తెలంగాణ రైతు సంఘం సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ గోదావరి జలాలు తరలింపు కోసం ఖమ్మం జిల్లా ప్రజలు అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందని అన్నారు. 2005 డిసెంబర్ 31 దుమ్ముగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిన నేటి వరకు దుమ్ముగూడెం ప్రాజెక్ట్ పూర్తి కావడం లేదని అన్నారు. 2016లో కేసిఆర్ ప్రభుత్వం 2005 డిజైన్ మార్చి సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు, సీతమ్మ బ్యారేజి నిర్మాణం కోసం డిజైన్ చేసి దానికి తగిన అంచనాలు తయారు చేసిన కేంద్ర సంస్థలు అనుమతులు ఆలస్యంతోపాటు నిధులు కేటాయింపులు పూర్తి స్థాయిలో చేయకపోవడం వల్ల సీతారామ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి రాలేదని, తాత్కాలిక ఉపశమనం కల్గించే ప్రయత్నం కొన్ని మండలాల్లో సాగు నీరు అందించేందుకు అవకాశం ఉందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు భూ సేకరణ పూర్తి చేయలేదు, ప్రధాన కాలువలు నిర్మాణం లేదు, అండర్ టెనెల్ నిర్మాణం కావాలి, సాంకేతిక సలహా మండలి అనుమతుల సమస్య పరిష్కారం కావాలి వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం రానున్న బడ్జెట్లో 10 వేల కోట్ల రూపాయలు కేటాయించాలి, అప్పుడు మాత్రమే ఖమ్మం జిల్లాలో పాలేరుకు గోదావరి జలాలు అనుసంధానం పూర్తి చేయుటకు అవకాశం ఉందని అన్నారు. గోదావరి జలాలు తరలింపులో కరువు మండలాలు, సాగు నీటి ప్రాజెక్టులు పరిధిలో లేని ప్రాంతాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి కిలారు శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి బొంతు సమత, రైతు సంఘం సీనియర్ నాయకులు కొణెదన కోటేశ్వరరావు, నల్లమోతు వెంకటనారాయణ, వనమా చిన్న సత్యనారాయణ, అమరనేని వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షులు వెంపటి రాజా, కార్యదర్శి ఆళ్ల శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాసరావు, రాజేంద్ర ప్రసాద్, ధర్మారావు, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.



ఐజేయు, టీజేఎఫ్‌లో రాజీనామాల పర్వం

- త్వరలో భవిష్యత్ కార్యాచరణ

నవతెలంగాణ-ఖమ్మం

జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా, ఇళ్ల స్థలాల సాధన లక్ష్యంగా జర్నలిస్టులంతా ఐక్యం కావాలని పలువురు జర్నలిస్టులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే(ఐజేయు), టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్)-హెచ్143 యూనియన్లకు చెందిన పలువురు జర్నలిస్టులు ఆయా యూనియన్లకు శుక్రవారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా యూనియన్ నాయకులుగా చలామణి అవుతున్న వారు జర్నలిస్టుల జీవితకాల ఇళ్ల స్థలాల సాధన ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సొసైటీ పేరుతో ఇంకా మోసం చేస్తూ పాత్రికేయులను ఏమారుస్తున్నారని మండిపడ్డారు. మంత్రులు, అధికారులు, న్యాయస్థానాలు సొసైటీ ద్వారా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం సాధ్యపడదు అని తేల్చి చెప్పినప్పటికీ నాయకులు అమాయకులైన జర్నలిస్టులను మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని వివరించారు. అలాంటి వారి పక్కన ఉండి తోటి జర్నలిస్టులకు అన్యాయం చేసే ప్రక్రియలో భాగస్వాములం కాదలుచుకోలేదని తేల్చి చెప్పారు. వారి మోసాలను ఎండగట్టేందుకు యూనియన్లకు రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి జర్నలిస్టుల రక్షణ, సంక్షేమం, చిరకాల వాంఛ అయిన ఇళ్ల స్థలాల సాధనకు కట్టుబడి పనిచేస్తామని చెప్పారు. రాజీనామా చేసిన వారిలో సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ ఖదీర్ (వి6), దువ్వా సాగర్ (దిశ), కూరాకుల గోపి (జనంసాక్షి), రాంపూడి నాగేశ్వరరావు(టీవీ5), మానుకొండ రవికిరణ్ (హెచ్ఎం టీవీ), ఆవుల శ్రీనివాస్ (సివిఆర్), మారెడ్డి నాగేందర్ రెడ్డి(జర్నలిస్ట్ టీవీ), జి.యాకేష్ (జీన్యూస్), కొమెర వెంకటేశ్వర్లు(వి5), వెగినాటి మాధవరావు(మనమే సాక్ష్యం), ఆర్.అయ్యప్ప (6టీవీ), ఎం.సంజీవరావు(ఆజ్ తక్, ఇండియా టుడే), షేక్ సుభాన్(జనంసాక్షి), దగ్గుపాటి మాధవ్‌రావు (బిఎన్‌బి), నాయుడు రామకృష్ణ (మహాన్యూస్), నలుబోల మధు శ్రీ (ఆకాష్ జ్యోతి), కిరణ్ (వి6), కెమెరా మేన్స్ అర్షద్ ఖాన్ (వి6), ఫయాజ్ (ఐన్యూస్), యూసఫ్(డిడిన్యూస్), యకుబ్ పాషా (మహాన్యూస్), గణేష్ (హెచ్ఎంటీవీ), శరత్ (జీ న్యూస్), సతీష్ (6టీవీ), జాకిర్ (సీనియర్ వీడియో జర్నలిస్ట్), హరిప్రసాద్ (డిఎస్పి న్యూస్), గుత్తికొండ నరేష్(సేన), నూకల రామచంద్రమూర్తి (దిశా), పెరుమాళ్ళపల్లి నాగార్జున(దిశా), సయ్యద్ అంజాద్ (దిశా), మహమ్మద్ రియాసతుల్లా (మున్సిఫ్), షేక్ జానీ పాషా(రూలింగ్ వన్, డక్కన్ విజన్), రంగా నాగేశ్వరరావు(సివిఆర్), ఉపేందర్ (దిశ), అన్వార్ పాషా (స్వేచ్ఛ), బెల్లంకొండ రాజేంద్రప్రసాద్(ఐడ్రీమ్), దేవేందర్ (ఆర్ టీవీ), ఇంద్రసేన (ఉప్పెన), అశోక్ (యువగళం), రవి(ఏబీఎస్ కెమెరామెన్) తదితరులు ఉన్నారు.



కుల వివక్ష దాడులను ప్రతిఘటిద్దాం

- దళితుల సమస్యల పరిష్కారానికి 11న జిల్లా వర్క్ షాప్
- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఖమ్మం జిల్లా వర్క్‌షాప్ ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటలకు ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు, ఈ వర్క్‌షాప్‌కి ముఖ్య అతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్ బాబు హాజరుకానునట్లు కేవీపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎన్నెస్పి క్యాంపులోని సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తమాల ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్ల గడుస్తున్నప్పటికీ నేటికీ సమాజంలో కుల వివక్ష దాడులు కొనసాగడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. కుల వివక్ష, అంటరానితనం నిర్మూలన కోసం మహనీయుల స్ఫూర్తితో రానున్న కాలంలో పెద్ద ఎత్తున సామాజిక పోరాటాలు నిర్వహించుటకై భవిష్యత్ కార్యచరణను రూపొందించుటకై ఖమ్మంలో ఈ నెల 11న జరుగుతున్న జిల్లా వర్క్ షాప్‌కు జిల్లాలోని అన్ని మండలాల నుండి సామాజిక కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, పాపిట్ల సత్యనారాయణ, బొట్ల సాగర్, కొమ్ము శ్రీను, నకరికంటి చిరంజీవి పాల్గొన్నారు.

సైలో బంకరు కాలుష్య కోరలకు మరొకరు బలి

- మృతదేహంతో రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో
- పోలీసులు సర్ది చెప్పడంతో ధర్నా విరమణ
- 26వ రోజుకు చేరిన సైలో బాధితుల దీక్షలు

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం కిష్టారంలో సింగరేణి ఏర్పాటు చేసిన సైలో బంకరు కాలుష్యం తాజాగా మరొకరి ప్రాణాలను హరించింది. అంబేద్కర్‌నగర్‌కు చెందిన పిల్లి లక్ష్మీనారాయణ (53) గత కొద్దిరోజుల క్రితం ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. అతడ్ని పరీక్షించిన వైద్యులు శ్వాసకోస వ్యాధి సోకిందని చెప్పారు. దీంతో అతడ్ని వైద్యశాలలోనే ఉంచి వైద్య సహాయం అందించారు. అయినా అతని ఆరోగ్య పరిస్థితి క్షీణించి శుక్రవారం తుదిశ్వాస విడిచాడు. మృతునికి భార్య అనసూర్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మృతదేహంతో రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకో

సైలో బంకరు కాలుష్యంతో లక్ష్మీనారాయణ మరణించడంతో ఆగ్రహం చెందిన అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీకి చెందిన ప్రజలు సైలో బంకరు ఎదురుగా రాష్ట్రీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. సుమారు గంటకు పైగా సాగిన రాస్తారోకో కారణంగా రహదారికి ఇరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచి పోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న సత్తుపల్లి సీఐ కిరణ్ బాధిత ప్రజలతో మాట్లాడారు. 10రోజుల్లోగా మీ సమస్యకు పరిష్కారం చూపించే విధంగా ప్రయత్నం చేస్తానని సీఐ కిరణ్ వారికి నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కాలుష్య కారక సైలో బంకరును తీసెయ్యాలని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బాధితులు చేపట్టిన నిరవధిక దీక్షలు శుక్రవారం నాటికి 26వ రోజుకు చేరింది.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టరావిష్కరణ

నవతెలంగాణ-ఖమ్మం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం టిఎన్జీవోస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆర్ఎంఓ డాక్టర్ బి.రాంబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, పార్వతి, హెడ్ నర్స్ వెంకటరమణ, ఫార్మసి సూపర్‌వైజర్ పద్మ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిఎన్జీవోస్ మహిళా విభాగం చైర్ పర్సన్ జి.మృదుల, కన్వీనర్ బివి.సుబ్బమ్మ, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ లలిత కుమారి, జాయింట్ సెక్రటరీ భూస చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యురాలు నెల్లూరి విజయ, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ, ఖమ్మం నగర శాఖ వైస్ ప్రెసిడెంట్ నెల్లూరి రవికుమార్, కార్యవర్గ సభ్యులు శ్రావణి, ప్రవీణ్, రవికుమార్, ముఖిత్, జొన్నలగడ్డ మన్మధరావు, ఈ.విజయకుమార్, జిజిహెచ్ మహిళా విభాగం నర్సింగ్ ఆఫీసర్స్ సుజాత, వసుమతి, జోష్న, శ్రావణి, విజయ, కళ్యాణి, రాజేశ్వరి, రమాదేవి, ధనమ్మ మెహరున్నీసా, వసంత పాల్గొన్నారు.



పేదల సొంతింటి కల సాకారం కానుంది

- మోడల్ పైలట్ ప్రాజెక్టుగా కొత్తూరు ఎంపిక
- 80మందికి లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు
- షీర్‌వాల్ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణం చేపడతాం
- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- కొత్తూరు ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ

నవతెలంగాణ-సత్తుపల్లి



ఇళ్లులేని పేద వర్గాల సొంతింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అందులో భాగంగా సత్తుపల్లి మండలంలోని కొత్తూరు గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. శుక్రవారం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన కొత్తూరు గ్రామంలో గృహాలు మంజూరైన 80మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఎమ్మెల్యే రాగమయి దయానంద్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కొత్తూరు గ్రామాన్ని మోడల్ ప్రాజెక్టుగా, ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దతామన్నారు. కలెక్టర్ సూచనలతో గ్రామంలో 80మందికి ఇళ్లను మంజూరు చేశామన్నారు. ఈ ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5లక్షలు మంజూరు చేస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యత్వం ఉన్న మహిళలకు మరో రూ. లక్ష అందించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. బేస్‌మెంట్ నిర్మాణానికి రూ. 1లక్ష, రూముల లెవల్ వరకు మరో 1లక్ష, స్లాబు వేసేటప్పుడు రూ. 2లక్షలు, మరుగుదొడ్డి, ఇతర ప్యాచ్ పనులకు మరో 1లక్షను నాలుగు విడతలుగా లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా పూర్తిస్థాయిలో నిర్మించుకోలేని పేదల కోసం షీర్‌వాల్ టెక్నాలజీతో ఇంటి నిర్మాణాలను చేపట్టడం జరుగుతుందన్నారు. నియోజక వర్గానికి 3500 ఇండ్లు మంజూర య్యాయన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి పొంగులేటి సహకారంతో మరో 1000 ఇళ్లను మంజూరు చేయించుకొనేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని వర్గాల పేదలకు విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. కొత్తూరులో 80మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లలో 65ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయన్నారు. మరో 15మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణాలను కూడా ప్రారంభించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, ఎంపీడీవో ఆర్సీహెచ్ నాగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, చలసాని సాంబశివరావు, సత్తుపల్లి, రేజర్ల సొసైటీ అధ్యక్షులు చల్లగుండ్ల కృష్ణయ్య, భీమిరెడ్డి నరసింహారెడ్డి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, శివా వేణుబాబు, గొర్లమారి రామ్మోహనరెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

- ఐద్వా జిల్లా సీనియర్ నాయకురాలు మచ్చా మణి

నవతెలంగాణ-వైరాటౌన్

మహిళలకు సమాన హక్కులు కల్పించాలని, మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐద్వా జిల్లా సీనియర్ నాయకురాలు మచ్చా మణి అన్నారు. ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ బజార్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సభ బత్తుల ప్రమీల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా సీనియర్ నాయకురాలు మచ్చా మణి మాట్లాడుతూ మహిళల వీరోచిత పోరాటంతో సంపాదించుకున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1978లో ఆమోదించిందని తెలిపారు. నేటి పాలకులు పోరాడి సాధించిన హక్కులను కాలరాస్తున్నారని, 12 గంటల పని విధానం బిజెపి ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలకు నిదర్శనం అన్నారు. ఒకవైపు పౌష్టికాహారం లేక నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆమె ఆందోళన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు రాజకీయాల్లో రాణించాలంటే చట్టసభలో 33% రిజర్వేషన్ అమలు చేయాలని, మహిళల చట్టాలను కూడా పటిష్టంగా అమలు చేయాలని, మహిళా సంక్షేమానికి కేంద్ర బడ్జెట్లో 2 లక్షల కోట్లు కేటాయించాలని, రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం వైరా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి, కమిటీ సభ్యులు కాంసాని మల్లికాంబ, బత్తుల కరుణ, వి.రాజశ్రీ, రామ్, తులసి, బి.అన్నపూర్ణ, లచ్చమ్మ, వి.యాదమ్మ, వి.వీరమ్మ, వి.అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



కేవీపీఎస్ వర్క్ షాప్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-కూసుమంచి



ఈనెల 11న ఖమ్మం నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్లో జరిగే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా వర్క్ షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని పాలేరు, నాయకన్‌గూడెం, ఈశ్వర మాదారం, జక్కేపల్లి పెరిక సింగారం, మల్లేపల్లి, జీళ్ళచెరువు, గ్రామాలతో పాటు పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట్రావు, ఉపేందర్, జానకి రాములు, వేణు, నవీన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.





ఖానాపురం పాఠశాలలో వీడ్కోలు సభ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో ఖానాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఐదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రూపతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బందిని శాలువతో ఘనంగా సన్మానించారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరి బాగా చదువుకొని ఎదగాలని ఐదోవ తరగతి విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం కె.రూప సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె.శ్రీధర్ స్వామి, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.నాగశ్రీ, పాఠశాల ఉపాధ్యాయులు ఆర్.భాస్కర్ రావు, పండ్రేగుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ .సాంబశివరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ వి.సుజాత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రావినూతలలో ఎల్‌ఆర్‌ఎస్‌పై క్షేత్రస్థాయి పరిశీలన

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని రావినూతలలో ఎల్‌ఆర్‌ఎస్‌పై క్షేత్రస్థాయిలో మండల తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ శుక్రవారం సర్వే నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ పై వచ్చిన దరఖాస్తులపై జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 808 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఈ నెల చివరినాటికి అన్నింటినీ పరిష్కారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్దవార్ -1 గుగులోతు లక్ష్మణ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ముదిగొండ

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు శుక్రవారం ఆరుగురు విద్యార్థులు గైరాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. 141 మంది విద్యార్థులకు 136 మంది పరీక్షకు హాజరుకాగా ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాయలేదని చెప్పారు. ఒకేషనల్ కోర్సులో 27 మంది విద్యార్థులకు ఒక విద్యార్థి తప్ప, 26 మంది పరీక్ష హాజరయ్యారని వాసిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

సామినేని కుటుంబానికి కందాళ పరామర్శ

నవతెలంగాణ-ముదిగొండ

మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మండల పరిధిలో మేడేపల్లి గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సామినేని నాగమణి చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఆయన తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం రూరల్, నేలకొండపల్లి, కూసుమంచి మండల అధ్యక్షులు బెల్లం వేణు, ఉన్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య ఖమ్మం రూరల్ మాజీ జెడ్పిటిసి వరప్రసాద్, నాయకులు ఇంటూరి శేఖర్, సాయి మెరిట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కందుల శంకరయ్య తదితరులు ఉన్నారు.

రాపల్లి మేజర్ కాలువ చివరి భూములు పరిశీలన

నవతెలంగాణ-వైరా



ఎన్ఎస్‌పి రాపల్లి మేజర్ ఆయకట్టు పరిధిలో ఉన్న అష్ణగుర్తి, గొల్లెనపాడు, వల్లాపురం గ్రామాలలో సాగు చేసిన మొక్క జొన్న, ఇతర ఆరు తడి పంటలకు నీటి గండం ఏర్పడింది. శుక్రవారం వైరా తహసీల్దార్ కెవి.శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి మయాన్ మాంజుఖాన్‌లు అష్ణగుర్తి గ్రామం వెళ్లి నీళ్ల లేక వడ బడి పోతున్న మొక్క జొన్న ఇతర ఆరు తడి పంటలను పరిశీలించారు. ఆ గ్రామ రైతులతో మాట్లాడారు. గత శనివారం వరకు నీరు విడుదల చేసారని, కాని ఎండల తీవ్రతకు మొక్క జొన్న పంటకు తక్షణం నీరు అవసరమని, ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని అధికారులకు వివరించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు వైరా నీటి పారుదల శాఖ డిఈ శ్రీనివాసరావుతో ఫోన్‌లో మాట్లాడి శనివారం వైరా ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయించేందుకు ఒప్పించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ శనివారం ఎట్టి పరిస్థితుల్లో నీళ్ళు వస్తాయని అందువలన ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. మరలా ఒకసారి వచ్చి పంట పొలాలను పరిశీలిస్తామని రైతులకు తెలిపారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-మధిర

పదోవ తరగతి పరీక్షలు వ్రాయబోతున్న మధిర జిహెచ్ఎస్ (సిపిఎస్) 53 మంది విద్యార్థులకు శుక్రవారం వ్యాపారవేత్త పుల్లఖండం చంద్రశేఖర్ ఆర్థిక సహకారంతో పాడ్స్, పెన్స్, పెన్సిల్స్, ఎరాజర్స్, ఫైవ్ స్టార్ చాకలెట్స్ అందించి పుల్లం తండా సత్యనారాయణమూర్తి అందించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంపిడిఓ మాధవరపు నాగేశ్వరరావు, హెచ్ఎమ్ డేవిడ్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు స్వాహాపై స్పందించని అధికారులు

నవతెలంగాణ-కొణిజర్ల

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు స్వాహ పై అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం నవతెలంగాణ దిన పత్రికలో మహాత్మ ఇదేందియా అనే శీర్షికతో ప్రచురితమైన కథనం మండలంలో విస్తృత ప్రచారానికి దారితీసింది. ఈ కథనంపై అధికారులు, మండల ప్రజలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ఇంత పెద్ద ఎత్తున అవినీతి ఏలా జరిగిందని చర్చించుకోవడం గమనార్హం.

మండలంలోని ఓ మేజర్ కీలక గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం ఎన్ఆర్ఈజీఎస్‌లో ఉన్న ఐదున్నర లక్షల రూపాయలను ప్రత్యేక అధికారి సంతకాన్ని ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి ఫొర్జరీ చేసి స్వాహా చేసిన మండల పరిషత్ అధికారులు స్పందిచకపోవడం పై విషయం తెలుసుకున్న అ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధులు స్వాహ చేసిన సదరు పంచాయతీ కార్యదర్శి పై విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అధికారులు గోప్యత పాటించడం శోచనీయం.

నిత్య నైవేద్యం కోసం నగదు వితరణ

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని కుర్నవల్లి అయ్యప్ప స్వామి దేవాలయానికి నిత్య నైవేద్యం కోసం దాతలు నగదును అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ వారికి శుక్రవారం అందజేశారు. అన్నం నాగిరెడ్డి, లక్ష్మీనరసమ్మ, దంపతులు నిత్య నైవేద్యం కోసం పదివేల రూపాయల నగదును అందజేశారు. అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ వారు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎంపీ

నవతెలంగాణ-మధిర



మధిర ప్రజలు ఎన్నో సంవత్సరాలకు నుండి రైల్వే గేటు దాటడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల మూడో లైన్ ట్రాక్ ఏర్పాటు నిమిత్తం ప్రజలు, కస్టమర్లు రైల్వే గేట్ దాటలేక వ్యాపారస్తులు వ్యాపారాలు లేక విలువలాడుతున్నారు. పలుమార్లు రైల్వే అండర్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని సంబంధించిన అధికారులు కోరగా శుక్రవారం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి మధిరలో పర్యటించి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, యన్నం కోటేశ్వరరావు, కోట రాంబాబు కటికల సీతారాంరెడ్డి, చావలి రామరాజు, పాటిబండ్ల సత్యంబాబు, కర్నాటి రామారావు, ఎర్రగుంట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేవారం నుంచి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ-కూసుమంచి

వచ్చేవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ పేదవారి ప్రభుత్వం కావాలని ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకుని ఈ రోజుతో 15 నెలలు అయ్యిందని, గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్థంగా తయారైందని, అయినా కూడా తెలంగాణ ప్రజానీకానికి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. అర్హులైన వారికి అందరికీ రేషన్ కార్డులు ఇస్తాం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగోలేని కారణంగా తులం బంగారం లేటవుతుంది. ఆనాటి ప్రభుత్వం అభివృద్ధి పేరుతో అరాచకం సృష్టించింది. వాటన్నింటినీ గాడిన పెడుతూ అభివృద్ధి, సంక్షేమం చేపడుతున్నామన్నారు. ఎక్కడ తగ్గకుండా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం. పేదవారి కోసం ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. ఇచ్చిన ప్రతి మాటను..హామీని ఆలస్యమైనా నిలబెట్టుకుంటామని తెలిపారు.



6 లక్షల సబ్సిడీతో సంచార చేపల విక్రయం వాహనం పంపిణీ

60 శాతం సబ్సిడీతో ఇందిరమ్మ మహిళా శక్తి కింద మహిళలకు పంపిణీ

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

6 లక్షల సబ్సిడీ తో సంచార చేపల విక్రయం వాహనం పంపిణీ చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి మహిళా లబ్దిదారులకు 10 లక్షల రూపాయల విలువ గల సంచార చేపల విక్రయం వాహనాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తుందని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద వివిధ వ్యాపార యూనిట్‌లను ఏర్పాటు చేసి మహిళల స్వాలంబన దిశగా చర్యలు చేపట్టామని అన్నారు. అర్హులైన మహిళలకు 10 లక్షల రూపాయలు విలువ చేసే సంచార చేపల విక్రయం వాహనంను అందిస్తున్నామని తెలిపారు. 6 లక్షల రూపాయల సబ్సిడీ, 3 లక్షల రూపాయలు లబ్ధిదారుని వాటా, లక్ష రూపాయల సెర్ప్ బ్యాంక్ లింకేజీ రుణాలతో ఇట్టి వాహనాలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ జిల్లా అధికారి శివ ప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వికసిత భారత్ యువ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

వికసిత భారత్ యువ పార్లమెంట్‌కు సంబంధించి రూపొందించిన పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వికసిత్ భారత్ యువ పార్లమెంట్‌కు సంబంధించి, జిల్లా స్థాయి పోటీలకు ఖమ్మంలో గల కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలను నోడల్ సెంటర్ గా ఎంపిక చేశారని అన్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో గల 18- 25 సంవత్సరాల వరకు గల యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని, సంబంధించి మార్చి 9వ తేదీ వరకు మై భారత్ పోర్టల్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వహణ కమిటీ చైర్మెన్, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణారావు, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. శ్రీనివాసరావు, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం ఆఫీసర్ భానుచందర్, డా. ఎం.రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

- మిర్చి రైతులకు మద్దతు ధర చెల్లించాలి
- సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి గోపాల్‌రావు

నవతెలంగాణ-చింతకాని



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ(ఎం) మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలో రాయల వీరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఏ ఒక్కటి కూడా పూర్తి చేయకపోగా ప్రజలను మోసపుచ్చుతున్నారే తప్ప, ఏ ఒక్కటి నెరవేర్చలేదని మండిపడ్డారు. అంతేకాకుండా అన్నం పెట్టే రైతుకు సున్నం పెట్టమన్న సందగా రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించకుండా దళారుల చేతిలో మోసపోయే విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుంది అన్నారు. రైతు పండించిన మిర్చి ధరలకు ఒకప్పుడు క్వింటాకు 25 వేల రూపాయలు ధర పలకగా ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం 14 వేల రూపాయలు మాత్రమే చెల్లించడం వల్ల రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక మండలంలో చాలామంది రైతులు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు చూసామన్నారు. ఈ రైతు ఆత్మహత్యలు ఇలాగే కొనసాగితే రాష్ట్రం అల్లకొల్లాలం అయితదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు పండించిన మిర్చి పంటకు కనీసం 25 వేల రూపాయలు మద్దతు ధర చెల్లించాలని కోరారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టి పోరాటాలు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి రాచబంటి రాము, మండల కమిటీ వత్సవాయి జానకి రాములు, నన్నక్క కృష్ణమూర్తి, తోటకూరి వెంకట నరసయ్య, మద్దిని బసవయ్య, గడ్డం కోటేశ్వరరావు, దేశబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు

నవతెలంగాణ-కొణిజర్ల

సమాజంలో మహిళలకు సమాన హక్కులు కల్పించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మెరుగు రమణ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మండల పరిధిలోని చిన్నగోపతి గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)మండల కమిటీ అద్వర్యం లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం బొలమాల సరోజన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మెరుగు రమణ మాట్లాడుతూ మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. నాడు మహిళలు వీరోచిత పోరాటం చేసి ప్రాణాలర్పించిన స్ఫూర్తితోనే మార్చి8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆవిర్భవించడమేకాక ఐక్యరాజ్యసమితి కూడా 1978లో ఆమోదించిందన్నారు. ఈనాడు పాలకులు పోరాడి సాధించిన హక్కులను కాలరాస్తూ నేడు 12 గంటల పని విధానాన్ని తెచ్చి మహిళల కార్మికులపై పనిభారాన్ని పెంచి వేతనాల్ని తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నేటి బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ఒకవైపు పౌష్టికాహారం లేక నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి 54 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు సాధికారత ఇస్తాన్న అంటున్న బిజెపి మనువాద విధానాలను తెచ్చి కులాల , మతాల, మధ్య సనాతన ఆచారాలతో మహిళలను ఇబ్బందులకు గురిచేస్తుందని మహిళల మీద దాడులు, హత్యలు, అత్యాచారాలు, హింస, పెరుగుతున్న వాటిని నివారించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించాలంటే చట్టసభలో 33% రిజర్వేషన్ అమలు చేయాలని మహిళల రక్షణ కోసం తెచ్చిన చట్టాలను కూడా పటిష్టంగా అమలు చేయకపోవడం వల్ల మద్యం, మత్తు పదార్థాలు, డ్రగ్స్ , పబ్బుల వల్ల, మహిళలపై హింస పెరుగుతుందని వెంటనే వాటిని నివారించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో 2 లక్షల కోట్లు కేటాయించాలని, రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉచిత బస్సు కరెంటు తప్ప మిగిలిన పథకాలు అమలు చేయడం లేదని ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి తాత పద్మ ,మండల నాయకులు కురెల్లీ సరోజని, కొచ్చర్ల కుమారి, రత్నం, బుర్రి నిర్మల, లింగాల కుమారి, గుడిమల్ల పుష్ప, కురెల్లి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.



మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

- గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

మహిళలు అన్ని రంగాలలో రాణించగలరని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సునీత, సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కొన్ని సంవత్సరాలుగా రోజువారీ కూలీలుగా, పారిశుద్ధ్య కార్మికులుగా పని చేస్తున్న పేద మహిళలను శాలువాలతో ఘనంగా సత్కరించి మహిళలంతా సమానులే అని చాటి చెప్పారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థినులు ఎంతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించినటువంటి సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్, మదర్ థెరిస్సా, ఝాన్సీ రుద్రమదేవి, చాకలి ఐలమ్మ ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము తదితర మహిళల విజయాల గురించి గొప్పగా తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ... ఎన్ని కష్టాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కళాశాలలో కోలాహలంగా మహిళా దినోత్సవ వేడుకలు చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుంది

- మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు
- 'మిరాకిల్ మైండ్స్' పాఠశాలలో స్పోర్ట్స్ డే సంబురం

నవతెలంగాణ-సత్తుపల్లి



క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం అలవడటంతో పాటు మానసిక ఉల్లాసం, దేహ దారుఢ్యం వృద్ధి చెందుతుందని మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక సిద్దారం రోడ్డులోని 'మిరాకిల్ మైండ్స్' పాఠశాలలో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో ఎంఈవో మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, గెలవడానికి మాత్రం గట్టి ప్రయత్నం జరగాలన్నారు. ఇదే స్ఫూర్తితో విద్యలో ముందుకు సాగేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ఆటపాటల ద్వారా ప్రావీణ్యం సాధించడం ద్వారా అన్ని రంగాల్లో విద్యార్థులు అగ్రభాగాన నిలవడానికి సులువు అవుతుందని పాఠశాల చైర్మెన్ డెన్నీ ఇజ్రాయెల్ అన్నారు. ప్రిన్సిపాల్ మొండ్రు రత్నాకర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషితో తమ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు బూరుగు మురళీమోహన్, సరిత క్రీడా పోటీలను పర్యవేక్షించగా ఉపాధ్యాయినులు వాణి, గీత, అన్ను, మహేశ్, పద్మ మౌనిక, రమ, ఆశ, రోహిణి, అనూష పాల్గొన్నారు.

విద్యుత్ తనిఖీలు ముమ్మరం

నవతెలంగాణ-ఖమ్మం

జిల్లాలో విద్యుత్ దొంగతనాలు పెరుగుతున్న నేపథ్యంలో విజిలెన్స్ పోలీస్, విద్యుత్ శాఖ ఆకస్మిక తనిఖీలు ముమ్మరం చేసిందని ఖమ్మం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ అండ్ ఏపిటిఎస్ పిఎస్‌కె. వినోద్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటుందని విజిలెన్స్ పోలీస్ స్పష్టం చేశారు. ఇటీవల కొంత మంది వ్యక్తులు విద్యుత్ వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తూ మీటర్ తిరగకుండా చేయగలమని చెప్పి డబ్బులు తీసుకుని, మీటర్‌లోని కొన్ని వైర్లను కట్ చేసి అక్రమ చర్యలకు పాల్పడుతున్నట్లు విజిలెన్స్ పోలీస్, విద్యుత్ శాఖ గుర్తించింది. ఈ చర్యలో భాగంగా, వివిధ ప్రాంతాల్లో విజిలెన్స్ పోలీస్, విద్యుత్ శాఖ బృందాలు తనిఖీలు నిర్వహిస్తూ దొంగతనాలను గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రజలందరూ ఇలాంటి మోసపూరిత వ్యక్తుల మాటలను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎవరికైనా ఈ విధంగా అక్రమంగా మీటర్ మార్పు చేయగలమని చెప్పిన వ్యక్తులు ఎదురైనా, ప్రజల దృష్టికి వచ్చిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ దొంగతనాలను అరికట్టేందుకు ప్రజల సహకారం అవసరమని అధికారులు స్పష్టం చేశారు.

వరి పొలాలను పరిశీలించిన ఏవో

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని కూసుమంచి గ్రామంలో వరి పొలాలను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రస్తుతం వరి దుబ్బు చేసే దశ నుండి ఈనే దశలో ఉందని, ప్రస్తుతం ఉన్న వాతావరణ సుడిదోమ ఆశిస్తున్నట్లు గమనించడం జరిగిందని తెలియజేశారు. కావున, సకాలంలో దోమ ఉధృతి గమనించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్స్, కుర్చీలు పంపిణీ

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలో చెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గ్రామస్తులు ప్యాడ్స్, కుర్చీలు అందించడానికి ముందుకు వచ్చి శుక్రవారం అందజేశారు. గ్రామస్తులు సహకారానికి ప్రధానోపాధ్యాయులు పోట్రూ మధు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

- ట్రాన్స్ కో ఏఈ కె.రామారావు

నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని కొత్త కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా నేలకొండపల్లి, కొత్త కొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలపురం, పైనంపల్లి, బోదులబండ, రామచంద్రపురం, అనంతనగర్, కొరట్లగూడెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ రామారావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ తీగలకు తగిలే చెట్లను తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కారణంగా నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు ఈ విషయాలను గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించవలసిందిగా కోరారు.

మంత్రి పొంగులేటికి అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం



గత నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన జిపి లేఔట్ ప్లాట్స్, ఎల్‌ఆర్‌ఎస్ ఫీజుల విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫీజ్ ఎలా చెల్లించుకోవాలనే విధంగా కొత్త జీవో తీసుకొచ్చినందుకు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బిల్డర్స్, రియల్ ఎస్టేట్ అసోసియేషన్ ప్రముఖులు సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పాత జిపి లేఔట్స్‌లో రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్స్ అన్నిటికీ ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు ఈ రోజువరకు కూడా కట్టించుకోవాలని కోరారు. ఈ విషయంపై మంత్రి మళ్ళీ పునపరిశీలించి పరిష్కారం చూపుతామని మాట ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షులు తుంపాల కృష్ణ మోహన్, గౌరవ అధ్యక్షులు గరికపాటి ఆంజనేయ ప్రసాద్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, గణపరపు వీరన్న, ఉన్నం జగన్, షేఖ్ ఖలీల్, రామకృష్ణ, శంకర్‌రెడ్డి, మన్నేటి నాగేశ్వరరావు, జూలకంటి శ్రీనివాసరావు, షాభాద్ మాధవరెడ్డి, కిషోర్‌రెడ్డి, సుదగాని వెంకటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, బాణోత్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో మహిళ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొణిజర్ల



మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రోజారాణీ, ఎంపీవో రాజేశ్వరిలు కేక్ కట్ చేశారు. అనంతరం మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, ఆయా గ్రామాల మహిళ పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ మహిళ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అడవుల్లో కార్చిచ్చు

- మండుతున్న మణుగూరు రథం గుట్ట
- పట్టణాన్ని కమ్మేసిన దట్టమైన పొగలు
- కళ్ళ మంటలతో ప్రజలు విలవిల



నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు మండలంలో పచ్చని అడవులలో కార్చిచ్చు రగులుతోంది. పగిడేరు, బుగ్గ పంచాయతీ, తదితర దట్టమైన అడవుల్లో మంట లెగిసిపడుతున్నాయి. అడవులు కాలిపోతున్నాయి. దీనితో విపరీతమైన పొగ వాతావరణంలో కలిసిపోతుంది. మణుగూరు పట్టణానికి మణిహారమైన రథం గుట్ట మండుతుంది. సెలయేళ్ల అడవి జంతువులు, పక్షుల కిలకిల రావాలతో అలరారే రథం గుట్టపై గత మూడు రోజులు భారీగా అగ్నిజ్వాలలు రాజు కుంటున్నాయి. దీంతో మంటలు చెలరేగి అడవి సంపద అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అడవిలో ఉండే జీవ రాసుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఎన్నోరకాల వన్యప్రాణులు కూడా అగ్నికి ఆహుతౌతున్నట్టు తెలుస్తుంది. అగ్ని జ్వాలలతో విలువైన పచ్చని మొక్కలు, భారీ చెట్లు మంటలకు కాలి బూడిద అయ్యాయి. అడవిలో చెలరేగుతున్న మంటలకు ఎండుకలప, పచ్చని అడవి, మొక్కలు, ఆరోగ్యాలను సంబంధించిన ఔషధ మొక్కలు, క్రిమికీటకాలు, ప్రభుత్వ యంత్రాంగం, అటవీశాఖ అధికారులకు నాటించిన నాణ్యమైన పండ్ల మొక్కలు కాలి బూడిద అవుతున్నాయి. రథం గుట్టపై వ్యాపించిన కార్చిచ్చుతో చెలరేగిన మంటలతో మణుగూరు పట్టణంతోపాటు పరిసర గ్రామాలలో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. రాత్రి సమయంలో నెలకొన్న ఈ ఘటనతో కళ్ల మంటలతో, పొగతో ఉక్కిరి బిక్కిరితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అడవులు, చెట్లు, జీవరాశులను రక్షించుకోవాలని ప్రభుత్వాలు కోట్లు ఖర్చుపెట్టినా అడవులను, చెట్లను జీవరాశులను రక్షించుకోవాలని ఫారెస్ట్ అధికారులు, ప్రభుత్వం పరితపిస్తుంది. బాధ్యతగా మణుగూరు అధికారులు ఇప్పటికైనా సంబంధిత జిల్లా అటవీశాఖ అధికారులు స్పందించి మంటలు ఆర్పేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అప్పుడే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని, విలువైన వృక్ష సంపదను కాపాడుకోవడంతోపాటు, వణ్య ప్రాణులను రక్షించుకోగలుగుతామని, స్థానికులు వన్య ప్రేమికులు ప్రజలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

బృందాలుగా విడిపోయి మంటలను ఆర్పుతున్నాం



మంటలను ఆర్పేందుకు అటవీశాఖ అధికారులుచే ఐదు బృందాలు ఏర్పాటు చేశాము. బ్లోయర్స్ ఉపయోగించి ఐదు టీములతో మంటలు అర్పిస్తున్నాము. రాత్రి సమయంలో సాధ్యం కావడం లేదు. మళ్లీ మంటలు చెదరేగుతున్నాయి. రథం గుట్ట ప్రమాదకర పరిస్థితిలో ఉంటుంది. కావునా పగలు మాత్రమే మంటలు ఆర్పేందుకు సాధ్యమవుతుంది. రాత్రి సమయాలలో సాధ్యపడడం లేదన్నారు.

- ఫారెస్ట్ రేంజర్ పి.ఉపేంద్ర

దేశ నలుమూలల నుండి వచ్చే రామయ్య భక్తుల సౌకర్యార్థం ఆమె తీసుకునే నిర్ణయం రామబాణంతో సమానం...రామయ్య కార్యంలో పారదర్శక పాలన ఆమెకే సొంతం....విధి నిర్వహణలో రాజీలేని తత్వం ఆమె ప్రత్యేకం.... అవకాశాలు కల్పిస్తే సాధించలేనిది ఏమీ లేదని నిరూపిస్తూ రెండేళ్ల సమర్థవంత పాలన పూర్తి చేసుకుంటూ మహిళా ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆలయ ఈవో రమాదేవి పై మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం..!



ఆమె నిర్ణయమే రామబాణం

బినామీ గుత్తేదారులకు చెక్కు పెడుతూ..!

సుదీర్ఘకాలంగా దేవాలయంలో నిర్వహించే వివిధ సేవలకు కాంట్రాక్టు పద్ధతిలో నిర్వహించే బహిరంగ వేలం పాటలను బినామీల ద్వారా చేజిక్కించుకుంటూ ఆలయం పైనే ఆదిపత్యం చెలాయిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న బినామీ కాంట్రాక్టర్లకు చెక్కు పెడుతూ పారిదర్శకంగా వేలంపాటలు నిర్వహి స్తూ లడ్డు ప్రసాదం, మొబైల్ లాకర్, స్వామివారి వస్త్ర విక్రయం తదితర కాంట్రాక్టర్ నిర్వహణలో ప్రక్షాళన తీసుకొస్తూ బినామీలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు.

అన్ని సేవలు ఆన్‌లైన్ లోనే..!

రామయ్య సేవలు సులభతరం తోపాటు పారిదర్శకంగా ఉండేందుకు అన్ని సేవలను డిజిటలేషన్ చేసిన ఈఓ రమాదేవి ప్రధానంగా రామయ్యకు భక్తులు సమర్పించే వస్త్ర దానములో క్యూర్ కోడ్‌ని తీసుకువచ్చి భక్తుల మనోభావాలను కాపాడుతూ స్వామివారి వస్త్రాలపై విశ్వసనీయత పెంచారు. రామయ్య దర్శనం అర్చన ప్రత్యేక పూజలతో పాటు ప్రోటోకాల్ విభాగం అదేవిధంగా అన్నదానానికి సైతం డిజిటలేషన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చి ఆలయంలో పేరుకు పోయిన అవినీతి మరకలను చెడిపి వేశారు.

పారదర్శక పాలన ఆమెకే సొంతం | మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్న ఈవో రమాదేవి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అవనిలో సగమైన మహిళా మణులకు అవకాశాలు కల్పిస్తే అందుకోలేనిది ఏమీ లేదని నిరూపిస్తూ సమర్థవంతమైన పాలనలో రెండేళ్లు పూర్తి చేసుకుంటున్నారు భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన ఆలయ ఈవో ఎల్ రమాదేవి. పాలనలో అనేక రకాల పక్షానలు తీసుకువస్తూ భక్తులకు రామయ్య సేవలను సులభతరం చేయటమే కాకుండా అవినీతి మరకలు అంటకుండా రామబాణం కంటే పదునైన నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ ప్రతిష్టను పెంచడమే కాకుండా భక్తుల ప్రశంసలు ఆలయ ఈవో రమాదేవి పొందుతున్నారని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. విధి నిర్వహణలో అవినీతి ఆరోపణలే కాదు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించినా కొరడా జులిపిస్తూ ఏళ్ల తరబడి పాతుకుపోయిన అధికారులను ప్రక్షాళన చేసి పాలనలో తన మార్క్ చూపించారు.

విజయవంతంగా ఉత్సవాల నిర్వహణ...!

2023 శ్రీరామనవమి సందర్భంగా ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి శ్రీరామనవమి ముక్కోటి అధ్యయనోత్సవాలు సందర్భంగా స్వామి వారి తెప్పోత్సవం వైకుంఠ ఉత్తర ద్వార దర్శనంతో పాటు కార్తీక మాస దీపా ఆరాధన, నది హారతి, శివరాత్రి సందర్భంగా శివపార్వతుల కళ్యాణ మహోత్సవం, రామదాసు శత జయంతి ఉత్సవాలు, దమ్మక్క ఉత్సవాలు, శబరి స్మృతి యాత్ర తదితర ముఖ్య వేడుకలను విజయవంతం చేయటంలో ఆమె మార్క్ చూపించారు. ఉత్సవాలకు వచ్చే ప్రభుత్వ పెద్దలు, ఉన్నత అధికారుల ప్రోటోకాల్ ప్రజాప్రతినిధులను మెప్పిస్తూనే సామాన్య భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా సంస్కరణలు చేపట్టి శభాష్ అనిపించుకున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఎప్పటికప్పుడు ఆలయ



మర్యాదలతో గౌరవించడమే కాకుండా డోనర్స్ డే వంటి ప్రత్యేక రోజున దాతలను గుర్తు పెట్టుకొని వారిని సత్కరించి గౌరవిస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. ఆలయా ఆదాయాన్ని పెంచుతూ భక్తులకు సౌకర్యాలను మెరుగుపరుస్తూ గతం కంటే భిన్నంగా పాలన అందిస్తూ రామయ్య దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నప్రసాద అవకాశాన్ని కల్పించడమే కాకుండా మజ్జిక జల ప్రసాదాని సైతం అందుబాటులోకి తీసుకురావడంతో పాటు ఆలయం చుట్టూ భక్తులు నడిచేందుకు వీలుగా శాశ్వత షెడ్‌లను దాతల సహకారంతో పూర్తిచేసి సీతారాముల దేవస్థానం ప్రతిష్టను పెంచడంలో సఫలీతమయ్యారు. మహిళా ఉద్యోగిగా విధి నిర్వహణలో ఎదురయ్యేఆటుపోటులను అధిగమిస్తూ పాలకుల ప్రశంసలు పొందుతూ భక్తులతో శభాష్ అనిపించుకుంటూ రామయ్య కార్యలయంలో సమర్థవంతమైన పాలనను అందిస్తూ మహిళ అధికారులతో పాటు తోటి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలుస్తున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆలయ ఈవో రమాదేవికి మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ సాహితీ సంస్థ ప్రత్యేక అభినందనలు తెలియజేస్తుంది.

కరువవుతున్న మహిళా సాధికారత

- సామ్రాజ్యవాద చేతుల్లో నలిగిపోతున్న స్త్రీలు
- మహిళల పట్ల పెట్రేగిపోతున్న అమానవీయ పరిస్థితులు
- అబల కాదు...సబల అని ఐక్యంగా పోరాడాలి శ్రామిక మహిళలు

"20వ శతాబ్దం ప్రారంభంలో క్రూరమైన దోపిడీ అమానవీయ పని పరిస్థితులకు సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా తమకు ఓటు హక్కు కావాలని డిమాండ్తో మహిళా కార్మికులు చేసిన పోరాట ఫలితంగా మనం ప్రతి సంవత్సరం మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటు న్నాము. ముఖ్యంగా భారతదేశంలో నానాటికి మహిళల పట్ల పెరుగుతున్న దాడులను వ్యతిరేకంగా మహిళలు సమిష్టిగా పోరాడాలని నేడు జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం"

నవతెలంగాణ-చర్ల

మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసకాండని అరికట్టడం కోసం, మహిళా సాధికారత సాధించడం కోసం స్త్రీలు శక్తివంచన లేకుండా కృషి చేసి సమస్యలను సాధించుకోవాలి. జర్మన్ విప్లవకారిని సోషలిస్టు నాయకురాలు కార్ల జెట్కిన్ ప్రతిపాదన ప్రకారం ఆగస్టు 1910లో డెన్మార్కులోని ఓపెన్ హాంగ్‌లో జరిగిన అంతర్జాతీయ సోషలిస్టు ఉమెన్స్ కాన్ఫరెన్స్ మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని నిర్ణయం చేశారు. ఆ డిమాండ్ ప్రకారం 1975లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తించింది. అప్పటినుండి ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మొదలైంది. నాటి నుండి భారతదేశంలో సైతం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తూ మహిళలకు సమానత్వం, న్యాయం, దోపిడీ, వివక్ష హింస లేని జీవిత లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుగుతున్నది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సోషలిస్ట్ వర్గ దృక్పథాన్ని



మరుగుపరచి వ్యాపార సంస్కృతి పెరుగుతుంది. ప్రస్తుతం భారతదేశంలో మహిళలు చాలా దారుణమైన పరిస్థితిలమధ్య మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారని ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు తాటి నాగమణి, పొడుపు కంటి సమ్మక్కలు విమర్శించారు. ముఖ్యంగా శ్రామిక మహిళల హక్కులపై వివక్ష దాడులు విపరీతంగా పెరిగాయని నిత్యావసర వస్తువులు సేవల ధరల భారాలు ప్రజలపై పడుతున్నాయి. బీజేపీ ప్రభుత్వ ఆహార పదార్థాల పైన జీఎస్టీ అవసరమైన మందులు పెట్రోలియం ఉత్పత్తుల ధరలపైన నియంత్రణ ఎత్తివేయడం వల్ల సామాన్య ప్రజల రోజువారి ఖర్చులు భారీగా పెరిగాయి. వ్యవసాయ సంక్షోభం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో వలసలు భారీగా పెరగడంతో మహిళలు అప్పుల పాలవుతున్నారు. ప్రయివేట్ మైక్రో ఫైనాన్స్ వల్ల ఆత్మహత్యలకు మహిళలు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు.

విద్యా, వైద్యంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

పొడుపుగంటి సమ్మక్క, ఐద్వా మండల కార్యదర్శి



సామాన్య ప్రజలకు అందించే విద్యా వైద్యం పట్ల ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి లేదు. మహిళల పట్ల నానాటికి పెరుగుతున్న అరాచకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం. ముక్కుపచలారని పసిగందుల నుండి ముసలి వారి వరకు అత్యాచారాలకు గురవుతున్నారు. బీజేపీ ప్రభుత్వం మహిళా సాధికారతను గాలికి వదిలేసి ఇష్టానికి నల్ల చట్టాలను దొడ్డి దారిన తీసుకొస్తుంది.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

ఐద్వ మండల అధ్యక్షురాలు
తాటి నాగమణి



సమాజంలో మహిళలు చేస్తున్న కష్టానికి ఫలితంగా సమాన పనికి సమాన వేతనం కల్పించాలి. భారతీయ మహిళల్లో 40 శాతం మంది పిల్లల, వృద్ధుల, సంరక్షణ కారణంగా ఎటువంటి జీతభత్యాలు లేని పనిలో రోజుకు ఆరు గంటలు వెచ్చిస్తున్నరని లెక్కలు చెబుతున్నాయి. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి)లో మహిళ కుటుంబ పని విలువ సంవత్సరానికి 22 లక్షలు కోట్లు. ఈ స్థితిలో గృహిణిగా మహిళ చేస్తున్న పనిని ప్రభుత్వం గుర్తించాలి.

మహిళలకు భద్రత, సురక్షితం కల్పించాలి

సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధా కుమారి



మహిళల చేత నిర్వహించే పని సమయాలలో వారికి భద్రతతో కూడిన సురక్షిత ప్రయాణం ఏర్పాటు చేసే చట్టాలు తేవాలి. అటువంటి చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిపై చర్యలు చేపట్టాలి. సమాన వేతనం ప్రసూతి ప్రయోజనాల అమలులో తీవ్ర లోపం ఎక్కువగా జరుగుతున్నది. లేబర్ కోడ్లు అమలు అయితే కనుక కార్మిక హక్కులు పూర్తిగా హరింపబడతాయి.

పరువు హత్యలు తగ్గాలి

తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్
సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.విజయశీల



సమ సమాజ స్థాపనకు ఎంతో కృషి చేస్తున్న మహిళల పట్ల అగత్యాలు ఆగాలి. కులాంతర వివాహాల విషయంలో పరువు హత్యలు జరగకూడదు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సరైన నిధులు కేటాయింపు లేకపోవడంతో దానిపైన ఆధారపడ్డ మహిళా కార్మికులకు పని దొరకటం లేదు. ఇప్పటికే బీజేపీ పాలిత రాష్ట్రాలు మహిళల పట్ల ద్వేషాన్ని పెంచుతున్నాయి. అమెరికా సామ్రాజ్యవాదం అండతో ఇజ్రాయిల్ సేన పై చేస్తున్న జాతీయ హనన చర్య వల్ల వేలాది మంది మహిళలు, పిల్లలు చనిపోతున్నారు. భారతదేశంలో మహిళలు, పిల్లలపై హింస ఆందోళన కలిగించే స్థాయిలో ఉంది. రానున్న రోజుల్లో మహిళా ఐక్యత లోపిస్తే మరింత కఠినత్వం పెరుగుతుంది.

భోజనం నాణ్యతలో రాజీపడేదిలేదు

- మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-పాల్వంచ

చిన్నారులకు అందించే భోజనం నాణ్యత విషయంలో రాజీపడేది లేదని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్పష్టం చేశారు. పాత పాల్వంచ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలను ఆకస్మికంగా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మధ్యాహ్న భోజన మెనూను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో భోజనం చేస్తూ కలెక్టర్ వారితో మమేకమై వారి బాగోగులను భోజనం పై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఆహారాన్ని తీసుకునే ముందు చేతులను సబ్బుతో పరిశుభ్రంగా కడగాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను బాగా గ్రహించాలని అందుకు ఏకాగ్రత అవసరమని కలెక్టర్ అన్నారు. పాఠ్యాంశాలలో సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ...వంట వండే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత్రలను ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు. పాఠశాలకు మంజూరైన స్పోర్ట్స్ మెటీరియల్ కిట్లను ఆయన పరిశీలించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా కోఆర్డినేటర్ సైదులు, సతీష్ కుమార్, ఎంఈఓ రామ్మూర్తి, ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, మరియు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ గృహం

- ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-అశ్వారావుపేట

అర్హులైన ప్రతీ ఒక్కరికీ నిలువ నీడ కల్పించడం మే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం అని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ విభాగంలో ఎంపిక పాతరెడ్డిగూడెంలో ఆయన శుక్రవారం గృహ నిర్మాణాలకు ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చటానికి ఇందిరమ్మ గృహాలను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, హౌసింగ్ డీఈఈ సుబ్రహ్మణ్యం, పలు శాఖల అధికారులు, కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు కేటాయించిన పనులు సకాలంలో పూర్తి చేయాలి



- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూలర్

శ్రీ సీతారామచంద్ర స్వామి తిరుకల్యాణం, పట్టాభిషేకం పర్వదినానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముఖ్య కూడళ్ళలో భక్తులు అధికంగా బస చేసే ప్రదేశాలలో టెంపరరీ, శాశ్వతంగా నిర్మాణం చేపట్టే టాయిలెట్ల పనులు వేగవంతం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాచలంలోని కాపా రామలక్ష్మి, బస్టాండ్, జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్, పార్క్ పక్కన ఉన్న తాత్కాలికంగా, శాశ్వతంగా నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు బస చేసే ప్రదేశాలలో నీటి సమస్య రాకుండా టాయిలెట్లు నిర్మించాలని అలాగే స్నానాలు గదులు కూడా అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ నెల 25వ తారీకు వరకు పూర్తి కావాలని అన్నారు. అంతకుముందు ఏఎంసీ కాలనీ, మానుబోతుల చెరువు దగ్గర ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి అక్కడ నివసిస్తున్న కుటుంబాలతో వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్య విద్యుత్ సమస్య చాలా తీవ్రంగా ఉందని నివసిస్తున్న కుటుంబ సభ్యులు పీవో దృష్టికి తీసుకురాగా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించడానికి దానికి సంబంధించిన ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ ఏఈఈకి ఆదేశించారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో నిర్మాణం జరుగుతున్న డైనింగ్ హాల్ పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ చంద్రశేఖర్, డీఈ హరీష్, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణ రావు, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాసరావు, టీఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి కామ్రేడ్ కాసాని

- 9న ఐలయ్య సంస్మరణ సభ

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని ఐలయ్య అని, ఈ నెల 9 ఐలయ్య సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర నాయకులు అన్నవరపు కనకయ్యతో కలిసి మచ్చా జరుగుతున్న పనులను పరిశీలించి మాట్లాడారు. తన చివర శ్వాస వరకు పేదల కోసం పనిచేసినటువంటి ధన్యజీవి కామ్రేడ్ కాసాని అయిలయ్య అన్నారు. ఆయన మరణం ఈ ప్రాంతానికే కాదు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తీరని లోటన్నారు. ఐలయ్య సంస్మరణ సభకు వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు తదితర నాయకులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, రేపాకులు శ్రీను, లిక్కి బాలరాజు, కున్సోత్ ధర్మ, మండల కార్యదర్శి వీర్ల రమేష్, నర్రా శివరామకృష్ణ, గండమాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో వినతి

నవతెలంగాణ-దమ్మపేట

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల వలే గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా కార్మికుల అకౌంట్లో వేతనాలు చెల్లించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో వివిధ రకాల పారిశుధ్య పనులు చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవలు అందిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన శ్రద్ధ వహించడం లేదని అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని గత జనవరిలో ప్రకటించి నేటికి రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ ఆ వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం మరిచిందని అన్నారు. త్వరలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పంచాయతీ కార్మికుల వేతనాలకు బడ్జెట్ కేటాయించే విధంగా ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని, కార్మికుల బకాయిల వేతనాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని విడనాడాలని, ఎస్టిఓలలో నిలిచిపోయిన కార్మికుల వేతనాలు విడుదల చేయాలని, ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఒక పూట పనికి ఉత్తర్వులు ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు విజయలక్ష్మి, యశోద పాల్గొన్నారు.



మండలంలో ఎమ్మెల్యే జారె పర్యటన

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం మండలంలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గన్నారు. అర్జున్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. అనంతరం బెజవాడ పుల్లారావు కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అనారోగ్య సమస్యతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు రొయ్యల కుమార్, పాషాలను పరామర్శించి వారి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. విద్యుత్‌షాక్‌తో మరణించిన రంగు కోకిల, అనారోగ్యంతో మరణించిన అత్తులూరి పాపారావు, నక్కా సూర్యచంద్రరావు కుటుంబ సభ్యులను పరామర్శించి ఏమైనా ఇబ్బందులు ఉంటే తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

. స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే జారె

దమ్మపేటలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ అధికారులు పారిశుధ్య కార్మికులు వివిధ శాఖల సిబ్బందితో కలిసి ప్రధాన రహదారిపై రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాలను తొలగించి రహదారిని పరిశుభ్రంగా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించడం గర్వకారణంగా ఉందన్నారు. పరిశుభ్రత జీవితంలో ప్రతి వ్యక్తికి చాలా ప్రాముఖ్యమైనదని మన పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆరోగ్యమే కాకుండా మన సమాజం కూడా శుభ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్మిక సోదరులు కూడా ఎంతో కష్టపడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయల వర్ధంతి సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-దమ్మపేట

ఖమ్మంలో ఆదివారం జరుగు రాయల సుభాష్ చంద్రబోస్(రవన్న) 9వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అమర్లపూడి రాము పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని లింగాలపల్లి, గొర్రెగుట్ట, గురవాయిగూడెం గ్రామాలలో రవన్న వర్ధంతి సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తాటి సత్యం, తామ రాముడు, సోయం లక్ష్మయ్య, సోయం నాగేశ్వరరావు, కుంజ శ్రీను, తాటి ముత్యాలరావు, కుంజ పాపారావు, కేసరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దళిత ఆశా వర్కర్‌పై జరిగిన అత్యాచారాన్ని ఖండించండి

- నిందితునిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి
- సీఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్

నవతెలంగాణ-ములకలపల్లి

జగిత్యాల జిల్లాలో రాయికల్ దళిత ఆశా వర్కర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని సీఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో దళిత ఆశా వర్కర్‌పై జరిగిన అత్యాచారానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో మహిళ రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ మహిళలపై దాడులు అత్యాచారాలు జరుగుతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలు పూర్తి స్థాయిలో అమలు కాకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు. మహిళ కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్‌పై అత్యాచారం చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చిక్కుల శ్రీనివాస్, గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మాధవ్, మేకల రమేష్, పసుపులేటి వెంకటేశ్వర్లు,మరోజు రాజు, తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి పాఠశాలల ప్రస్థానంలో మరో కలికితురాయి

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

త్రివేణి పాఠశాల అత్యున్నత విద్యా ప్రమాణాలతో నిర్దిష్టమైన ప్రణాళికలతో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దడంలో మార్గనిర్దేశకులుగా, సుశిక్షితులైన అధ్యాపక బృందంతో రాణించినందుకుగాను అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ (ఐఓబి) వారు 2024-2025 విద్యా సంవత్సరానికి గాను స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ అవార్డు త్రివేణి అధ్యాపక బృందంను సముచితంగా సత్కరించారు. ముఖ్య అతిథి హ్యాండీక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నాయుడు సత్యనారాయణ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డా. జి.వీరేంద్ర చౌదరి, జి.జగదీష్, సి.ఆర్.ఓ. కే మురళి కృష్ణ, ప్రిన్సిపల్స్ వై.వి.సురేష్, శ్రీనివాస్ సింగ్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎంచుకున్న అంశంలో లీనమై అభ్యసించాలి

- డాక్టర్ జే.క్రిష్ణ ప్రసాద్

నవతెలంగాణ-అశ్వారావుపేట

ఎంచుకున్న అంశం(సబ్జెక్ట్)లో లీనమై చదివితేనే దానిపై పూర్తి అవగాహన చేకూరుతుందని ఆచార్య ఎన్.జి రంగ అగ్రికల్చరల్ యూనివర్సిటీ పూర్వ డీన్ అఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జే.క్రిష్ణ ప్రసాద్ జేఆర్ఎఫ్ (జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) విద్యార్థులకు (అభ్యర్థులకు) సూచించారు. అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలోని ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులు పాటు జేఆర్ఎఫ్ పీజీ ఎంట్రన్స్ రాయబోయే ఏజీ బీఎస్సీ స్థానిక విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై అవగాహన తరగతులు నిర్వహించారు. స్థానిక వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జే.హేమంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన తరగతులకు ముఖ్య వక్తగా జే.క్రిష్ణ ప్రసాద్ హాజరై విద్యార్థులకు ప్రేరణ కలిగించే విధంగా అతిథి ఉపన్యాసం ఇచ్చారు. పీజీలో ఏ సబ్జెక్ట్‌ను ఎంచుకోవాలో బీఎస్సీ ఏజీలో చేరిన మొదటి సంవత్సరంమే నిర్ణయించుకుని ఒక లక్ష్యంతో చదవాలని తెలిపారు. ఒకే గ్రూపు ఎంచుకున్న వాళ్ళు తరుచూ సమూహ సమాలోచనలు చేస్తూ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్సీ, ఎస్టీ విభాగం ఇంచార్జీ కే.కోటేశ్వర్ సమన్వయం చేయగా, కళాశాల అధ్యాపకులు శ్రవణ్ కుమార్, రమేష్, పి. శ్రీలత, శిరీష, క్రిష్ణ తేజ, దీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా..

- ఏజెన్సీలో విస్తృతంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సేవలు
- బివి రాజు కళ్యాణిల సారథ్యంలో మరిన్ని సేవలకు సిద్ధం
- ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మి

ఒంటరి మహిళలకు అండగా వివక్షతకు గురయ్యే అభాగ్యులకు తోడుగా నిలుస్తూ ఏజెన్సీ వ్యాప్తంగా బహుముఖ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ పలు సేవా కార్యక్రమాలతో ప్రశంసలు పొందుతున్న దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ పై మహిళా దినోత్సవం సందర్భంగా నవ తెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

మనకున్న దాంట్లో ఎంతో కొంత ఇతరులకు సహాయం చేస్తూ ఒంటరి మహిళలకు అండగా నిలుస్తూ వివక్షకు గురవుతున్న బలహీన వర్గ ప్రజలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో బివి రాజు చైర్మెన్‌గా కళ్యాణి ఉపాధ్యక్షులుగా ఏర్పడ్డ దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా వ్యాప్తంగా విస్తృత సేవా కార్యక్రమాలతో రాజకీయ ప్రముఖులతో పాటు ఉన్నత అధికారుల ప్రశంసలు పొందుతుంది.

వసతి గృహాల బాలికలకు అండగా..

భద్రాచలం, బూర్గంపాడు వసతి గృహాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం వార్డెన్ హెచ్‌ఎంలకు వినతి పత్రాలు అందించడమే కాకుండా సమస్యల పరిష్కరించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వసతి గృహాలు నెలకొన్న సమస్యలు పరిష్కారం కోసం దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ సభ్యులు నిరంతరం శ్రమిస్తున్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు



నిర్వహించడమే కాకుండా సెమినర్లు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు మహిళలకు పని చేసే చోట, చదువుకునే చోట రక్షణ కల్పించాలని పోలీసు ఉన్నత అధికారులైన ఎస్‌పిసిఐ తదితర అధికారులకు వినతి పత్రాలు అందించడమే కాకుండా వేధింపులకు గురైన మహిళలకు మేమున్నామన్నా భరోసాను కల్పిస్తున్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ..

అంతరించిపోతున్న మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలనే లక్ష్యంతో సంక్రాంతి ముగ్గుల పోటీలు, దసరా బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు చీరెలు బహుమతులు అందిస్తున్నారు. క్రిస్టమస్, రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు పేద క్రిస్టియన్స్ పండగ సామగ్రిని అందించి మతసామరస్యాన్ని చాటుతున్నారు.

అభాగ్యులకు అండగా నిలుస్తూ..

అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న వృద్ధులకు, పేద కుటుంబాలను గుర్తించి వారికి కావలసిన వైద్య సదుపాయాన్ని అందించటతో పాటు ఉచితంగా మందులను ఇప్పిస్తున్నారు. వారి పోషణకు కావాల్సిన నిత్యవసర వస్తువులను అందించి తమ ఔదర్యాన్ని చాటుకున్నారు. పట్టణంలోని ఏఎంసీ కాలనీ, భూపతి రావు కాలనీ, కొత్త కాలనీలో ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచి శభాష్ అనిపించుకుంటున్నారు.

బీవీ రాజు, కళ్యాణిల సహకారంతో మరిన్ని సేవలు... : పూజల లక్ష్మి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షురాలు

నాపై నమ్మకంతో ఎంతో ప్రతిష్టాత్మకమైన దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష బాధ్యతలు రెండో సంవత్సరం కూడా అప్ప చెప్పటం ఎంతో గర్వకారణం. జాతీయ అధ్యక్షులు బివి రాజు, ఉపాధ్యక్షులు



కళ్యాణిల సహకారంతో వారు చూపించిన బాటలో పయనిస్తూ కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాను. జిల్లా వ్యాప్తంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో మా కమిటీల ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు రూపొందిస్తూ దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ కీర్తి ప్రతిష్టలు పెంచేందుకు మా వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మహిళా దినోత్సవం సందర్భంగా హామీ ఇస్తున్న.

అన్ని రంగాలలో మహిళలు ముందంజ

మహిళా శక్తికి ఎదురులేదు, మాజీ ఎంఎల్‌ఏ హరిప్రియ, ఇల్లందు



ప్రపంచంలోని అన్ని రంగాలలో మహిళలు ముందంజలో నిలుస్తూ అఖండ విజయాలు సాధిస్తున్నారని, మహిళా శక్తికి ఎదురులేదని మాజీ ఎంఎల్‌ఏ బానోత్ హరిప్రియ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. నేడు రాజకీయాలలో మహిళల పాత్ర పెరిగిందన్నారు. అన్ని రంగాలలో నేడు మహిళలే సగం వరకు ఉన్నారని అన్నారు. గత మున్సిపాలిటీలోనూ కౌన్సిలర్లు సగం మంది వరకు ఉన్నారని అన్నారు. స్థానిక సంస్థలతోపాటు లోక్ సభ, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్స్ కల్పించాలన్నారు. ప్రభుత్వం మహిళల సాధికారతకు కృషి చేయాలన్నారు. మహిళలపై జరిగే ఘోరాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిలంచాలన్నారు. హైటెక్ యుగంలోను కొందరు తల్లిదండ్రులు ఆడపిల్లల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ చదువుకు దూరం చేస్తున్నారని అన్నారు. ఎంత చదివితే అంతవరకు చదివించాలని మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లను చూడాలన్నారు.

మహిళల ఆరోగ్యమే సమాజానికి వరం

డా.కల్పన స్త్రీ వైద్య నిపుణులు,ఇల్లందు.



నిత్యం మహిళలు అనేక రంగాలలో పనిచేస్తూ తమ ఆరోగ్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఇది సరియైదని కాదని స్త్రీ వైద్య నిపుణులు డా.కల్పన పేర్కొన్నారు. స్థానిక రావూస్ స్పెషాలిటీ వైద్యశాలలో నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. వారి ఆరోగ్యమే సమాజానికి వరం అన్నారు. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలన్నారు. కొందరు తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపించకుండా పనులు చేయిస్తున్నారని అన్నారు. మరి కొందరు 10వ తరగతి వరకు చదివించి పెళ్ళిళ్ళు చేస్తున్నారని అన్నారు. తెలిసితెలియని వయస్సులో పెళ్ళిళ్ళు చేయడం మూలంగా ఆరోగ్యాలు పాడుకావడమే కాకుండా వారి కాళ్ళపై నిలబడి జీవించే అవకాశం కోల్పోతున్నారని అన్నారు. దీని మూలంగా అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. విదేశాలలో సైతం మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూస్తున్నారని అలాంటి సంస్కృతి మన దేశంలోనూ ఉండాలన్నారు.

వంటింటికి పరిమితం కావద్దు

డా.జయంతి లోథ్, హిందీ అధ్యాపకురాలు, వరంగల్

నవతెలంగాణ-ఇల్లందు



మహిళలు వంటింటికి పరిమితం కావద్దని, సాటి మహిళలకు సహకరిస్తూ అన్యాయాలను ఎదుర్కోవాలి. మహిళల చదువు జగతికి వెలుగన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పోరాడి సాధించుకున్న హక్కులు పరిరక్షించుకోవడంలో మహిళలు ముందు పీఠిన నిలబడాలన్నారు. నిర్భయ లాంటి ఎన్నో చట్టాలు చేసినప్పటికి ప్రభుత్వ విధానాల ఫలితంగా నిర్వీర్యమైపోతున్నాయన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు మారుతున్నా విధానాల్లో మార్పులు చోటుచేసుకోవడం లేదన్నారు. ఘోరాలు, కిరాతకాలు జరిగినప్పుడు దోషుల పట్ల ప్రభుత్వం కఠిన వైఖరి అవలంబించాలన్నారు. మహిళల భద్రత పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రదర్శించాలన్నారు.

హింస, మనువాదాన్ని ప్రేరేపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

వారి విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి -ఐద్వా మండల అధ్యక్షకార్యదర్శులు లక్ష్మి, సంధ్య

నవతెలంగాణ-ఇల్లందు



మహిళలపై హింసను ప్రేరేపిస్తున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎండి.జైబున్నీసా, మండల అధ్యక్షకార్యదర్శులు మునిగంటి లక్ష్మి, ఆలేటి సంధ్య అన్నారు. స్థానిక కార్యాలయంలో నవతెలంగాణతో మాట్లాడారు. ప్రపంచీకరణ, మతం, మద్యం వల్లనే మహిళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో గత బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రపంచీకరణకు మోకరిల్లుతున్నాయన్నారు. హింస, మనువాదాన్ని ప్రేరేపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. పాశ్చాత్య పోకడలు,సెల్‌ఫోన్, వాట్సాప్ అనేక రూపాల్లో మహిళలపై విరుచుకుపడుతోందన్నారు. స్త్రీని వ్యాపార వస్తువుగా చూస్తున్నారని అన్నారు. నాటి సీఎం కేసిఆర్, నేటి సిఎం రేవంత్ రెడ్డిలు ఒక అడుగు ముందుకు వేసి మద్యాన్ని ఏరులై పారిస్తు మహిళలకు భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. 90 శాతం నేరాలు, ఘోరాలు మద్యం మత్తులోనే జరుగుతున్నాయని నివేదికలు తెలుపుతున్నాయన్నారు. మతాల పేరుతో మైనారిటీ, ఆదివాసీ, మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పాలకవర్గాలు వీటిని పెంచి పోషిస్తున్నాయన్నారు. మహిళలు ఉద్యమిస్తేనే సమస్యలు తీరతాయన్నారు.

బాలిక విద్య ప్రగతికి సోపానం

అభ్యున్నతికి ప్రభుత్వం కృషి -ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ

నవతెలంగాణ-ఇల్లందు



విద్యే అభివృద్ధికి మూలమని, విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యమని, ప్రభుత్వం విద్యకోసం యేటా రూ. కోట్లు ఖర్చు చేస్తోందని రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భూక్య పద్మ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడారు. గిరిజన బాలికలకు ఆశ్రమ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో ఉచిత విద్య అందిస్తు బాలికా విద్యను బలోపేతం చేస్తోందన్నారు. ఒక్క పైసా ఖర్చులేకుండానే ప్రాథమిక విద్య నుండి పిజి, వైద్య, ఇంజనీరింగ్ తదితర అనేక ఉన్నత చదువులు చదువుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రాథమిక వ్యవసాయంలో తొలి అడుగు మహిళే. ఈనాడు వ్యవసాయ రంగంలో మహిళలు అభివృద్ధి సాధిస్తున్నారు. తిండి గింజలు, ఆహార పంటలు పండించడంలో వారి కృషి అమోఘం. మగ వారితో సమానంగా మహిళా రైతులు పొలం పనులు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ ఎందరో మహిళలు ఆర్థికోత్పత్తిలో ముందుకు సాగుతున్నారు. ప్రపంచంలో ఆహార కొరత తీరుస్తున్నారు. కూలిగా, రైతుగా, వ్యసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, కళాకారులుగా మహిళలు అన్ని రంగాల్లో నేడు రాణిస్తున్నారు. వంటింటికి పరిమితం కాకూడదు. దీని మూలంగా ఎన్నో నష్టాలున్నాయి. ఎంచుకున్న వృత్తిని, పనిని గౌరవించాలి. పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడాలి. ప్రతి మహిళ ఎవరికాళ్ళపైవారు నిలబడే విధంగా తయారు కావాలి. స్వేచ్ఛతోపాటు జీవితం సుఖమయం అవుతుంది.

మహిళ శ్రమ శక్తికి సాటిలేదు

మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎస్‌హెచ్ సుల్తాన, ఇల్లందు



నేడు మహిళలు అన్ని రంగాల్లో తమ శక్తి చూపిస్తున్నారు. మహిళ శ్రమశక్తికి సాటిలేదు. మధ్యాహ్న భోజన కార్మికురాలిగా, ఇటుక బట్టీల తయారీ నుండి విమానాలు నడపడంలోనూ, లక్షల కిలోమీటర్లు ప్రయాణించి అంతరిక్షంలో రోదసీ ప్రయోగాలు చేయడంలోనూ మందంజలో ఉన్నారు. రాష్ట్రపతిగా, గవర్నర్లుగా మంత్రులు, ప్రజాప్రతినిధులుగా, ఇంటిళ్లిపాదిని చక్కదిద్దే గొప్ప మహిళగా నేడు రాణిస్తున్నారు. ప్రభుత్వం మహిళల శ్రమను గుర్తించాలి.

సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి

నవతెలంగాణ- బూర్గంపాడు

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఎంపీడీవో జమలారెడ్డికి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మి క సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల వివిధ రకాల పారి శుధ్య పనులు చేస్తూ ప్రజలకు సేవ చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన అన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా నేరుగా వేతనాలు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడంతో కార్మికుల కుటుంబాల్లో ఆనందోత్సవం నిండిందని ఆయన అన్నారు. ప్రభుత్వం 2025 జనవరి ఒకటి నుండి జీతాలు చెల్లిస్తామని హామీ ప్రకారం వేతనాలు చెల్లించలేదని, రెండు నెలలు గడుస్తున్న ప్రభుత్వం ఇచ్చిన రెండు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు నెరవేరకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో పంచాయతీ కార్మికులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అంతవరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్టీలలో నిలిచిపోయిన కార్మికుల వేతనాలు అదే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ఒక పూట పని కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల



నాయకులు పాండవుల రామనాథం, కో కన్వీనర్ గుంటక కృష్ణ, రైతు సంఘం మండల నాయకులు కే.నాగేశ్వరరావు, పంచాయతీ కార్మికులు దమయంతి, సునీత, స్వరూప రాణి, రాధా, పెద్దయాకుబు, నరసింహారావు, తాటి గుండయ్య, దర్గయ్య తదిత రులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా బుడియా బాపు జాతర

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని లక్ష్మా తండాలో బుడియా బాపు జాతర అంగరంగ వైభవంగా జరిగింది. బానోత్ సక్రాం సాధు, రాజు సాధువుల ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగురంగుల జెండాలతో డోలు సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా గుడి దగ్గర వచ్చి జెండాలను సమర్పించారు. ఆటపాటలతో డప్పు ముత్యాలతో అంగరంగ వైభవంగా జాతర కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విహదిరాం నాయక్, తండా గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ భారత్ ఆల్యా నాయక్, లక్పతి నాయక్, బావ సింగ్ నాయక్, శంభు నాయక్, పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే కోల్డ్ టెండర్లు వేయాలి

నవతెలంగాణ -టేకులపల్లి

సింగరేణి సంస్థలో గోల్డ్ ట్రాన్స్పోర్ట్ టెండర్లు గిట్టుబాటు ధరకే వేయాలని కోయగూడెం టిప్పర్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నేలవెల్లి నరసింహారావు తెలిపారు. శుక్రవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కోయగూడెం ఓసి నుండి, రుద్రంపూర్ సిహెచ్‌పికి కోల్డ్ ట్రాన్స్పోర్ట్ టెండరు షెడ్యూల్ విడుదల చేసిందని తెలిపారు. ఈ టెండర్‌ను ఒక టన్నుకి రూ.176.50 చెల్లించే విధంగా, కాంట్రాక్టర్లు అందరికీ ఈ విషయాన్ని లిఖితపూర్వకంగా తెలియజేస్తామన్నారు. టెండర్ ను ఈ రేటుకు వేసి అసోసియేషన్ తో సహకరించాలని కోరారు. దీనిని విస్మరించి టెండర్ దక్కించుకున్న, స్వార్థంతో తక్కువ రేటుకి టెండర్ వేస్తే, బొగ్గు రవాణాను అడ్డుకుంటామని తెలిపారు. గతంలో కోయగూడెం ఓసి నుండి, ఇల్లందు సిహెచ్‌పికి తక్కువ రేటుకి వేసిన, టెండర్‌ను మూడు నెలలపాటు అడ్డుకున్నామని తెలిపారు. తరువాత ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సహకారంతో, ప్రభుత్వ పెద్దలు డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమక్షంలో, కాంట్రాక్టర్, లారీ ఓనర్లతో చర్చలు జరిపామని, ఈ టెండర్‌ని కొనసాగించమని తెలిపారన్నారు. తదుపరి టెండర్లో అసోసియేషన్ కు గిట్టుబాటు ధర చెల్లించేలా, తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఆధారపడి జీవనం సాగిస్తున్న లారీల వ్యవస్థను, నిర్వీర్యం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్, వీరన్న, సురేష్, పాల్గొన్నారు.

9

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | మార్చి 08, 2025 | www.navatelangana.com

హక్కులని సద్వినియోగం చేసుకోవాలి

- నా తోటి మహిళా మణులందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు
- కోలాటం కళాకారిణి, జనహిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ బేర శ్రీలక్ష్మి



నవతెలంగాణ-పాల్వంచ

మహిళ ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యంతో హక్కులని సద్వినియోగం చేసుకోవాలని కోలాటం కళాకారిణి, జనహిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ బేర శ్రీలక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె నవతెలంగాణతో మాట్లాడారు. మన భారత దేశం అర్ధనారీశ్వర తత్వము పురుషులను, స్త్రీలను సమానంగా చూపించే అర్ధనారీశ్వరుడు మనకు ఆరాధ్య దైవం. మహిళా సాధికారత అంటే ఒక మహిళ ఒక రంగంలో కానీ కుటుంబంలో కానీ ఒక పనిలో కానీ చదువులో మంచి నిర్ణయం తీసుకోవడమే సాధికారత ఒక మహిళ సాధికారత సాధించాలి. అంటే ముఖ్యంగా కావలసినవి ఏమిటంటే శారీరకమైన మానసికమైన ఆరోగ్యంతో పాటు చదువు కూడా ఉండాలి. అప్పుడు స్త్రీ ఎలాంటి నిర్ణయాలు అయినా తీసుకోగలరు. ఆ తీసుకునే నిర్ణయాలలో కూడా మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకోవాలి. తీసుకున్న నిర్ణయం మంచిదై ఉండాలి. మహిళలు స్వేచ్ఛగా మాట్లాడి వారి భావాలను వెల్లడించినప్పుడే మహిళల ప్రగతి సాధ్యమవుతుంది. అందుకు కుటుంబం నుండి ముందు అడుగుపడాలి. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్ర చదివితే ఎంతోమంది మహిళలలు స్ఫూర్తిని పొందుతారు. లక్ష్యసాధన కోసం పట్టుదలగా ప్రయత్నిస్తే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం అవుతుంది. వేదకాలం నాడు మహిళలదే అగ్రస్థానము, ఇంటి పెత్తనము ఆమెదే, అన్ని విషయాలలో ఆమె మాటే వేదం ఆనాడు కూడా పురుషులతో సమానంగా చదువుకున్న వారు ఉన్నారు. భారత స్వాతంత్రయ ఉద్యమంలో స్త్రీలు కీలక పాత్ర పోషించారు. వారి త్యాగం, ధైర్యం, ఆత్మవిశ్వాసం, నిస్వార్థతో స్వాతంత్రం కోసం పోరాడారు. ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, కమలాదేవి, చటోపాధ్యాయ, అరుణ ఆసఫ్ అలీ తదితరులు స్వాతంత్ర్య పోరాటంలో ముందంజలో ఉన్నారు. మహిళ ఒక అమ్మ, అక్క, చెల్లి, భార్య, కూతురిగా ప్రేమను పంచి తన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటుంది. తనకంటూ కుటుంబంలో కాస్తంత ప్రేమ ఓదార్పు తోడు మాత్రమే కోరుకుంటుంది. కొంచెం ప్రేమను చూపిస్తే చాలు లెక్కలేనంత సంతోషంలో మునిగిపోతుంది. ప్రతి ఒక్క మహిళ ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కలిగి వారు హక్కులని సద్వినియోగం చేసుకోవాలి. అవకాశాలని, నిర్ణయాత్మక స్థానాలకు ఎదగటం ఇది కేవలం ఒక ఉద్యమం కాదు...ఒక అవసరం, ఒక హక్కు, ఒక సమాజం పురోగతికి అవసరమైన ఒక అంశం.

పొదెం వీరయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

- సీఎం, ఏఐసీసీ ఇన్‌చార్జికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రామనాథం విజ్ఞప్తి



నవతెలంగాణ-పినపాక

కాంగ్రెస్ పార్టీకి ప్రాణప్రతిష్ఠ చేసిన ప్రజానేత పొదెం వీరయ్య అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం అన్నారు. శుక్రవారం ఆయన పినపాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో మచ్చ లేని నాయకులు వీరన్న అని కొనియాడారు. ఎమ్మెల్యే కోటాలో పొదెం ఎమ్మెల్సీ ఇచ్చి, రాష్ట్ర మంత్రిగా పదవి ఇవ్వాలని కోరారు. జీవితమే పార్టీ, పార్టీనే జీవితంగా జీవిస్తున్న వీరన్నకు తెలంగాణ ప్రభుత్వంలో సమూచిత స్థానం కల్పించి గౌరవించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌లకు విజ్ఞప్తి చేసారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

శ్రీ కృష్ణ సాయి జ్యూట్ బ్యాగ్స్ తయారీ సంస్థ నిర్వాహకురాలు మన్నెం సైదా



నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్

మహిళలు స్వయం శక్తితో ఎదగాలని శ్రీకృష్ణ సాయి జ్యూట్ బ్యాగ్స్ తయారీ సంస్థ నిర్వాహకురాలు మన్నెం సైదా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మన్నెం సైదా శుక్రవారం నవతెలంగాణతో మాట్లాడారు. పురుషులతో మహిళలు సమానమని, అనేక హక్కులు కల్పిస్తున్నామంటూ ప్రభుత్వాలు, నాయకులు చెబుతున్నప్పటికీ ఇంకా స్త్రీ స్వతంత్రంగా ఎదగలేకపోతున్నదన్నారు. పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడాలని మన్యం సైదా అన్నారు. ఆ స్ఫూర్తితోటే శ్రీ కష్ణ సాయి జ్యూట్ బ్యాగ్స్ తయారీ సంస్థను సుందరయ్యనగర్‌లోని పత్తి మార్కెట్ వద్ద ప్రారంభించి తాను ఎదుగుతూ పదిమందికి ఉపాధి కల్పిస్తూ కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నానన్నారు. దేశంలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగి తద్వారా అనేక రోగాలు వ్యాపిస్తున్నాయన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ లాంటి మహమ్మారి మహిళల్లో ఎక్కువ శాతం రావటానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ వినియోగం పెరగటం వల్లనేనని అన్నారు. ప్రభుత్వాలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ఎంత ప్రచారం చేసినప్పటికీ ఈజీ సర్క్యులేటెడ్ కారణంగా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. దానివల్ల అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. దానిని గుర్తించి ప్లాస్టిక్ రహిత వస్తువులను తయారు చేయాలని సంకల్పించి అన్ని రకాల ఫంక్షన్లకు కావాల్సిన జ్యూట్ బ్యాగ్ కవర్స్, స్కూలు, కాలేజీలు, హాస్పిటల్స్, పలు శుభకార్యములకు జ్యూట్ బ్యాగులను, ఫ్లేట్లని తయారు చేసి ఇస్తూ కాలుష్య రహిత సమాజాన్ని నిర్మించడంలో తన వంతు పాత్ర పోషిస్తున్నానని అన్నారు. దీనికి తన భర్త మన్నెం కృష్ణ సహకారం ఉన్నదన్నారు. ప్రభుత్వం కూడా తగిన ప్రాధాన్యత కల్పిస్తూ వీటిని ప్రోత్సహించాలని మన్నెం సైదా కోరారు.

శాంతి నిలయంకు బియ్యం అందజేత

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలో గల శాంతి నిలయంలోని మానసిక వికలాంగులకు ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన మండల తహసిల్దార్ కార్యాలయ అటెండర్ మేడికొండ ఆంథోని, పుష్ప దంపతులు రెండు క్వింటాల బియ్యాన్ని శుక్రవారం మండల తహసిల్దార్ అనిశెట్టి పున్నం చందర్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ వ్యవస్థలో ఆంతోని సుదీర్ఘ కాలం పాటు పనిచేసి ఉన్నతాధికారుల చేత ప్రశంసలు పొందారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం రెండు క్వింటాల బియ్యాన్ని మానసిక వికలాంగులకు అందజేయటం తన సేవా భావాన్ని చాటుకున్నాడన్నారు. శాంతి నిలయంలో సుమారు 55 మంది మానసిక వికలాంగులను తన సేవ ద్వారా సిస్టర్ అల్ఫి ప్రజలందరికీ మార్గదర్శకురాలుగా నిలిచారన్నారు. కార్యక్రమంలో గిర్దావర్ -1 గుగులోతు లక్ష్మణ్, యూడిసి బోయినపల్లి ఉపేందర్, టైపిస్ట్ బల్లా శ్రావణ్ కుమార్, తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ముదిగొండ

తహశీల్దార్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ కె సునీతఎలిజిబెత్ కేక్ కట్ చేసి మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. రెవెన్యూ మహిళా సిబ్బందిని శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తహశీల్దార్ సునీత మాట్లాడుతూ సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహిళలు లేనిదే లోకమే లేదన్నారు. కార్యక్రమంలో నాయబ్ తాహశీల్దార్ కె.లక్ష్మి, ఆర్ఐలు కె.ప్రసన్నకుమార్, కె.వహీదా సుల్తానా రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నవతెలంగాణ-కల్లూరు

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8 గంటల 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ బి.వెంకట్ శుక్రవారం తెలిపారు. కల్లూరు టౌన్ ఒకటి ఖమ్మం వెళ్లేటప్పుడు కుడివైపు ఉన్న వినియోగదారులకు కరెంటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు అదే విధంగా నారాయణపురం గ్రామానికి కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగాలు సహకరించాలని కోరారు.

స్త్రీ 'శక్తి'

- టీ క్యాంటీన్ ల ద్వారా స్వయం సమృద్ధి
- ఖమ్మం జిల్లాలో 30కి పైగా ఏర్పాటు
- రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అమలు
- హయ్యర్ బస్సుల కోసం మొదలైన శిక్షణ
- ఆర్థిక పుష్టిని సంతరించుకుంటున్న మహిళలు
- మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏడు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా మహిళల కోసం ప్రత్యేక పథకాలను చేపడుతోంది. క్యాంటీన్ లు, టీ స్టాళ్లు, బస్సులు, కిరాణా షాపులు... ఇలా ఎన్నింటినో అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రతి ఏడాది ఓ కొత్త థీమ్ తో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ ఏడాది (2025) మహిళల పురోగతికి హెల్ప్ చేసే వ్యూహాలు, వనరులు, చొరవలను గుర్తించి.. వాటిని విస్తతంగా, వేగంగా అమలు చేయాలనే ఉద్దేశాన్ని తీసుకున్నారు. అలాగే అన్ని రంగాల్లో లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం, మహిళలకు సాధికారత పై దష్టి సారించారు. మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక చొరవ...

మహిళలు ఇంటికే పరిమితం కాకూడదని, వారి జీవితాలు వెలుగులు నింపాలని ప్రభుత్వ సహకారంతో వారిని ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంకల్పించారు. మహిళలకు ఏ వత్తిపై అనుభవం ఉందో గుర్తించి.. దానికి తగిన విధంగా చేయూతనిస్తున్నారు. అనుభవం లేని వారికి శిక్షణ సైతం ఇప్పించి వారి కుటుంబ ఆర్థిక అభివద్ధికి తోడ్పడుతున్నారు. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక చోట్ల టీ క్యాంటీన్ లను ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో 30 కి పైగా ఏర్పాటైన ఇందిరా మహిళా శక్తి " టీ" క్యాంటీన్ లతో మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తోంది. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రత్యేక చొరవతో నెలకొల్పిన టీ క్యాంటీన్లను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

సక్సెస్ దిశగా...

ప్రభుత్వం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు స్థిరమైన ఆదాయ మార్గం చూపించాలని భావించారు. అందుకోసం వారితో టీ క్యాంటీన్లు ఏర్పాటు చేయించాలని సంకల్పించారు. అందుకోసం అన్ని శాఖల అధికారులతో చర్చించి ముందుడుగు వేశారు. టీ క్యాంటీన్ కు ప్రత్యేక లోగో, బ్రాండ్ తయారు చేయించారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మొదటి విడతలో జిల్లాలో 41 షాపులు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి షాపును కలెక్టరేట్ వద్ద ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం రూరల్ మండలం తరుణీ హాట్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. రెండు నెలల క్రితం ఏర్పాటైన ఈ క్యాంటీన్లపై మహిళలు సంతప్తి వ్యక్తం చేస్తున్నారు.

300 క్యాంటిన్ ల ఏర్పాటే లక్ష్యం..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో 10, మండలాల్లో మరో 30కి పైగా మంజూరు చేశారు. ప్రస్తుతం 22 టీ క్యాంటీన్లు నడుస్తున్నాయి. మొత్తం 300 వరకు స్త్రీ టీ క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటి ఏర్పాటుకు బ్యాంకు లింకేజీతో సంఘం తరపున రూ.1.5 లక్షల వరకు రుణం అందిస్తున్నారు. సంఘంలోని మహిళలందరికీ ఒకటే కాకుండా అర్హత, ఆసక్తిని బట్టి ఒక్కొక్కరికి ఒక క్యాంటీన్ కేటాయిస్తున్నారు. కలెక్టరేట్ ఆవరణలోని క్యాంటీన్ ఆదాయంతో పోలిస్తే గేటు బయట ఏర్పాటైన స్త్రీ టీ క్యాంటీన్కు రెట్టింపు ఆదాయం వస్తుంది. దాంతో ఇంతర ప్రాంతాల్లోకి క్యాంటీన్లను



విస్తరించాలని సంకల్పించారు. గతంలో గ్రామాల్లో టీ స్టాల్ ఏర్పాటు చేసుకున్న వారికి అనుకున్న స్థాయిలో ఆదాయం ఉండేది కాదు. కానీ ఈ క్యాంటీన్లో వివిధ రకాల టీలను తయారు చేస్తుండడంతో ఆదరణ పెరుగుతోంది. నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తుండగా, రూ.10 వేలు మిగులుతున్నాయని క్యాంటీన్ నిర్వాహకురాలు చెబుతున్నారు . తనతో పాటు మరొకరికి ఉపాధి కల్పిస్తుండడంపై ఆమె హర్షం వెలిబుచ్చారు.

అనుభవం ఆధారంగా...

స్త్రీ టీ క్యాంటీన్ మంజూరు చేసే సమయంలో లబ్ధిదారులు గతంలో ఏదైనా వ్యాపారం అనుభవం ఉందా? లేదా? అన్నది పరిగణనలోకి తీసుకుంటున్నారు. యూనిట్ కేటాయించాక ఏ మేరకు లాభాలుంటాయనే అంశంపై రెండు నెలలపాటు మండల, జిల్లా సమాఖ్యల్లో చర్చించారు. చట్టాలు, పన్నుల చెల్లింపు, వ్యాపార నిర్వహణపై 400 మంది మహిళలకు హైదరాబాద్ కు చెందిన నిపుణులతో శిక్షణ అందించారు. ఆపై రద్దీ ప్రాంతాలను గుర్తించి క్యాంటీన్లు ఏర్పాటు చేయించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మూడు నెలలుగా వాటి నిర్వహణ, లాభాలను పరిశీలిస్తున్నారు. యూనిట్లలో దివ్యాంగులకు 25 శాతం కేటాయించారు. టీతోపాటు కూల్డ్రింక్స్, ఇతరత్రా కలిపి కాస్త పెద్ద యూనిట్లు కూడా ఏర్పాటుచేయించాలని నిర్ణయించారు. ఇవి ఖమ్మం కార్పొరేషన్లో మూడు, మండలాల్లో 10 వరకు ఏర్పాటు కానున్నాయి. పదేళ్ల తర్వాత కూడా కొనసాగాలనే సంకల్పంతో ఈ క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవేకాక కొత్తగా మహిళా సమాఖ్యలకు బస్సులను సైతం సమకూర్చుతున్నారు. జిల్లాలో ఏడు బస్సులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంబంధిత మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. అద్దె బస్సులను సైతం అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో మరో ఏడు జిల్లాల్లోనూ వీటిని నెలకొల్పేందుకు చర్యలు చేపడుతున్నారు.

కలెక్టరేట్ క్యాంటిన్ లో పలువురికి ఉపాధి..

స్త్రీ టీ క్యాంటీన్ గతనెల 4న ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నలుగురు కలిసి ఒక యూనిట్ గా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం టీ, కాఫీ, అల్లం టీ అమ్ముతున్నారు. కరెంట్ సౌకర్యం రాగానే పాలు, పెరుగు కూడా అమ్ముతారు. రోజురోజుకు వ్యాపారం పుంజుకుంటోంది. మొదటి నెల రూ.50 వేలు వచ్చింది. రుణ కిస్తీ చెల్లించగా.. కొంత మిగులుతోందని నిర్వాహకులు తెలిపారు. నలుగురు కలిసి ఏర్పాటు చేసుకున్న క్యాంటీన్ లో మరో ఆరుగురికి ఉపాధి కల్పిస్తున్నారు. అన్ని ఖర్చులు పోను ఆత్మగౌరవంతో పని చేస్తున్న మహిళలకు ప్రతి నెల 10 వేల వరకు ఆదాయం లభిస్తుంది.





38వ స్ట్రక్చర్ సమావేశాలు : రాంగోపాల్



నవతెలంగాణ-మణుగూరు

గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీతో శుక్రవారం చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌తో 38వ స్ట్రక్చర్ సమావేశాలు జరిగాయని మణుగూరు ఏరియా బ్రాంచ్ సెక్రటరీ వై.రామ్ గోపాల్ తెలిపారు. పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ ఇవ్వడం వలన కంపెనీకి సంవత్సరానికి రూ.91 కోట్లు ఖర్చు అవుతాయన్నారు. అయినప్పటికీ దీనిపై యాజమాన్యం ఇన్ ప్రిన్సిపుల్ అంగీకరించారు. దీనిపై కమిటీ వేశారు. సొంత ఇంటి పథకం అమలు పరచుటకు అంగీకరించారు. దీనిపై విధివిధానాలు రూపొందించడానికి కమిటీలో నిర్ణయించుతామన్నారు. గత డైరెక్టర్ పా సమావేశంలో అంగీకరించిన ఎన్-1తో పాటు అన్ని అంశాలకు చైర్మెన్ అప్రూవల్ ఇచ్చారు, వీటిని అమలు చేస్తారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తగూడెం శాసనసభ్యులు కునంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కే.సారయ్య, కే.వీరభద్రయ్య, వై.వి.రావు, ముష్కే సమ్మయ్య, మడ్డి ఎల్లయ్య, అక్బర్ ఆలీ, వై.రామ్ గోపాల్ పాల్గొన్నారు.

ఏ సంక్షోభం వచ్చినా మహిళలపైనే ప్రభావం

- మహిళా ఆరోగ్యమే.. కుటుంబ ఆరోగ్యం
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'నవతెలంగాణ'తో

డాక్టర్ యలమంచిలి నాగమణి, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్, యలమంచిలి పాలీ క్లినిక్, ఖమ్మం



నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

మహిళా ఆరోగ్యమే... కుటుంబ ఆరోగ్యమని డాక్టర్ యలమంచిలి నాగమణి అన్నారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత లోపిస్తోందన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవ సందర్భంగా ఆమె 'నవతెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు డాక్టర్ నాగమణి మాటల్లోనే... "సమాన అవకాశాల కల్పనలో మహిళలపై వివక్ష నేటికీ కొనసాగుతోంది. శాస్త్ర సాంకేతికతతో పాటు వివిధ రంగాల అభివృద్ధికి మహిళలు దోహదపడుతున్నారు. అయినప్పటికీ వారు ఎన్నో కష్టనష్టాలకు ఓర్చుతున్నారు. పురుషాధిపత్యం కారణంగా నెట్ బ్యాంకింగ్ వంటి వాటిని ఉపయోగించలేకపోతున్నారు. 73% మంది మహిళలు ఆన్లైన్ వేధింపులకు గురవుతున్నారు. ప్రపంచంలో ఏ సంక్షోభం వచ్చినా దాని ప్రభావం అధికంగా మహిళలపైనే పడుతుంది. కోవిడ్-19 సంక్షోభంతో బాల్య వివాహాలు, మహిళలపై అత్యాచారాలు, బాలికల స్కూల్ డ్రాప్ ఔట్స్ గణనీయంగా పెరిగాయి. సైబర్ నేరాలూ అధికమయ్యాయి. సరైన పోషక ఆహారం అందక మహిళలు ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. దృఢంగా ఉన్న మహిళలనూ ఏదో ఒక ఆరోగ్య సమస్య వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల ఆవశ్యకత పెరిగింది. మనం తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్స్ ప్రాధాన్యత తగ్గించి, ప్రోటీన్ తో కూడిన ఆహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. బ్లాక్ రైస్, రాగులు, సాములు, మినుములు, పప్పు దినుసులు వంటి వాటిని విరివిగా వినియోగించాల్సిన అవసరం ఉంది. గర్భిణీ సంబంధమైనవే కాకుండా రక్తహీనత, థ్రోట్ క్యాన్సర్, గర్భాశయ ఇన్ఫెక్షన్, థైరాయిడ్, బరువు ఎక్కువ, తక్కువ, మూత్ర సంబంధ ఇన్ఫెక్షన్లు, క్యాన్సర్ కు సంబంధించిన వైద్య పరీక్షలు, ప్రతి వారం నిర్వహించాలని ఆశిస్తున్నాను. అభివృద్ధి చెందిన దేశాల్లో 'వెల్ నెస్ క్లినిక్ 'లు ఎప్పటి నుంచో అందుబాటులో ఉన్నాయి. మన దేశంలో బాల్యవివాహాలు, టీనేజీ ప్రెగ్నెన్సీల కారణంగా బరువు తక్కువ, అంగవైకల్యంతో పిల్లలు పుడుతున్నారు. మహిళల ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యంగా భావించి మహిళా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. మహిళ అన్ని రంగాల్లో పురోగమించేలా సమాజం సహకారం అందించాలని ఆశిసున్నా.."

మహిళా పురోగతికి తోడ్పాటు

- డాక్టర్ యలమంచిలి రమాదేవి, గైనకాలజిస్టు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ప్రతి ఏడాది ఓ కొత్త థీమ్ తో మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారు.. ఈ ఏడాది (2025) మహిళల పురోగతికి హెల్ప్ చేసే వ్యూహాలు, వనరులు, చొరవలను గుర్తించి.. వాటిని విస్తృతంగా, వేగంగా అమలు చేయాలనే ఉద్దేశాన్ని చెప్తుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ యలమంచిలి రమాదేవి పేర్కొన్నారు. అన్ని రంగాల్లో లింగ సమానత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం, మహిళలకు సాధికారత కల్పించడంపై ఇది అవగాహన కల్పిస్తుందన్నారు. ఈ ఏడాది (2025) మార్చి 8వ తేదీశనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. సక్సెస్ఫుల్గా, భయం లేకుండా, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ముందుకు వెళ్లాలో మహిళలకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఇప్పటికీ ఇబ్బందులు పడుతున్న మహిళలకు దక్కాల్సిన చట్టాలు, భద్రతా ఏమిటో అవగాహన కల్పిస్తారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తారని, అమ్మాయిలకు చదువు ఎంత ముఖ్యమో చెప్తూ అవగాహన కల్పిస్తూ.. సభలు నిర్వహిస్తారన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, బాలికల హక్కులను రక్షించే లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు. చట్టపరంగా రక్షణ కల్పించడంలో మహిళల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యల గురించి అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేదికలపై చర్చిస్తారన్నారు. అందుకే ఈ స్పెషల్ డేకు ప్రపంచవ్యాప్తంగా విభిన్న దేశాల నుంచి మహిళలకు మద్దతనందిస్తారని చెప్పారు. మహిళా ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యంగా స్వీకరించి.. మహిళలకు పౌష్టికాహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గర్భిణుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చాలామంది స్త్రీలలో రక్తహీనత సమస్యలు ఉంటున్నాయని చెప్పారు.

అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-పాల్వంచ

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు అర్హులు మాత్రమే మంజూరు అవ్వాలని కలెక్టర్ జితేష్ వి.పాటేల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, ధరణి దరఖాస్తులపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పరిశీలనకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో పనిచేసే దరఖాస్తులు పరిశీలన చేపట్టాలన్నారు. ఎల్ వన్, ఎల్ టు, ఎల్ త్రీ



లిస్టులను తయారు చేయాలని ఆదేశించారు. నివేదికలు ఆమోదం పొందిన వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఎల్ వన్‌లో అర్హత లేని వారిని పరిశీలించి తొలగించాలని, తొలగించడానికి గల కారణాలను నమోదు చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లకు అర్హత కలిగి ఉండి ఎల్ వన్ జాబితాలో పేరు రాని అర్హుల పేర్లను కూడా నమోదు చేయాలని సూచించారు. అదేవిధంగా ఎల్ టు, ఎల్ త్రీలో పేర్లు పొందుపరచడానికి గల కారణాలను కూడా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎంపీడీవోలు పూర్తి బాధ్యతగా వ్యవహరించి అర్హత లేని వారికి ఎట్టి పరిస్థితుల్లో జాబితాలో రాకుండా చూడాలని ఆదేశించారు.

ప్రభుత్వం భూముల క్రమబద్ధీకరణకు మార్చి 31 వరకు భూముల క్రమబద్ధీకరణకు కల్పిస్తున్న 25% రాయితీని అందరూ సద్వినియోగపరుచుకునే ఇలా అవగాహన చేపట్టాలని, పెండింగ్ ఎల్లారెస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ధరణిలో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఇన్‌స్పైర్ అవార్డుకి ఎంపికైన సింగరేణి పాఠశాల విద్యార్థి



నవతెలంగాణ-మణుగూరు

గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చే నిర్వహించే సైన్స్ ఇన్‌స్పైర్ మానక్ అవార్డు 2024-25వ సంవత్సరంలో సింగరేణి ఉన్నత పాఠశాల పీవీ కాలనీ మణుగూరు విద్యార్థి ఎస్డి ఇంతియాజ్ ఇంక్ ఫ్రమ్ స్మోక్ అనే అంశానికి గాను సెలెక్ట్ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం వారిచే ఇవ్వబడే రూ.10 వేలు, వివిధ రకాల సైన్స్ ప్రాజెక్ట్స్, వర్కింగ్ మోడల్స్ తయారుచేసి రాబోయే సంవత్సరంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఎస్.రమేష్, ప్రధానోపాధ్యాయురాలు ఈజీ స్వరూప రాణి, గైడ్ చేసిన ఉపాధ్యాయురాలు ఎమ్.మమతని అభినందించారు.

ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం ప్రభుత్వ ధ్యేయం

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-బూర్గంపాడు

ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేప ట్టడమే తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండలం సోంపల్లి గ్రామంలో శుక్రవారం ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల్లో బింగి రమణ, భాగి సుజాత, నుసుకూరి సత్య రాణి, సొంత స్థానాలలో ఇందిరమ్మ ఇంటికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేకు సోంపల్లి గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి బట్టా విజయ్ గాంధీ, సొసైటీ చైర్మెన్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, టీపీసీసీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్ కుమార్, మోరంపల్లి బంజర మా జీ ఉపసర్పంచ్ కైపు లక్ష్మీనారాయణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు భజన ప్రసాద్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి

- ఛత్తీస్‌గఢ్ క్రీడాకారులు రావడం అభినందనీయం
- వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశంలో ఎస్పీ



నవతెలంగాణ-చర్ల

ప్రతి ఒక్క వ్యక్తి తన నిజ జీవితంలో క్రీడల పట్ల మక్కువను పెంచుకొని సమాజంలో క్రమశిక్షణతో మెలగాలని ఎస్పీ రోహిత్ రాజ్ సూచించారు. శుక్రవారం చర్ల పోలీస్ స్టేషన్ ఆవరణలో గత మూడు రోజులుగా చర్ల పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్క క్రీడాకారుడు ఆటను హ్యాపీగా తీసుకొని క్రమశిక్షణ, నిబద్ధతతో ఆడాలని ఆయన కోరారు. యువత చెడు వ్యసనాల వైపు ఆకర్షితులు కాకుండా క్రీడల పట్ల శ్రద్ధ చూపుతూ తమ తమ జీవితాలను సుఖమయం చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రతిసారి లాగానే ఈ ఏడాది కూడా జరిగిన ఈ వాలీబాల్ టోర్నమెంట్లో సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ నుండి ఏడు టీములు పాల్గొనడం, అందులో అత్యంత అటవీ ప్రాంతమైన పెద్దుట్లపల్లికి చెందిన జట్టు ఫైనల్ వరకు చేరుకోవడం చాలా అర్హనీయమని ఎస్పీ అన్నారు. ప్రతి వ్యక్తిలో ఏదో ఒక క్రీడా నైపుణ్యం ఉంటుంది. ఆయా క్రీడల పై శ్రద్ధ చూపుతూ ఆటలు ఆడడం వలన ఉల్లాసంతో పాటు మానసిక శ్రమ లేకుండా ఫ్రీగా ఉండొచ్చని చర్ల సీఐ రాజు వర్మ అన్నారు. ప్రతి ఒక్క కీరకారుడు క్రీడా స్ఫూర్తిని కలిగి గెలుపు వాటములను సమపాలంలో స్వీకరిస్తూ క్రమశిక్షణతో ఆట ఆడినప్పుడే ఉత్తమ క్రీడాకారులు అవుతారని ఆయన సూచించారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా ఆట ఆడినప్పుడే క్రీడాకారులు మంచి విజయాలను సాధిస్తారని సీఐ తెలిపారు. అనంతరం మూడు రోజులు పగలతో పాటు రాత్రి హెడ్లైట్లతో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్లో విన్నెర్స్‌గా చీమలపాడు, రన్నర్స్‌గా సుందరయ్య కాలనీ నిలిచింది. గెలుపొందిన చీమలపాడుకు మొదటి ప్రైజ్‌గా రూ.15000 సీల్డ్, సుందరయ్య కాలనీకి ద్వితీయ బహుమతిగా రూ.10000 సీల్డ్, ఛత్తీస్గడ్‌కు చెందిన పెద్ద ఉట్లపల్లి తృతీయ బహుమతి రూ.8000, సీల్డ్, నాలుగవ బహుమతికి మామిడిగూడెం రూ.5000, సీల్డ్, ప్రోత్సాహక బహుమతి కందిపాడుకు రూ.వెయ్యి, వీటితోపాటు ఉత్తమ ఆటగాళ్లకు సీల్డ్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పిఎఫ్ సెకండ్ హ్యాండ్ కమాండెంట్ రాజీవ్ కుమార్, చర్ల ఎస్ఐలు నర్సిరెడ్డి, కేశవ్‌లు సిబ్బంది, పెద్ద ఎత్తున క్రీడాకారులు ప్రజలు, పీఈటీలు పాల్గొన్నారు.



బడ్జెట్‌లో యువజనరంగానికి అధిక నిధులు కేటాయించాలి

- యూత్ డిక్లరేషన్‌ను అమలు చేయాలి : డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే 2025-26 వార్షిక బడ్జెట్‌లో యువజన రంగానికి అధిక నిధులను కేటాయించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. కాంగ్రెస్ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయాలని కోరింది. శుక్రవారం హైదరాబాద్‌లో డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ హామీనిచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిరుద్యోగ భృతి గురించి ఊసెత్తడం లేదని విమర్శించారు. రాబోయే వార్షిక బడ్జెట్‌లో నిరుద్యోగ భృతిని అమలు చేసేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కోరారు. యూత్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. యువతకు స్వయం ఉపాధి రుణాలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియమాక నోటిఫికేషన్లు, పరీక్షల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ఫిబ్రవరిలో జాబ్ క్యాలండర్‌ను ప్రకటించినా ఇప్పటి వరకు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. లక్షలాదిమంది నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ నియామకాలను చేపట్టాలని తెలిపారు. ఉద్యోగాలు ఇచ్చేంతవరకు నిరుద్యోగ భృతి రూ.నాలుగు వేలు ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన తప్పులను చేయకుండా నిరుద్యోగ యువతకు నమ్మకం కలిగించేలా పారదర్శకంగా ఉద్యోగాల నియమకాలను చేపట్టాలని కోరారు. యూత్ డిక్లరేషన్ హామీలన్నింటిని ప్రభుత్వం అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి తిరుపతి, గడ్డం వెంకటేష్, జావెద్, శివవర్మ, క్రిష్ణనాయక్, జి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పునర్విభజన ప్రక్రియపై సమైక్య పోరు

(మొదటిపేజీ తరువాయి)

బలహీనపడుతుందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం పలువురు ముఖ్యమంత్రులకు, మాజీ ముఖ్యమంత్రులకు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న ఈ పునర్విభజన ప్రణాళికలు సమాఖ్యవాదంపై దాడి అని ఆయన అభివర్ణించారు. భారతదేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి అంతా దాని సమాఖ్య స్వభావంపైనే ఆధారపడి వుంది. ఈ వ్యవస్థలో ఒక దేశంగా వుండాల్సిన మన పవిత్ర ఐక్యతా భావనను గౌరవిస్తూనే ప్రతి ఒక్క రాష్ట్రానికి తన వాణిని వినిపించే హక్కు వుందని స్టాలిన్ తన లేఖలో పేర్కొన్నారు. కానీ ఈనాడు ఈ సమతుల్యతకు తీవ్రమైన ముప్పు ఏర్పడుతోందని, మన దేశ భవిష్యత్తును రూపుదిద్దడంలో తమిళనాడు వంటి రాష్ట్రాల ప్రాబల్యం శాశ్వతంగా తగ్గిపోవడానికి ఇది దారి తీస్తోందని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి అన్ని పార్టీలు కూడా తమిళనాడు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గిపోయే పరిస్థితులపై అఖిల పక్షంలో ఆందోళన వ్యక్తం చేస్తూ కేంద్రానికి తీర్మానం పంపిన నేపథ్యంలో స్టాలిన్ లేఖ వెలువడింది. తమిళనాడుకు సీట్ల సంఖ్య తగ్గిపోతుంటే, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు వారిజనాభా దామాషాను బట్టి ప్రాతినిధ్యం పెరుగుతందని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజన జరుగుతుందా లేదా అనేది ఇప్పుడు ప్రశ్న కాదని, కానీ మన జాతీయ ప్రాధాన్యతలను ముందుకు తీసుకెళ్ళిన రాష్ట్రాలు అందించిన సేవలను ఎప్పు గుర్తిస్తారనేది ఇక్కడ ప్రశ్న అని స్టాలిన్ పేర్కొన్నారు. పునర్విభజనకు తాము వ్యతిరేకం కాదని, కానీ జాతీయ కర్తవ్యాలను విజయవంతంగా నిర్వర్తించిన రాష్ట్రాలపై ఒక ఆయుధంగా ఉపయోగించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. సమస్య తీవ్రంగా వున్నప్పటికీ దాన్ని పట్టించుకోకుండా కేంద్రం స్పష్టతను ఇవ్వడంలో విఫలమవుతోందని విమర్శించారు. ప్రొ రేటా ప్రాతిపదికను అనుసరిస్తామని చాలా అస్పష్టంగా చెబుతున్నారని ఆ ప్రొ రేటాను లెక్కించడానికి ఉపయోగించే ప్రాతిపదిక ఏమిటనేది వివరించడం లేదని విమర్శించారు. మన ప్రజాస్వామ్యమే ముప్పులో పడుతున్నపుడు ఇటువంటిఅస్పష్టమైన హామీలను మనం ఆమోదించగలమా అని ఆయన ఆ లేఖలో ప్రశ్నించారు. కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, పశ్చిమ బెంగాల్, ఒడిశా, పంజాబ్ సీఎంలకు ఆయన లేఖ రాశారు. ప్రతిఘటనా పోరాటాన్ని సమన్వయం చేసేందుకు సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేయడంలో చేతులు కలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సవాలు యొక్క రాజ్యాంగ, చట్టబద్ధమైన, రాజకీయ పార్శ్వాలను మనందరం కలిసికట్టుగా పరిశీలించాల్సి వుందన్నారు. అప్పుడు మాత్రమే మన ప్రస్తుత ప్రాతినిధ్య స్థాయిపై రాజీపడకుండా జాతి నిర్మాణంలో మన పాత్రను గౌరవించేలా పునర్విభజన ప్రక్రియను సాధించుకోగలమని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ సారైనా న్యాయం జరిగేనా?

బడ్జెట్‌లో వాటా కోసం రజక వృత్తిదారుల ఎదురు చూపులు

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రిక్తహస్తం
కేటాయింపులు రూ.451 కోట్లు, ఖర్చు రూ.31 కోట్లు
రాబోయే బడ్జెట్‌పై గంపెడాశలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రజక వృత్తిదారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వమైనా బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తుందా? లేదంటే గత బీఆర్ఎస్ సర్కార్ మాదిరిగానే మాటలు ఘనంగా చెప్పి, అరకొర నిధులు కేటాయించి, వాటిని కూడా ఖర్చు చేయకుండా దారిమళ్లిస్తుందా? అనేది ఇప్పుడు చర్చనీయాంశమవుతున్నది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రేవంత్ సర్కార్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్న నేపథ్యంలో ఈసారైనా తమకు న్యాయమైన వాటా దక్కుతుందా? లేదా? అనే ఆందోళన రజక వృత్తిదారుల్లో వ్యక్తమవుతోంది.

రజకుల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాటలు ఘనం..చేతలు శూన్యమన్నట్టుగా వ్యవహరించింది. వారి సంక్షేమం, అభివృద్ధికి బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసింది. పైగా కేటాయించిన అరకొరా నిధులను సైతం ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయకుండా వివక్ష చూపింది. 2014 నుంచి 2024 వరకు తెలంగాణ రజక సహకార సంఘాల సమాఖ్యకు రూ.451.04 కోట్లు కేటాయించింది. ఇందులో రూ. 71.52 కోట్లునే విడుదల చేసింది. అందులో రూ. 31.21 కోట్లు మాత్రమే ఖర్చు చేయటం గమనార్హం. దోబీఘాట్ల విషయంలోనూ అదే జరిగింది. కమ్యూనిటీ సేవలు-దోబీఘాట్ల నిర్మాణానికి రూ.180.30 కోట్లు కేటాయించిన బీఆర్ఎస్ సర్కార్ రూ. 30.98 కోట్లు విడుదల చేసి, కేవలం రూ.14.85 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది.

లాండ్రీలు, దోబీఘాట్లకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా పథకం కింద 2021-22 నుంచి 2023-24 వరకు రూ.210.50 కోట్లు కేటాయించి రూ.75.80 కోట్లను విడుదల చేసింది. రూ.75.86 కోట్లు ఖర్చు చేసింది.

కాంగ్రెస్ సర్కార్ సైతం...

బీఆర్ఎస్ సర్కారు రజకులకు ఆ రకంగా అన్యాయం చేస్తే... ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే బాటలో నడుస్తున్నట్టు కనబడుతోంది. 2024-25 వార్షిక బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమ రుణాల కోసం కేవలం రూ.30 కోట్లు మాత్రమే కేటాయించటం గమనార్హం. రాష్ట్రంలో 3,400కు పైగా రజక వృత్తిదారుల సొసైటీలున్నాయి. వీటి నిర్వహణకు కనీసం రూ.వెయ్యి కోట్లయినా అవసరమవుతాయి. ప్రభుత్వం ఆ దిశగా కేటాయింపులు చేయలేదని వృత్తిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రజక సహకార సంఘాల సమాఖ్యకు 2014-15 నుంచి 2023-24 వరకు కేటాయింపులు, విడుదలైన నిధులు, ఖర్చు వివరాలు (రూ.కోట్లలో)

సంవత్సరం	కేటాయింపు-	విడుదల	ఖర్చు
2014 -15	16.54	0	0
2015-16	16.43	0	0
2016-17	18.07	4.52	4.50
2017-18	200	15.00	1.27
2018-19	200	52	25.44
2019-20	0	0	0
2020-21	0	0	0
2021-22	0	0	0
2022-23	0	0	0
2023-24	0	0.01	0
మొత్తం	451.04	71.52	31.21

జీపీలకు కనీస వేతనాలివ్వాలి

మల్టీపర్పస్ పని విధానం రద్దు చేయాలి
రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికుల ధర్నాలు



నవతెలంగాణ- విలేకరులు

మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గ్యార పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ బాల శంకర్, ఎంపీఓ ఉమారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని కోరారు. మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి, జీవో నంబర్ 51ని సవరించాలన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26000 నిర్ణయించి, 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ డ్రాఫ్ట్ కనీస వేతనాల జీవోను తక్షణమే సవరించాలని సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి డిమాండ్ చేశారు. జిల్లా లేబర్ కమిషనర్ సూపరింటెండెంట్ రఘువీర్‌కు వినతిపత్రం ఇచ్చారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు బి.ఆంజనేయులు అన్నారు. గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సీనియర్ అసిస్టెంట్‌కి వినతిపత్రం అందజేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ కార్మికులకు గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కోటేశ్వర్‌కి వినతిపత్రాన్ని అందజేశారు.పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓలకు అందజేశారు. మెదక్ జిల్లాలో మాసాయిపేట మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికులు అర్ధాకలితో అలమటిస్తూ పూట గడవక పస్తులు ఉంటున్నామంటూ బిక్షాటన చేసి నిరసన తెలిపారు. మాకు బిక్షం వేయాలంటూ కటౌట్లను మెడలో వేసుకొని వాడవాడలా తిరుగుతూ బిక్షాటన చేశారు. మెదక్ జిల్లాలో మనోహరాబాద్, సిద్దిపేట జిల్లాలో సిద్దిపేట, నారాయణరావుపేట, తోగుట, నంగునూర్ తదితర మండలాల్లో, సంగారెడ్డి జిల్లాలో సదాశివపేట, వట్‌పల్లి మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు.



ఉత్తమ్‌తో కరీంనగర్ ప్రజాప్రతినిధుల భేటీ

జిల్లా అభివృద్ధిపై సమీక్ష
ప్రణాళికబద్ధంగా ముందుకెళతాం : మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించి ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆ జిల్లాకు సంబంధించి ప్రజాప్రతినిధులు భేటీ అయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ అంశాలను మంత్రితో చర్చించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, విద్యా వైద్యం, మౌళిక సమస్యలు పరిష్కారం చేసుకుంటూ ముందుకు పోవాలని నిర్ణయం తీసుకోవడం తీసుకున్నట్టు సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ పొన్నం ప్రభాకర్ చెప్పారు. జిల్లా మంత్రులుగా నాతోపాటు శ్రీధర్‌బాబు , శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు కలిసి త్వరలోనే ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రిని కలిసి వారి దృష్టికి తీసుకుపోతామని వివరించారు. గతంలో తెలంగాణ నినాదానికి పరిమితమైన కరీంనగర్ గత పదేండ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వం మాటలకే పరిమితమైన పరిస్థితి ఉందన్నారు. అధికారంలో ఉన్న పార్టీ సభ్యులంగా జిల్లా అభివద్ధిని ముందుకు తీసుకుపోతున్నామని వ్యాఖ్యానించారు.

ఉద్యోగుల సేవలు మరువ లేనివి

సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పథకాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగుల సేవలు మరువలేనివని సీసీఎల్ఏ కార్యదర్శి నవీన్ మిట్టల్ అన్నారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసినందుకు ఆయనతో పాటు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డిని శుక్రవారం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మిట్టల్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఉద్యోగులు వారధిగా పని చేయాలని ఆకాంక్షించారు. మెరుగైన సేవలు అందిస్తూ నిబద్ధతతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలో 10,954 జీపీఓలు, కొత్త డివిజన్లు, మండలాలకు 361 పోస్టులు, 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల భర్తీ వల్ల రెవెన్యూ విభాగం మరింత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి విశేషంగా కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులకు ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్(టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, సెక్రటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, మహిళా అధ్యక్షురాలు రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సీసీఎల్ఏలో మహిళా దినోత్స వేడుకలను రెవెన్యూ ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, సీసీఎల్ఏ నవీన్‌మిట్టల్, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలి

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్
నిర్మల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక.. కార్పొరేట్ అనుకూల విధానాలపై సంయుక్త కిసాన్ మోర్చా పోరాటం కొనసాగిస్తుందని నాయకులు నంది రామయ్య, దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతాంగం నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగం మొత్తాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు పన్నుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు చట్టాల రద్దును దొంగ దారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకురావడం చూస్తుంటే మోడీ ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తున్నదో తెలుస్తోందన్నారు. రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధరలు లభించక అప్పుల పాలై అనేకమంది ఆత్మహత్య చేసుకుంటున్నారని, మద్దతు ధరల చట్టం చేయమని అడుగుతుంటే వీటి గురించి పట్టించుకోని మోడీ కార్పొరేట్ల కోసం మాత్రం వేగంగా వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధరల చట్టం చేసే వరకు రైతాంగం సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు జె.రాజు, కె.రాజన్న, డాకూర్ తిరుపతి, నాగెల్లి నర్సయ్య, భూక్యా విలాస్, గంగారాం, గోరేభాయ్, సుందర్, దేవ్‌రావు, మోహన్, రాజేష్, గంగాధర్ పాల్గొన్నారు.

అది క్యాబినెట్ కాదు..కుస్తీల పోటీ

పొంగులేటి కబ్జాల మంత్రి..భట్టి కమీషన్ల మంత్రి..ఉత్తమ్ ప్యాకేజీల మంత్రి
సీఎం సీటుపై ఉత్తమ్ కన్ను : బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'నిన్న జరిగింది క్యాబినెట్ కాదు. అది కుస్తీల పోటీ. ఆరు గంటల పాటు జరిగిన క్యాబినెట్‌లో మంత్రులు ఒకరికొకరు కుస్తీలు పట్టుకోవడానికే సరిపోయింది. అది కలహాల క్యాబినెట్. నారాయణపేట్, కొడంగల్ ప్రాజెక్టులపై సీఎం ప్రతిపాదనలు పెడితే మంత్రులందరూ వ్యతిరేకించారని సమాచారం. క్యాబినెట్‌లో పంపకాల పంచాయతీలపైనే జరిగింది. పొంగులేటికి సంబంధించిన రాఘవ కంపెనీ విషయంలో మంత్రుల మధ్య కుస్తీలాట జరిగింది. మంత్రుల స్వార్థం కోసం, మంత్రుల పంపకాల కోసం క్యాబినెట్ పెట్టినట్టు ఉంది. మంత్రులు సమావేశంలోనే రచ్చరచ్చ చేయడం ఎప్పుడూ చూడలేదు.' అని బీజేపీ ఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కమీషన్ల మంత్రిగా భట్టి విక్రమార్క మారారనీ, ప్రతిబిల్లులోనూ కాంట్రాక్టర్లు పర్సంటేజీ ఇస్తేనే నిధులు రిలీజ్ చేస్తున్నారని ఆరోపించారు. కమీషన్ ఇస్తే నేల రోజుల్లోనే బిల్లు విడుదలవుతున్నదనీ, ఇవ్వకపోతే ఏడాదైనా గడపదాటడం లేదని విమర్శించారు. పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంత్రి అనాలా? కాంట్రాక్టర్ అనాలా? అనేది అర్థం కావడం లేదన్నారు. పొంగులేటికి 50 శాతం కమీషన్ ఇస్తే ఏ లిటికేషన్ భూమినైన క్లియర్ చేస్తున్నారని ఆరోపించారు. ఉద్దండపూర్ ప్రాజెక్టులో పొంగులేటి శ్రీనివాసరెడ్డి కంపెనీ రాఘవ కన్స్ట్రక్షన్‌కి కాస్ట్ ఎస్కలేషన్ చేసారనీ, పొంగులేటి మంత్రిగా ఉండి ప్రాజెక్ట్ రివైజ్ ఎస్టిమేట్ చేసుకుంటారా?అని ప్రశ్నించారు. క్యాబినెట్ మంత్రులు స్వార్థం కోసమా? ప్రజల సంక్షేమం కోసమా? అని నిలదీశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్యాకేజీల మంత్రిగా మారారనీ, ఇరిగేషన్‌లో ప్యాకేజీ లేనిదే పని కావడం లేదని ఆరోపించారు. ఆయన కన్ను సీఎం సీటుపై పడిందని చెప్పారు. కేవలం దక్షిణ తెలంగాణ ప్రాజెక్టులపై దృష్టి పెడుతూ ఉత్తర తెలంగాణ ప్రాజెక్టులను విస్మరించడం న్యాయమా? అని ప్రశ్నించారు. ఉత్తమ్, పొంగులేటి, రేవంత్ రెడ్డి మధ్య గ్యాప్ స్పష్టంగా కనిపిస్తోందని బాంబు పేల్చారు. మంత్రుల చేతుల్లో రాష్ట్రం దోపిడీకి గురవుతున్నదనీ, తన దగ్గర అన్ని ఆధారాలున్నాయని చెప్పారు.

దక్షిణాదిపై బీజేపీ ప్రతీకారం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అహ్మదాబాద్‌లో ఐటీ ఏం ఉంది" అని ప్రశ్నించారు.

"హైదరాబాద్ ఇప్పుడు ప్రారంభమైంది కాదు. కులీ కుతుబ్ షాహీ నుంచి ప్రారంభమైంది. కులీ కుతుబ్ షా తరువాత నిజాం సర్కార్, తరువాత బ్రిటిష్ ప్రభుత్వం, స్వాతంత్ర్యం తరువాత మర్రి చెన్నారెడ్డి, చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి.. అలా ఆ తరువాత ఇప్పుడు నేను ఉన్నా. 450 ఏండ్లకుపైగా చరిత్ర తెలంగాణ, హైదరాబాద్‌కు ఉంది. చార్మినార్, గోల్కొండ కోట చంద్రబాబు కట్టారా? సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు కట్టారా..? హైదరాబాద్‌లో ప్రముఖ కట్టడాలన్నీ 450 ఏండ్ల నుంచే ప్రారంభమయ్యాయి. ప్రభుత్వాలు మారినా ముఖ్యమంత్రులు మారినా అభివృద్ధి కొనసాగింది. మీరు హైదరాబాద్ రండి.. ప్రపంచంలోనే అత్యుత్తమమైన గాజులు, ముత్యాలు చార్మినార్ వద్ద దొరుకుతాయి. ఇప్పుడు డాలర్ల మార్పిడి చేస్తున్నాం. 400 ఏండ్ల క్రితమే అక్కడ నగదు మార్పిడి ఉంది. ప్రపంచంలోని ఎక్కడి నగదు (నోట్) తీసుకువచ్చినా అక్కడ మార్చుకోవచ్చు" అని అన్నారు. "మోడీ గిఫ్ట్ సిటీని తీసుకెళ్లారు. గిఫ్ట్ సిటీలో పెట్టుబడులు పెట్టేవారికి ఎన్నో ప్రత్యేక అవకాశాలు, రాయితీలు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించి గిఫ్ట్ సిటీలో ప్రయోజనాలు కల్పిస్తున్నారు. హైదరాబాద్‌కు ఎందుకు ఇవ్వరు? గిఫ్ట్ సిటీలో యూనివర్సిటీ, పరిశ్రమ ఏ పెట్టుబడి వచ్చినా లాభాలు ఆయా దేశాలకు తీసుకెళ్లే అవకాశం ఇచ్చారు. ఆ లాభాలు ఇతర రాష్ట్రాలకు ఎందుకు పంచరు? హైదరాబాద్‌కు ఆ అవకాశం ఎందుకు ఇవ్వరు? అని ప్రశ్నించారు.

వ్యక్తిగతంగా మోడీతో విబేధాల్లేవ్.. విధానపరంగానే...

"మోడీతో నాకు వ్యక్తిగతంగా ఎటువంటి విభేదాలు లేవని, నేను మోడీ విధానాలతో విభేదిస్తున్నాను. మోడీ దేశానికి ప్రధానమంత్రి ఆయనకు గౌరవం ఇవ్వాలి. ఆయనను కలిసి మా రాష్ట్రానికి కావాల్సినవి అడగడం నా హక్కు, బాధ్యత. ప్రజలు నాపై నమ్మకం ఉంచి ఎన్నికల్లో గెలిపించి ముఖ్యమంత్రిని చేశారు" అని అన్నారు.

తెలంగాణ అప్పులు రూ. ఏడులక్షల కోట్లు

"తెలంగాణ అప్పులు రూ. 3.50 లక్షల కోట్లు కాదు. రూ.7 లక్షల కోట్లు. 2014లో మేం తెలంగాణ ఏర్పాటు



చేసినప్పుడు రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.69 వేల కోట్లు. కేసీఆర్ పదేండ్ల కాలంలోనే రూ.6 లక్షల కోట్లకుపైగా అప్పులు చేసి వెళ్లారు. మా రాష్ట్రానికి ఇప్పుడు నెలకు ఉన్న ఆదాయం రూ.18,500 కోట్లు. జీతాలు,పింఛన్లకు నెలకు రూ.6,500 కోట్లు, ఈ అప్పులకు వడ్డీలకు రూ.6,500 కోట్లు నెలకు మేం కట్టాలి. మేం తిన్నా తినకపోయినా.. టీ తాగినా, తాగకపోయినా ప్రతి నెల పదో తేదీ లోపు రూ.13 వేల కోట్ల చొప్పున కట్టాలి. మిగిలిన రూ.5,500 కోట్లతో మేం అభివృద్ధి, సంక్షేమం చేపట్టాలి" అని అన్నారు.

"నేను అప్పులకు తిరిగి చెల్లించే గ్యారంటీల గురించి చెబుతున్నా. నేను గ్యారంటీలు చేయమని చెప్పడం లేదు. మా పరుగు సాగుతోంది. మా పరుగును సాగనివ్వండి. మోడీ ఢిల్లీలో అనేక గ్యారంటీలు ఇచ్చారు. ఎవరూ మోడీని ప్రశ్నించడం లేదు. మోడీ గ్యారంటీలకు వ్యతిరేకమైతే ఢిల్లీలో ఎందుకు గ్యారంటీలు ఇచ్చారు? మేం 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల రుణాలను మూడు నెలల్లోపు మాఫీ చేశాం. దేశంలో తొలిసారి నేను ఇంత రుణమాఫీ చేశా. ఇప్పటి వరకు ఎవరూ చేయలేదు" అని అన్నారు.

"ఒకే దేశం - ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై చర్చ జరగాలి

"ఒకే దేశం - ఒకే ఎన్నిక, నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై చర్చ జరగాలి. మూల ధన వ్యయంపై (క్యాపిటల్ ఎక్స్పెండేచర్) చర్చ జరగాలి. నేను నెలకు రూ.500 కోట్లు కూడా క్యాపిటల్ ఎక్స్పెండేచర్‌పై పెట్టలేకపోతున్నా. రానున్న రోజుల్లో రాష్ట్రం, దేశం ఏం కావాలి" అని అన్నారు. "ఏం చేసినా బీజేపీకి దక్షిణాదిలో ఏం రావడం లేదు. దక్షిణాదిపై ప్రతీకారం తీర్చుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఇందుకు నియోజకవర్గాల పునర్విభజన అనే ఆయుధాన్ని బీజేపీ ఎంచుకుంది. దక్షిణాది ప్రాతినిధ్యాన్నితగ్గించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది" అని అన్నారు. "ఈ దేశంలో ప్రతి రాష్ట్రానికి కొన్ని హక్కులున్నాయి. ఇది రాష్ట్రాల సమాఖ్య. దక్షిణాదిలో బీజేపీకి అధికారం లేదు. ప్రాతినిధ్యం లేదు. కొత్త కొత్త మార్గాల ద్వారా దక్షిణాదిని శిక్షించే పనులు చేయకూడదు. దక్షిణాది రాష్ట్రాలే కాదు పంజాబ్ నుంచి మనీశ్ తివారి ఏం చెబుతున్నారు. ఉత్తరాది రాష్ట్రాలకూ నష్టమే. బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలే ఎక్కువగా లబ్ధిపొందుతున్నాయని చెబుతున్నారు. అందుకే దక్షిణాది రాష్ట్రాలే కాదు, ఉత్తరాది రాష్ట్రాలు కూడా కలిసి రావాలి" అని తెలిపారు.

మోడీ సర్కారులో మైనార్టీలు ఎంతమంది ఉన్నారు..?

"మోడీ ప్రభుత్వంలో ఎంత మంది మైనారిటీలు ఉన్నారో మీరు చెప్పండి. స్వాతంత్ర్య ఉద్యమంలో మైనారిటీలు పాల్గొనలేదా? అమరులు కాలేదా? ప్రధానమంత్రి ఎందుకు ఇవ్వలేదో అడగండి? ప్రధానమంత్రి ఏ ఒక్క మతానికీ అన్యాయం చేయకూడదు కదా..?" అని పేర్కొన్నారు. "ప్రతి మత విశ్వాసాన్ని మేం గౌరవిస్తున్నాం. మనం దసరా, నవరాత్రి జరుపుకోవడం లేదా? తిరుపతి వెళ్లే వారికి రాయితీలు ఇస్తున్నాం. ఈ దేశంలో ఉన్న ప్రతి మతంలోని వ్యక్తి విశ్వాసాలను మనం గౌరవించాలి. హిందూ, ముస్లిం, క్రైస్తవం ఎవరిదైనా...? 200 ఏళ్లకుపైగా పాలించిన బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత ఆంగ్లో ఇండియన్లకు పార్లమెంట్, అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఇచ్చాం" అని తెలిపారు.

బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ

"మాకు అనుబంధ సంస్థలుగా యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, విద్యార్థి కాంగ్రెస్ ఉన్నాయి. బీజేపీకి అనుబంధ సంస్థలుగా ఈడీ, సీబీఐ, ఐటీ ఉన్నాయి. వారు నైస్ ఆర్ ఐస్‌తో పోరాడుతున్నారు. నైస్ అంటే నార్కొటిక్స్, ఇన్‌కంటాక్స్ బ్యూరో, సీబీఐ, ఐడీ... ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారికి బీజేపీవారి నుంచి నైస్ కావాలా. ఐస్ కావాలా అని ఫోన్ వస్తుంది. నైస్ వస్తే జైలుకు పోతారు. ఐస్ వస్తే బీజేపీ టిక్కెట్ వస్తుంది" అని ఎద్దేవా చేశారు.

భద్రాచలానికి రమ్మంటే...

"నేను భద్రాచలం రావాలని మోడీ, అమిత్ షాను ఆహ్వానించినా రాలేదు. భద్రాచలం పరమ పవిత్ర క్షేత్రమని నేను నమ్ముతా. అయినా మోడీ, అమిత్ రావడం లేదు" అని అన్నారు. "ఒలింపిక్స్ గేమ్స్ నిర్వహణకు హైదరాబాద్‌కు అవకాశం ఇవ్వాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రపంచ సుందరి పోటీలు మేలో హైదరాబాద్‌లో జరగబోతున్నాయి. ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నప్పుడు ఒలింపిక్స్ ఎందుకు జరగకూడదు" అని ప్రశ్నించారు.

75 ఏండ్లైనా ఏ కులం ఎంతో లెక్కతేలలేదు..

75 ఏండ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఏ కులం లెక్క ఎంతో తెలియకపోతే ఎలా? జనాభా లెక్కల్లో ఎస్సీ, ఎస్టీ లెక్కలు చేస్తున్నప్పుడు బీసీ లెక్కలు ఎందుకు చేయకూడదు. మేం అందుకే జన గణనలో కుల గణన చేపట్టాలని శాసనసభలో తీర్మానం పెట్టాం" అని అన్నారు. "రిజర్వేషన్లు ఎందుకు ఆపాలి.

మేం అందుకే రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలనుకుంటున్నాం. బీసీలకు బీజేపీ అన్యాయం చేసిందనేది మేం చెబుతున్నాం. ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చింది. ఇప్పుడు ఓబీసీలకు ఇవ్వాలనుకుంటున్నాం. ఎలాగైనా మేం రిజర్వేషన్లు ఇస్తాం. మండల్ కమిషన్ 29 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది. మేం వాటిని ఇంకా పెంచాలనుకుంటున్నాం" అని అన్నారు.

నవతెలంగాణ మానవి
ఖమ్మం
శనివారం
8 మార్చి 2025



సముచిత స్థానం కల్పించాలి

మహిళకు స్వేచ్ఛ కావాలనే ఉద్దేశంతో మహిళ దినోత్సవం ఏర్పడింది. మహిళ ఇంటి బాధ్యతలతో సమానంగా వృత్తిలో కూడా అదే స్థాయిలో కృషి చేస్తుంది. అన్ని విధాలుగా సమాజంలో భాగం అవుతుంది. నేటి అమ్మాయిలే రేపటి మహిళలు కాబట్టి రేపటి తరాన్ని చైతన్య వంతం చేయాలి. ఆ ఉద్దేశంతోనే మా బాలోత్సవ్ కమిటీ ఈసారి మహిళా దినోత్సవానికి షీరోస్ అనే కార్యక్రమాలు నిర్వహించబోతుంది. పుస్తకంలోని కొంత మంది జీవితాలను తీసుకొని వాటి పాత్రలను చూపించబోతున్నాం. మహిళలకు సమాజం సముచిత స్థానం కల్పించాలి, అనేక రంగాలలో ముందుకు దూసుకుపోతున్న మహిళలను గౌరవించుకోవాలనేదే మా ఉద్దేశం.

- ఇందిరా పరాశరం, బాలోత్సవ్ కల్చరల్ కమిటీ కోఆర్డినేటర్

స్ఫూర్తి నింపే షీరోస్



గత ఏడాది డిసెంబర్‌లో షీరోస్ పుస్తకం తెలుగులోకి తీసుకొచ్చారు. ఏబీసీడీ అనే సంస్థ దీన్ని తీసుకొచ్చింది. షీరోస్ అంటే ధీర వనితలు. పాత తరం నుండి నేటి వరకు ఎన్నో విజయాలు సాధించిన మహిళల గురించి ఇందులో ఉంది. స్ఫూర్తిదాయక జీవితాలు వీరివి. అందుకే వీటిని నేటి తరానికి కండ్లకు కట్టినట్టు చూపించాలనే ఉద్దేశంతో ఉమెన్స్‌డే రోజు బాలోత్సవ్ ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. స్కూల్ టీచర్లు, నాట్య గురువులు ఇందులోని పాత్రలు చేయబోతున్నారు. సాధారణ మహిళలు కూడా కొందరు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

స్ఫూర్తిని కొనసాగించాలి

సమాజంలో చాలామంది మార్చి 8 అంటే పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఏదో ఆ ఒక్కరోజు జరిపి చేతులు దులుపుకుంటున్నారు. మహిళకు గిఫ్టులు ఇచ్చి, సన్మానాలు చేసి గొప్పగా ఏదో చేసేశాము అనుకుంటున్నారు. కానీ మహిళ సమస్యలు పరిష్కరించడంలో, వివక్షను రూపుమాపడంలో మాత్రం వెనకబడి పోతున్నారు. నిజమైన మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగించడానికి ఎలాంటి ప్రణాళికలు రూపొందించడం లేదు. ముఖ్యంగా మన దేశ పాలకులు మహిళా సమానత్వం కోసం కృషి చేయాల్సింది పోయి తిరిగి మహిళలను నాలుగ్గోడలకు పరిమితం చేయాలని చూస్తున్నారు. మహిళలపై రోజురోజుకు దాడులు పెరిగిపోతున్నాయి. ఎన్ని చట్టాలు వచ్చినా ప్రయోజనం ఉండడం లేదు. అలాగే 33 శాతం రిజర్వేషన్ అని 25 ఏండ్ల నుండి చర్చ జరుగుతూనే ఉంది. కానీ అది ఆచరణ సాధ్యం కాలేదు. పాలకులు గానీ, ప్రజల్లో గానీ దీనిపై ఎలాంటి అవగాహన లేదు. మహిళలకు ఇవ్వాల్సినంత ప్రాధాన్యం ఈ సమాజం ఇవ్వడం లేదు. అందుకే మహిళల్లో చైతన్యం నింపేందుకు బాలోత్సవ్ షీరోస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

మగవారు అత్యంత ధైర్య సాహసాలు చూపిస్తే 'అబ్బా వాడురా అసలైన హీరో అంటే' అంటారు. మరి మహిళలు అదే ధైర్యాన్ని చూపిస్తే... ఎంతో కాలం నుండి ఇదో పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. దీనికి సమాధానంగానే గత ఏడాది 'షీరోస్' పేరుతో 256 మంది ధీర వనితల స్ఫూర్తిదాయక జీవితాలను మన ముందుకు తీసుకొచ్చింది ఎనిమిదో తరగతి చదువుతున్న అహల. ఇంగ్లీష్‌లో ఉన్న ఈ పుస్తకాన్ని అనువదించి తెలుగు పాఠకులకు అందించారు వంగపల్లి పద్మ. ఈరోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సదర్భంగా షీరోస్‌లోని కొన్ని పాత్రలను బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో నేటి తరానికి చూపించబోతున్నారు.



మహిళలంటే చిన్న చూపు



మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నా సమాజంలో చిన్న చూపు చూస్తున్నారు. ఆడవాళ్ల బయటకు రాని కాలంలోనే మహిళలు ఎన్నో విజయాలు సాధించారు. కవయిత్రి మొల్ల, ఝాన్సీ లక్ష్మీబాయ్, రుద్రమదేవి వంటి వాళ్ల ఈ కోవలోకే వస్తారు. అలాంటి వాళ్ల జీవితాను చూసి నేటి తరం స్ఫూర్తిపొందుతారు. అలాగే ఈ మధ్య కాలంలో అమ్మాయిలపై అత్యాచారాలు పెరిగిపోయాయి. ఈ సమాజంలో మనం ఎలా ఉండాలి అనే విషయం నేటి ఆడపిల్లలకు తెలియడం లేదు. అది తెలియజేయాల్సిన అవసరం కూడా ఉంది. అందుకే ఉమెన్స్ డే రోజు మేము షీరోస్ కార్యక్రమం చేస్తున్నాము.

- మాఢభూషిణి రమణీ సిద్ధి, కమిటీ సభ్యురాలు

తర్వాతి తరాలకు స్ఫూర్తి



మేము మహిళా దినోత్సవం జరుపుతుంటే చాలా మంది బాలోత్సవ్‌కి మహిళలకు సబంధం ఏంటీ అని అనుకుంటున్నారు. పిల్లలు సామాజిక కార్యక్రమాల్లో భాగం పంచుకోవాలంటే ముందు వాళ్ల తల్లులు చైతన్యం కావాలి. అందు కోసమే మేము మహిళా దినోత్సవం సందర్భంగా షీరోస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. షీరోస్ అంటే మహిళా ధీరవనితలు. ఈ పుస్తకంలోని అట్టడుగు స్థాయి నుండి పైకి ఎదిగిన 70 నుండి 80 మంది పాత్రలు ఎంపిక చేశాము. వీళ్ళ జీవితాలు తర్వాతి తరానికి స్ఫూర్తిగా నిలబడతారు. ఉపాధ్యాయులు ఈ పాత్రలు చేస్తే వాళ్ల ద్వారా విద్యార్థులు కూడా స్ఫూర్తి పొందుతారు. అందుకే ఉపాధ్యాయులకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాము.

- సుజావతి, బాలోత్సవ్ కమిటీ ఉపాధ్యక్షురాలు

మనలోని ధైర్యాన్ని గుర్తించాలి



నేను టీచర్‌గా వర్క్ చేస్తున్నాను. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షీరోస్ పుస్తకంలోని కొన్ని పాత్రలు ఎంపిక చేసుకున్నాము. టీచర్స్‌తో పాటు ఆసక్తి ఉన్న మహిళలతో ఈ పాత్రలు వేయించాలనుకున్నాం. దీని వల్ల పాత్రలు చేసిన వారు, అలాగే చూసిన వారు కూడా స్ఫూర్తి పొందే అవకాశం ఉంటుంది. అయితే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళల కోసం ఏం చేస్తున్నది అనేది పెద్ద ప్రశ్న. కాబట్టి మనకు మనమే స్ఫూర్తి పొందాలి. ఆ ఆలోచన నుండే ఈ కార్యక్రమం పుట్టుకొచ్చింది. మహిళ లేనిదే జీవనం లేదు, గమనం లేదు ఈ సృష్టే లేదు. కానీ అలాంటి మహిళ ఈ పురుషాధిక్య సమాజంలో నిత్యం వివక్షకు గురౌతూనే ఉంది. మనకంటూ ఓ రోజు ఉంది. మన హక్కులను, మనలోని ధైర్యాన్ని గుర్తించేలా చేసుకోవాలి. అందుకే ఇలాంటి కార్యక్రమాల ద్వారా మహిళల్లోని శక్తిని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

- అంకమ్మ, బాలోత్సవ్ కమిటీ సభ్యురాలు

ఏడాదికోసారి..



ప్రతిఏటా మార్చి నెలలో ఆమె గుర్తుకొస్తుంది
ఆమె నెత్తిమీద అక్షర అభిషేకం జరుగుతుంది
సభలు సమావేశాలు ఊపందుకుంటాయి
దేవత.. తల్లి..ఇల్లాలు.. ప్రేమ స్వరూపిణి అంటూ
పదాలన్నీ కూర్చి పేర్చిన మాటల గులాబీ మాల
ఆమె మెడలో అందంగా అలంకరించబడుతుంది
ఆమెను వర్ణించేందుకు కలాలన్నీ కొట్లాడుకుంటాయి
కళ్ళతోను కాంక్షతోను చూపుల బాణాలు
సంధించబడతాయి
ప్రశంసల పూల జల్లులతో కీర్తి
కిరీటాలు సిద్ధమవుతాయి
ఏడాదంతా ఇకపై ఆమె కనిపించదు
ప్రతిరోజు విరిసిన కొత్త పూల పరిమళం
రాత్రిపూట మెరిసే నక్షత్రాల వెలుగులు
ఆమెపై ప్రసరింపబడవు..
కానీ..వినిపించేదొక్కటే
ఎండ వానల ప్రమేయం లేని
పని యంత్రపు చప్పుడు
కవులారా గాయకులారా
పదబంధాలను సిద్ధం చేయండి
రాగాలన్నీ ఈరోజే కూర్చండి
కీర్తనలన్నీ ఇప్పుడే పాడండి
రేపటి రోజున అంతా నిశ్శబ్దమే
అంతటా ఆవరించిన శూన్యమే
తాగి వచ్చి గొడ్డులా బాదినా
ఉదయాన్నే ఒంటిమీద గాయాలను
చీర చుట్టులో దాచుకొని పనికి పరిగెట్టాలి
ఆమె పరుగును ఆపకు
తాను తినకున్నా బిడ్డలకు బాక్సులు కట్టి
బువ్వ పెట్టి బూట్లు తొడిగి బడికి సాగనంపినప్పుడు
ఆలస్యం నీ వల్లే అని విసుక్కోకు
కుతకుతా ఉడికే అన్నంతో పాటు ఆవిరయ్యే ఆశలను
గంజి వార్చి మూతపెట్టినప్పుడు
అన్నం మాడ్చేసావని అక్కసు వెళ్ళగక్కకు
పళ్ళెంలో అన్నం పెడుతూ
అడ్డొచ్చిన పచ్చిమిర్చి కరివేపాకు
తీసి మరీ వడ్డించే ఆ ప్రేమను
పక్కనపెట్టి కంచాన్ని విసిరి కొట్టకు
కిక్కురు మనకుండా ఉన్నతనను
ఆత్మాభిమానం నీకెందుకని ఆవేశంతో అరవకు
ఎలా అణగదొక్కాలా అని
పదేపదే పథకాలు రచించకు
ఆమెలేని నీ జీవితం నీ ఊహలలో
ఒకే ఒక్కసారి నింపుకో..
నీ ఆలోచన మారుతుందేమో
నీ చుట్టూ అల్లుకున్న జీవితంలో
అపశృతులను భరించే ఆమెను చూడు
నీవు చూపే ప్రతాపం నీ పెత్తనం
ఎప్పటికీ తనమీదేనని ఆమెకు తెలుసు
ఆ సహనం అలుసుగా ఆవేశపడకు
నీకు ప్రతి రాత్రి చీకటి
ఆమెకు నీతో బ్రతుకంతా చీకటే!
ఆమెపై నీ దృష్టి సాగనంత వరకు
ఆమె కోసం నిన్ను నీవు మార్చుకోనంతవరకు
ఆమెను ఆమెగా చూడనంతవరకు
ఆమెను పొగిడే ప్రతి అక్షరం
నిన్నే ప్రశ్నిస్తుంది
సమాధానాలు చెప్పగలవా
సిద్ధం చేసుకో ఇక మొదలెట్టు..

- డా. సమ్మెట విజయ

కార్మికుల కడుపుకొట్టి
యాజమాన్యాలకు దోచిపెడతారా?

(మొదటిపేజీ తరువాయి)

వేతనాల సవరణ విషయంలో తొందరపాటును ప్రదర్శించిందన్నారు. నెల రోజులు తిరగకముందే అన్ని షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌కు డ్రాఫ్ట్ జీవోలు జారీ చేసిందన్నారు. గత జీవోలోని బేసిక్, విడిఏ పాయింట్ల రేట్లకు కలిపి కొత్త బేసిక్‌గా నిర్ణయించారని వాపోయారు. దీనివల్ల కార్మికులకు వేతనాలు ఒక్క రూపాయి కూడా పెరగలేదని చెప్పారు. పైగా గత ప్రభుత్వం పెంచిన వేతనం కన్నా తక్కువ నిర్ణయించటమేంటని ప్రశ్నించారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకత్వంతో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్ చర్చలు జరిపారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కార్యదర్శి జె వెంకటేశ్, ఎం వెంకటేశ్, కె ఈశ్వర్‌రావు, జె చంద్రశేఖర్, జె కుమారస్వామి, జి.శ్రీనివాస్, వై సోమన్న తదితరులు పాల్గొన్నారు.

దిశానిర్దేశం

(మొదటిపేజీ తరువాయి)

జరిగే తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో బీఆర్ఎస్ అధినేత పాల్గొంటారని గులాబీ వర్గాలంటున్నాయి. ఎస్ఎల్బీసీ, కాళేశ్వరం, అప్పుల విషయంలో ప్రభుత్వ తీరును సభ సాక్షిగా ఎండగడతారని అంటున్నారు. 'దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడండి కేసీఆర్..' అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ చేయడం.. మరోవైపు బీఆర్ఎస్ అధినేత సభకు రావడం లేదని హైకోర్టులో పిటిషన్ దాఖలు కావడం, అనర్హత హెచ్చరికలు కూడా కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లేందుకు కారణాలుగా చెబుతున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం నుంచే పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్, హరీశ్ రావు, కవిత, పువ్వాడ అజయ్ కుమార్, సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, పద్మారావు గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, జగదీశ్వర్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జోగు రామన్న, ఎమ్మెల్సీ కాట మధుసూదన్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, దేశపతి శ్రీనివాస్, మధుసూదనా చారి, దాసోజు శ్రావణ్ కుమార్, సబిత ఇంద్రారెడ్డి, రసమయి బాలకిషన్, బండ ప్రకాష్, వినోద్ కుమార్, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కోర్సుపై అనాసక్తి

(మొదటిపేజీ తరువాయి)

ఖాళీగానే ఉన్నాయి.

ఇంజినీరింగ్ కోర్సుల వైపు విద్యార్థులు ఆసక్తి చూపకపోవటానికి గల ప్రధాన కారణం.. తక్కువ ప్లేస్‌మెంట్లేనని విద్యావేత్తలు, నిపుణులు చెప్తున్నారు. అలాగే, మంచి కెరీర్‌ను అందించే ఇతర కోర్సులూ అందుబాటులోకి రావటమూ ఈ పరిస్థితికి దారి తీసిందని అంటున్నారు. అంతేకాకుండా, అధిక ఫీజులు, కాలం చెల్లిన పాఠ్యాంశాలు, పలు ప్రయివేటు కాలేజీలలో సరైన మౌలిక సదుపాయాలు లేకపోవటం వంటి అంశాలను ఇతర కారణాలుగా నిపుణులు వివరిస్తున్నారు.

ఏఐసీటీఈ మెంబర్ సెక్రెటరీ రాజీవె కుమార్ మాట్లాడుతూ.. ప్రయివేటు ఇన్‌స్టిట్యూట్‌లలో సీట్లు తరచూ ఖాళీగా ఉంటాయని అన్నారు. ప్రత్యేకించి గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న సంస్థల్లో ఈ పరిస్థితి ఉంటుందని చెప్పారు. టైర్2, టైర్ 3 నగరాల్లో ఉపాధి అవకాశాలను కల్పించటం తాము పరిష్కరిస్తున్న సవాళ్లలో ప్రధానమైనదని వివరించారు. దీని ఫలితంగా విద్యార్థులు ఇంజినీరింగ్ అడ్మిషన్ల కోసం పెద్ద నగరాలకు వెళ్లటాన్ని నిరోధిస్తుందని చెప్పారు. ఫలితంగా.. ఈ నగరాల్లో ఉండే ఇంజినీరింగ్ కాలేజీలలోని సీట్లు భర్తీ అవుతాయని వివరించారు. సమస్యను పరిష్కరించటం కోసం.. బీటెక్‌తో పాటు బీబీఏ, బీసీఏ వంటి అదనపు ప్రోగ్రామ్‌లను ఆఫర్ చేస్తున్న గ్రామీణ ప్రాంతాల్లోని ఇన్‌స్టిట్యూషన్లను ప్రోత్సహించటానికి, కోర్ ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం ఏఐసీటీఈ స్కాలర్‌షిప్‌లను ప్రవేశపెడుతన్నదని రాజీవె కుమార్ చెప్పారు

కొత్త ఐటీ చట్టం గోప్యతకు ముప్పు

- నూతన చట్టం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు
- రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాలరాస్తున్న కొన్ని నిబంధనలు
- దేశ ప్రజల డిజిటల్ హక్కులపై కేంద్రం దాడి : ప్రజలు, విపక్షాలు బిల్లును వ్యతిరేకించాలని కేటీఆర్ విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్ర ప్రతిపాదిత ఆదాయపు పన్ను బిల్లు, 2025పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బిల్లును పౌరుల డిజిటల్ గోప్యతకు తీవ్ర ముప్పుగా అభివర్ణించారు. ఈ బిల్లు నిబంధనలను ఆయన తీవ్రంగా ఖండించారు. పన్ను అమలు పేరుతో కేంద్ర ప్రభుత్వం అతిగా పరిధికి మించి అధికారాలను వినియోగించుకోవడానికి ఈ బిల్లు సహకరించేలా ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. "కొత్త ఆదాయపు పన్ను బిల్లు ఐటీ అధికారులకు సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్లైన్ ట్రేడింగ్ ఖాతాలపై పన్ను తనిఖీ పేరుతో అపరిమిత అధికారాలను ఇచ్చేలా ఉంది. ఈ బిల్లులో ప్రస్తావించిన 'వర్చువల్ డిజిటల్ స్పేసెస్' వేధింపులకు, దుర్వినియోగానికి, విస్తృత నిఘాకు దారితీయవచ్చు. దేశ పౌరుల ఆర్థిక డేటా ఇప్పటికే అనేక సంస్థల ఆధీనంలో ఉందనీ, ఈ కఠినమైన చట్టం పౌరుల ప్రాథమిక హక్కులను, డిజిటల్ గోప్యతను పూర్తిగా తొక్కేస్తుంది. ఈ నూతన చట్టాన్ని ఆధారంగా చేసుకుని కొంతమంది అధికారులు, ఈ నిబంధనల ద్వారా తమ అధికారాలను దుర్వినియోగం చేస్తే దానికి ఎవరిది బాధ్యతనో ప్రధాని మరియు ఆర్థిక మంత్రి సమాధానం చెప్పాలి...." అని కేటీఆర్ అన్నారు.

2025 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఆదాయపు పన్ను బిల్లు, 1961 ఆదాయపు పన్ను చట్టానికి మించి పన్ను అధికారుల అధికారాల పరిధిని విస్తృతంగా పెంచుతుందని విమర్శించారు. సెక్షన్ 247 ప్రకారం, పన్ను ఎగవేత ఆరోపణలు ఉంటే, సోషల్ మీడియా, ఈమెయిల్స్, ఆన్లైన్ ఖాతాలతో సహా ఏదైనా "వర్చువల్ డిజిటల్ స్పేస్"ను యాక్సెస్ చేసి సోదా చేయడానికి అధికారులకు అనుమతి ఇస్తుంది. ఇది 2026 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నది. సెక్షన్ 261(1)లో విస్తృతంగా నిర్వచించిన ఈ నిబంధన, స్పష్టమైన రక్షణలు లేకుండా డిజిటల్ భద్రతను అతిక్రమించడానికి అనుమతిస్తుంది. ప్రస్తుత చట్టం భౌతిక ఆస్తులపై దృష్టి పెడుతుండగా, ఈ నిబంధన దీనికి పూర్తి భిన్నంగా ఉన్నది. ఈ బిల్లు ద్వారా కేంద్ర ప్రభుత్వం పౌరులకు రాజ్యాంగబద్ధంగా దక్కిన హక్కులను హరించేలా వ్యవహరించే ప్రమాదం ఉంది. ఇది పూర్తిగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆదాయపు పన్ను వ్యవస్థకు ప్రస్తుత నిఘా వ్యవస్థలు సరిపోతాయి. ఈ అపరిమిత అధికారాలను నియంత్రించడంలో ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి సీతారామన్ దేశ ప్రజలకు వివరణ ఇవ్వాలి. ప్రస్తుతం కేంద్రం ప్రతిపాదించిన ఈ బిల్లు దేశ ప్రజలకు దక్కిన డిజిటల్ హక్కులపై జరుగుతున్న దాడి. పౌరులు, విపక్షాలు ఈ బిల్లును వ్యతిరేకించాలి......" అని కేటీఆర్ కోరారు.

ఏప్రిల్ నుంచి
ఉద్యోగుల బిల్లులు చెల్లిస్తాం

నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు విడుదల చేస్తాం

- బకాయిల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదు : ఉద్యోగ జేఏసీ నేతల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి





నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్ బిల్లుల కోసం ఉద్యోగులు తిరగాల్సిన పనిలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఏప్రిల్ నుంచి ఉద్యోగులను పెండింగ్ బిల్లులను ప్రాధాన్యతా క్రమంలో చెల్లిస్తామని చెప్పారు. నెలకు రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్ల వరకు విడుదల చేస్తామని వివరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఉద్యోగ జేఏసీ నేతలతో భట్టి విక్రమార్క సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన రూ.పదివేల కోట్ల బకాయిలను చెల్లించామని అన్నారు. దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం పడుతున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను అర్థం చేసుకుని ఒక నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన రూ.ఐదు వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో ఉంచిందని వివరించారు. గత 14 నెలల కాలంలో కొంత బకాయిలు జమ అయ్యాయని చెప్పారు. పాత, కొత్త పెండింగ్ బిల్లులు రూ.10 వేల కోట్లు తమ ప్రభుత్వం మంజూరు చేసిందని వివరించారు. మరో రూ.ఎనిమిది వేల కోట్ల బకాయిలు మిగిలి ఉన్నాయని అన్నారు. ఏప్రిల్ నుంచి ఎలాంటి బకాయిల్లేకుండా చూస్తామని చెప్పారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న రూ.ఎనిమిది వేల కోట్ల పాత బకాయిలను రానున్న ఏప్రిల్ నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రతినెల రూ.500 కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు విడుదల చేస్తామన్నారు. గత పదేండ్లు పాలించిన వారి సమయంలో ఉద్యోగులు, పెన్షనర్లకు నెలలో ఏ తేదీలో జీతాలు పడతాయో అర్థం కాని పరిస్థితి ఉండేదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగులకు ప్రతినెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున జీతభత్యాలు చెల్లిస్తున్నామని గుర్తు చేశారు. రాష్ట్రంలో దాదాపు 13 లక్షల మంది (ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్) సిబ్బంది ఉన్నారని వివరించారు. కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ తదితర బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరలో విడుదల చేస్తామన్నారు. ఉద్యోగుల ఆర్థికేతర సమస్యలను పరిష్కరించడానికి మంత్రివర్గ ఉపసంఘం సభ్యులున్నారనీ, ఆ సమస్యలు కూడా త్వరలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని వివరించారు. తమది ఎంప్లాయ్ ఫ్రెండ్లీ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, నేతలు చావ రవి, ఎ వెంకట్, ముజీబ్ హుస్సేనీ, ఎ సత్యనారాయణ, పుల్గం దామోదర్‌రెడ్డి, జి సదానందంగౌడ్, వంగ రవీందర్‌రెడ్డి, బ్యాగరి శ్యామ్, పి మధుసూదన్‌రెడ్డి, పార్వతి సత్య నారాయణ, ఎం సోమయ్య, టి లింగారెడ్డి, ఎస్ తిరుపతి, కస్తూరి వెంకటేశ్వర్లు, సత్య నారాయణ గౌడ్, ఎం అంజిరెడ్డి, మణిపాల్‌రెడ్డి, పోచయ్య, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంపై పోరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ఉదయం 11 గంటలకు ప్రజాభవన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం వద్ద అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలపై చర్చించనున్నట్టు సమాచారం. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందుకు సంబంధించిన ముసాయిదా బిల్లుకు గురువారం నాటి క్యాబినెట్‌లో ఆమోదముద్ర పడిన విషయం తెలిసిందే.

త్వరలో జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లుకు ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించాలని సర్కార్ నిర్ణయించింది. రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో మార్పు చేసి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుకునే అవకాశం కల్పించాలని కేంద్రాన్ని కోరనుంది. పెండింగ్ సమస్యలతో పాటు రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం మోడీ సర్కార్‌పై ఒత్తిడి పెంచేందుకు వీలుగా రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంట్‌లో ఒత్తిడి తేవాలనే లక్ష్యంతో ఈ సమావేశాన్ని నిర్వహించనుంది. ముఖ్యఅతిథిగా సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతున్నారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు రాష్ట్రానికి సంబంధించిన ఎంపీలందరికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి సమావేశానికి ఆహ్వానించారు.

21మంది ఐపీఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)


ఎస్పీగా నియమించి.. ఇక్కడనున్న అభిషేక్ మహంతిని ఆంధ్రప్రదేశ్‌కు రిలీవ్ చేశారు. రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహజన్‌ను అదిలాబాద్ ఎస్పీగా, సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్‌ను నార్కోటిక్ బ్యూరో ఎస్పీగా, నగర సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాన్ష్ యాదవ్‌ను యాదాద్రి డీసీపీగా, కొత్తగూడెం ఓఎస్డీ పంకజ్ పరితోష్‌ను సంగారెడ్డి ఎస్పీగా బదిలీ చేశారు. ములుగు ఓఎస్డీ మహేష్ బాబా సాహెబ్‌ను రాజన్న సిరిసిల్ల ఎస్పీగా, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అంకిత్ కుమార్ షేకావర్ వరంగల్ ఈస్ట్ డీసీపీగా, మరో ఎస్పీ ఎ.భాస్కర్‌ను మంచిర్యాల డీసీపీగా, మరో ఎస్పీ నరసింహను సూర్యాపేట ఎస్పీగా నియమించారు.పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో ఎస్పీ శిల్పవల్లిని సెంట్రల్ జోన్ డీసీపీగా, మరో ఎస్పీ సాయిశేఖర్‌ను ఎస్ఐబీ ఎస్పీగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరో ఎస్పీ కరుణాకర్‌ను పెద్దపల్లి డీసీపీగా, పి.రవీందర్‌ను ఎస్పీ సీఐడీగా నియమించారు.

12 నుంచి అసెంబ్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈనెల 12 నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేరిట అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. 12న ఉదయం 11 గంటలకు శాసనసభ, మండలి కొలువుదీరనున్నాయి. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. ఈ సమావేశాల్లోనే బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా బిల్లులపై సమగ్రంగా చర్చించి, వాటికి చట్టబద్ధత కల్పించనున్నారని సమాచారం. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం ఢిల్లీకి వెళ్లి ఈ రెండింటినీ పార్లమెంటులో కూడా ఆమోదించాలంటూ ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేయనుంది. అయితే సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై ఈనెల 13న జరిగే సభా వ్యవహారాల సంఘం (బీఏసీ) సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు.





పలువురి నివాళి...

జనార్ధన్ భౌతికకాయానికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నవతెలంగాణ సీజీఎం పి.ప్రభాకర్, ఇన్‌చార్జి ఎడిటర్ ఆర్.రమేశ్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, చుక్కరాములు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్, టి.సాగర్, జ్యోతి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మిరియం వెంకటేశ్వర్లు, ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, ఐలూ ఉపాధ్యక్షులు పార్థసారథి, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బాబూరావు, ఎస్‌వీ.రమ, భూపాల్, జె.వెంకటేశ్, ఏఐఐఈఏ మాజీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, పీఎన్ఎమ్ రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ్మ, తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ సంయుక్త ప్రధాన కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్.మూర్తి, టి.నాగరాజు, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిగ రఘు, స్టేట్ బ్యూరోచీఫ్ బీవీఎన్. పద్మరాజు, సీనియర్ జర్నలిస్టులు ఎం.కోటేశ్వరరావు, రాజకుమారి, జనరల్ మేనేజర్లు వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, శశిధర్, రఘు, మేనేజర్ వీరయ్య, బోర్డు సభ్యులు కె.ఎన్.హరి, సలీమా, అజయ్, మోహన్‌కృష్ణ, హెచ్‌యూజే కార్యదర్శి బి.జగదీశ్, తదితరులు నివాళులు అర్పించారు. సుధాభాస్కర్, రఘు, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఆయన మరణం బాధాకరం

జనార్ధన్ మృతికి సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, సీజీఎం అచ్యుతరావు, వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు.కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు.

నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్‌కు పితృవియోగం

●అనారోగ్యంతో 'గురువు' ఆర్.జనార్ధన్ మృతి ●నివాళులు అర్పించిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పలువురు నేతలు

- భౌతిక కాయం మెడికల్ కాలేజీకి అప్పగించిన కుటుంబ సభ్యులు
- సంతాపం ప్రకటించిన సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

సంతాపం ప్రకటించిన నవతెలంగాణ సీజీఎం ప్రభాకర్, సిబ్బంది

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

నవతెలంగాణ ఎడిటర్ ఆర్.సుధాభాస్కర్‌కు పితృవియోగం కలిగింది. మాజీ వెయిట్ లిఫ్టర్, ఏఐఐఈఏ యూనియన్ మాజీ నేత, అందరినోటా 'గురువు' అని అప్యాయంగా పిలిపించుకునే రూపనగుంట జనార్ధన్ (93)ఇక లేరు. శు క్రవారం తెల్లవారుజామున 2:15 గంటలకు హైదరాబాద్‌లోని గాంధీనగర్‌లో గల తన స్వగృహంలో అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు సతీమణి ఆర్.ఇంద్రావతి, ఇద్దరు కుమారులు ఆర్.సుధాభాస్కర్, ఆర్.రఘు, కుమార్తె సరళ ఉన్నారు. ఆయన పెద్ద కుమారుడు ఆర్. సుధాభాస్కర్ నవతెలంగాణ ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరో కుమారుడు ఆర్.రఘు ఆంధ్రప్రదేశ్ వామపక్ష ఉద్యమాల్లో ఉన్నారు. జనార్ధన్ పాత గుంటూరు జిల్లాలో పేద కుటుంబంలో జన్మించారు. ఆరుగురు సోదరులు, సోదరి ఉండటంతో చిన్నతనం నుంచే కుటుంబ బాధ్యతలను తలకెత్తుకున్నారు. అయినప్పటికీ ఆ కాలంలోనే ఎస్ఎస్ఎల్‌సి వరకు విద్యనభ్యసించారు. గుంటూరులో జాతీయ వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారుడు శ్రీహరిరావు వద్ద శిష్యరికం చేశారు. ఆ తర్వాత పలు రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడేవారు. కుటుంబ బాధ్యతలు మీద పడటంతో వ్యవసాయ శాఖలో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డెమానిస్ట్రేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఆంధ్రా ఇన్సూరెన్స్ కంపెనీలో చేరారు. జాతీయకరణ తర్వాత అది ఎల్ఐసీగా మారింది. ఎల్ఐసీలో సుదీర్ఘకాలం పాటు పనిచేశారు. మచిలీపట్నంలో వివేకానంద మందిరం అనే సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరు. దాని ద్వారా చాలా మంది నిరుపేదలకు వైద్యం, ఆహారం అందించడం వంటి సేవలను అందించారు. బ్రాహ్మణుడైనప్పటికీ ఆ కాలంలోనే కుల కట్టుబాట్లను తెంచేసి దళితుని పాడె మోసి అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారు. సుదీర్ఘ కాలం పాటు ఏఐఐఈఏలో కీలక పాత్ర పోషించారు. ఆ సంఘం మచిలీపట్నం డివిజన్ అధ్యక్షులుగా సేవలందించారు. యూనియన్‌కు దూరం కావద్దనే ఉద్దేశంతో ప్రమోషన్లను కూడా తీసుకోలేదు. కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా సేవలందించి దాని విస్తరణలో కీలక భూమిక పోషించారు. యూనియన్ నేతగా ఉన్నప్పటికీ ఏనాడూ తన బాధ్యతలను విస్మరించ లేదు. పనిలో అందరికీ ఆదర్శంగా ఉండేవారు. మచిలీపట్నంలో మారుతీ వ్యాయామశాలను ఏర్పాటు చేసి ఎంతో మంది యువకులకు వెయిట్ లిఫ్టింగ్‌లో తర్ఫీదునిచ్చారు. అందరినోటా గురువు అని పిలిపించుకునే స్థాయికి ఎదిగారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. హైదరాబాద్‌లోని పెద్దకుమారుడు సుధాభాస్కర్ వద్ద ఉంటున్నారు. శు క్రవారం తెల్లవారుజామున మరణించారు. ఆయన మృతదేహం కూడా నలుగురికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతో గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించాలని వారి కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యం లోనే శుక్రవారం మధ్యాహ్నం తర్వాత జనార్ధన్ భౌతికకాయాన్ని వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

---

61 ఏండ్లు దాటిన వీఆర్ఏ వారసులకు

వీఎల్‌వో పోస్టుల్లో అవకాశమివ్వాలి

సీఎం రేవంత్‌రెడ్డికి సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ లేఖ



నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో 61 ఏండ్లు దాటిన వీఆర్ఏ వారసులకు ప్రస్తుతం క్షేత్రస్థాయిలో నియమిస్తున్న విలేజ్ లెవెల్ ఆఫీసర్ (వీఎల్‌వో) పోస్టుల్లో అవకాశం కల్పించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన లేఖ రాశారు. గ్రామస్థాయి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడానికి 10,950 విలేజ్ లెవెల్ అధికారుల (వీఎల్‌వో)ను నియమించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దీన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ నియా మకాల్లో అతి తక్కువ వేతనాలతో తరతరాలుగా ప్రభుత్వానికి, ప్రజలకు సేవలందిస్తూ 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు కూడా అవకాశం కల్పించి, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలిస్తామనీ, 81, 85 జీవోలను 2023, జులై, ఆగస్టులో బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిందని గుర్తు చేశారు. జీవోలు వచ్చి రెండేండ్లు కావస్తున్నా 61 ఏండ్లు దాటిన 3,797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వకుండా కాలయాపన జరిగిందని తెలిపారు. తండ్రి ఉద్యోగం కొడుకుకు తప్పకుండా వస్తుందనే ఆశతో, ఆస్థి పంపకాల్లో భాగంగా ఉన్న కొద్దిపాటి భూమి అన్నదమ్ములకు ఇచ్చారని పేర్కొన్నారు. భూమి లేనివారు లక్షలాది రూపాయలు వడ్డీలకు అప్పులు తెచ్చి ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం అప్పులు కట్టలేక, ఉద్యోగాలు రాక ఆర్థిక ఇబ్బందులతో, మనోవేదనతో వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దీనికి కారణం వారసులకు ఉద్యోగాలిస్తామని తెచ్చిన జీవోను ప్రభుత్వాలు అమలు చేయకపోవడమేనని తెలిపారు.

వారి సమస్యల అధ్యయనం కోసం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా కమిటీని నియమించి ఏడాది దాటినా సమస్య నేటికీ పరష్కారం కాలేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా వారిపట్ల మానవతా దృక్పథంతో స్పందించి 61 ఏండ్లు పైబడిన వీఆర్ఏ వారసులను ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో నియమంచబోయే వీఎల్‌వో ఉద్యోగాల్లో అవకాశమివ్వాలని కోరారు.

టైటిల్ ముంగిట అరవింద్

ప్రేగ్ మాస్టర్స్ చెస్ ఫెస్టివల్

ప్రేగ్ (చెక్ రిపబ్లిక్) : భారత గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం ప్రేగ్ మాస్టర్స్ చెస్ ఫెస్టివల్ టైటిల్ ముంగిట నిలిచాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్లు పోటీపడతున్న టోర్నమెంట్‌లో ఎనిమిది రౌండ్ల పోటీలు అనంతరం అరవింద్ చిదంబరం అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. చెక్ రిపబ్లిక్ జీఎం డెవిడ్ నవారతో ఎనిమిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్న అరవింద్ 5.5 పాయింట్లతో ముందంజలో కొనసాగుతున్నాడు. భారత మరో గ్రాండ్‌మాస్టర్ రమేశ్‌బాబు ప్రజ్ఞానంద 5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఎనిమిదో రౌండ్‌లో ప్రజ్ఞానంద, వియత్నాం జీఎం లియాం గేమ్ డ్రాగా ముగిసింది. ఆఖరు రౌండ్లో జురెల్ (టర్కీ)తో అరవింద్, అనీశ్ (నెదర్లాండ్స్)తో ప్రజ్ఞానంద పోటీపడనున్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886